ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

కాంగ్రెస్ బుల్లెట్‌ను కాదు, బ్యాలెట్‌నే నమ్మింది
కమ్యూనిస్టు పార్టీలకు.. మావోయిస్టుల ఉద్యమానికి తేడా తెలియదా..
మీరు ఏ పార్టీతో పొత్తుపెట్టుకున్నా తప్పులేదా..
అమిత్ షాపై నిప్పులు చెరిగిన ఎంపి డాక్టర్ మల్లు రవి
04

సంపుటి 09, సంచిక: 121 | బుధవారం | 01-04-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఇద్దరు కుమారులకు ఉరేసి తల్లి ఆత్మహత్య

హైదరాబాద్‌లో దారుణం..

**మూసాపేట:** భర్త రెండో పెళ్లి చేసుకుని తనను వేధిస్తున్నాడనే కారణంతో ఓ ఇల్లాలు ఇద్దరు కుమారులకు ఉరివేసి, ఆపై తాను కూడా ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. వరంగల్ జిల్లా ఎల్లయ్యగూడెం పంచాయతీలోని మాణిక్యం తండాకి చెందిన బోడ ప్రవీణ్ అదే పంచాయతీలోని పదహారు చింతల తాండాకు చెందిన స్రవంతి (30)ని పదిహేనేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరు ప్రస్తుతం మూసాపేట పరిధి రాఘవేంద్ర సొసైటీలో నివాసముంటున్నారు. ప్రవీణ్ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తుండగా స్రవంతి హౌస్ కీపింగ్ పనులు చేస్తోంది. వీరికి కార్తిక్ (12), కౌశిక్ (10) తరువాయి 12లో



బెంగళూరులో తెలంగాణ టెకీ

## దంపతుల ఆత్మహత్య

**బెంగళూరు:** బెంగళూరులో మహావిషాదం చోటు చేసుకుంది. తెలంగాణకు చెందిన యువ టెకీ దంపతులు బెంగళూరులో విషాదకరమైన స్థితిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. తెలంగాణలోని సిద్దిపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భానుచందర్ రెడ్డి కుంట (32) సోమవారం తన అపార్ట్‌మెంట్‌లోని ఒక గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భానుచందర్ ప్రముఖ టెక్ కంపెనీ ఐబీఎంలో పనిచేస్తున్నాడు. అతని భార్య బీబీ షాజియా సిరాజ్ (31) తమ ఇంటి తలుపు తాళం వేసి తరువాయి 12లో



విమాన ఇంధనంపై

## వ్యాట్ తగ్గించండి

సీఎంలకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు లేఖ

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో ఇంధన కొరత ఆందోళనలు నానాటికీ పెరుగుతున్నాయి. దీంతో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రాష్ట్రాలకు కీలక అభ్యర్థన చేశారు. విమాన ఇంధనంపై వ్యాట్ తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ మేరకు రాష్ట్రాల సీఎంలకు ఆయన లేఖ రాసినట్లు జాతీయ మీడియా తరువాయి 12లో



## కోలుకున్న సోనియా...

ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్

**న్యూఢిల్లీ:** తీవ్ర అస్వస్థతకు గురై ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చికిత్స పొందిన కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ మంగళవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నెల 24న అస్వస్థత కారణంగా ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు కొన్ని రోజుల పాటు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించారు. చికిత్సకు ఆమె శరీరం సానుకూలంగా స్పందించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. సోనియా పూర్తి విశ్రాంతి తరువాయి 12లో



## చేతికందిన పంట నేలపాలు

### రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు

- నిజామాబాద్, నిర్మల్, జగిత్యాలలో కుదేలైన అన్నదాత
- మరో ఐదురోజులపాటు రాష్ట్రంలో వర్షాలు

ప్రజాపక్షం న్యూస్‌నెట్‌వర్క్

రాష్ట్రవ్యాప్తంగా రాత్రి కురిసిన అకాల వర్షం రైతులను నిండాముంచింది. కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలులకు వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. చేతికందొచ్చిన మామిడి పంట సైతం నేల పాలయింది. ఆరుగాలం ఎండనకా వాననకా పడిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరయ్యిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి అన్నదాతలు కుదేలయ్యారు. నిజామాబాద్ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. కళ్లాల్లో ఆరబోసిన పసుపు, ఎర్ర జొన్న, జొన్న, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. ధర్పల్లి, సిరికొండ మండలాలలో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలులకు మొక్కజొన్న, వరి పంటలు నేలకొరిగాయి. చేతికొచ్చిన మామిడికాయ పంట తరువాయి 2లో

### పసుపు రైతులను ఆదుకుంటాం

మంత్రి తుమ్మల

అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన పసుపు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తేమకు గురైన పసుపును కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తి తూకంతో తరువాయి 2లో

## అమిత్‌షాది అజ్ఞానం

- సిపిఐ రష్యా కమ్యూనిస్టు పార్టీ శాఖ అనడమేమిటి?
- లోక్‌సభలో చరిత్ర వక్రీకరణపై డి.రాజా మండిపాటు
- ఆర్‌ఎస్‌ఎస్ మూలాలే విదేశీవి
- విసిగిపోయి దాని తొలి ప్రధాన కార్యదర్శి సిపిఐలో చేరారు



**న్యూఢిల్లీ :** చరిత్రను వక్రీకరించే ముందు హోం మంత్రి దానిని అధ్యయనం చేయడం మంచిదని, పార్లమెంటుకు వాస్తవాలు కావాలే తప్ప ప్రచారం కాదని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రకటన వాట్సాప్‌లో ఫార్వర్డ్ అయ్యే చరిత్రను స్థాయికి దిగజార్చిందని విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)ని రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీ 'శాఖ' అని చెప్పడం అవాస్తం మాత్రమే కాదు, సిగ్గుచేటుతో కూడిన అజ్ఞానం అని మండిపడ్డారు. బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడిన కార్మికులు, రైతులు, విప్లవకారుల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న భారతదేశ సొంత వలస వ్యతిరేక ఉద్యమం నుండి 1925లో కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించిందని రాజా మంగళవారం ఒక ప్రకటనలో గుర్తు చేశారు. దాని అధికారికంగా స్థాపించక ముందే, 'రాచరికానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నారనే' కుట్ర కేసులను కమ్యూనిస్టు విప్లవకారులపై బనాయించి జైలులో పెట్టేవారు అని తెలిపారు. బ్రిటీష్ వలస వర్గాలలో కమ్యూనిజం పట్ల అంతటి భయం ఉండేదని, అలాంటి ఒక్క ఉదాహరణనైనా ఆర్‌ఎస్‌ఎస్ చూపగలదా? అని నిలదీశారు. లెక్కలేనన్ని విమోచన ఉద్యమాల తరహాలోనే రష్యన్ విప్లవం నుండి సిపిఐ మేధోపరమైన స్ఫూర్తిని పొందింది, కానీ దాని ఆచరణ మాత్రం భారతీయ వాస్తవాలలోనే పాతుకుపోయిందని వివరించారు. భగత్ సింగ్, సూర్య సేన్ వంటి అమరవీరులను, విప్లవకారులను, సోహన్ సింగ్ బాఖ్నా వంటి వలస వ్యతిరేక యోధులను, ఎం. సింగరవేలు వంటి కార్మిక మార్గదర్శకులను, స్వామి సహజానంద్ సరస్వతి వంటి రైతు నాయకులను, వీర్ చంద్ర సింగ్ గఢ్వాలీ వంటి ధైర్యవంతులైన దేశభక్తులను కమ్యూనిస్టు భావజాలమే అందించిందని అన్నారు. సిపిఐని లక్ష్యంగా చేసుకునే తన నిస్సారమైన ప్రయత్నంలో తరువాయి 2లో



## ప్రజాస్వామ్య పద్ధతిలో మూసీ పునరుజ్జీవం

- 15 రోజులపాటు ప్రజల అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు
- విలువైన సూచనలు చేసిన వారితో భేటీ కానున్న సబ్ కమిటీ
- అధికారులకు 24 గంటలూ మూసీ సబ్ కమిటీ సభ్యులు అందుబాటులో
- మూసీ మంత్రివర్గ ఉప సంఘం సమీక్షలో డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

మూసీ పునర్జీవనం పనులు ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతాయని, మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో musrirdc@gmail.com మెయిల్ ఐడి ద్వారా మూసీ పునర్జీవనంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మూసీ మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం రాష్ట్ర మంత్రి, మూసీ మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు పొన్నం ప్రభాకర్‌తో కలిసి మూసీ పునర్జీవనం పనుల ప్రగతిపై సవివరంగా అధికారులతో చర్చించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటిని అధికారులతో కూర్చుని విశ్లేషణ చేసి అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని డిప్యూటీ సిఎం తెలిపారు. మూసీ నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసీ ఫేజ్1, ఫేజ్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, తరువాయి 12లో

## రూ. 313 కోట్లు ప్రజాధనం పక్కదారి !

- జిహెచ్ఎంసి చెత్త నిర్వహణలో భారీ అవినీతి
- కాగ్ నివేదికలో సంచలన విషయాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం) పేరుతో వందల కోట్ల రూపాయల కుంభకోణం జరిగినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక సంచలన విషయాలను బయటపెట్టింది. చెత్తను సరిగ్గా శుద్ధి చేయకపోయినా, నిబంధనల ప్రకారం వేరు చేయకపోయినా ప్రైవేట్ సంస్థలకు రూ. 313.20 కోట్ల మేర అదనపు చెల్లింపులు జరిగాయని కాగ్ తీవ్రంగా ఆక్షేపించింది. చెత్త సేకరణ, నిర్వహణ వ్యవస్థలో ప్రణాళిక లోపాలు, పర్యవేక్షణ లోపం, ఆర్థిక అసమర్థత స్పష్టంగా కనిపిస్తున్నాయని కాగ్ నివేదిక స్పష్టం చేసింది.

**నిర్వహణ లేదు.. కానీ బిల్లులు ఫుల్ !**

2012 ఫిబ్రవరి నుంచి 2020 జూలై వరకు సుమారు 44.16 లక్షల తరువాయి 2లో



## ఉత్తమ కమ్యూనిస్టు కొండిగారి రాములు

- ఎంతో మందికి స్ఫూర్తి
- సంస్మరణ సభలో వక్తలు 12



### ఇరాన్ దాడులతో

## గల్ఫ్‌లో అగ్నిజ్వాల

### ఇరాన్ నగరాలపై అమెరికా–ఇజ్రాయెల్ క్షిపణి వర్షం

- ఇరాక్‌లో అమెరికా యూనివర్సిటీపై క్షిపణి దాడి
- ధ్వంసమైన కువైట్ చమురు ట్యాంకర్ : 24 మంది సేఫ్
- లెబనాన్‌లో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మృతి
- మరో ఇద్దరు ఐ.రా.స శాంతి సైనికులు మరణం
- అమెరికాకు ఎదురుతిరిగిన స్పెయిన్, ఇటలీ
- హోర్ముజ్ వెళ్లి ఆయిల్ తెచ్చుకోవాలని మిత్ర దేశాలకు ట్రంప్ సలహా

**దుబాయ్:** త్వరగా ఒక ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలను నేలమట్టం చేస్తామని, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేసిన మరునాడే మంగళవారం 32వ రోజు యుద్ధంలో ఇరాన్ గల్ఫ్ వ్యాప్తంగా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. అగ్నికీలలు,పొగలతో యుద్ధ జ్వాల ప్రజ్వరిల్లింది. స్టాక్‌మార్కెట్‌లో ప్రకంపనలు పుట్టాయి. ముడి చమురు ధర బ్యారెల్‌కు 106 డాలర్లకు చేరింది. యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటివరకూ 45 శాతం మేరకు ఈ ధర పెరిగింది. దీంతో గల్ఫ్‌లోని అనేక ప్రాంతాలు బాంబు పేలుళ్ళతో దద్దరిల్లాయి. ఇరాన్‌లో ప్రధాన అణుస్థావరాలపై అమెరికా దాడులు చేయడంతో పెద్ద అగ్నిగోళం తరమాలో మంటలు గాల్లోకి లేచాయి. ఇస్ఫహాన్ సహా ఇరాన్‌లోని అనేక నగరాలు పట్టణాలపై అమెరికా,ఇజ్రాయెల్ క్షిపణి వర్షం కురిపించాయి. దుబాయ్ ఓడరేవులో పూర్తిగా లోడ్ చేసిన కువైట్ చమురు ట్యాంకర్‌ను ఇరాన్ క్షిపణులు తరువాయి 2లో

## ఆయుధం వీడిన 35 మంది నక్సలైట్లు

12 మంది మహిళలతో సహా 25 మంది కార్యకర్తలు లొంగుబాటు



**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో 35 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వీరిలో 12 మంది మహిళలతో సహా 25 మంది మావోయిస్టు కార్యకర్తలు ఉన్నారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డికెఎస్‌జెడ్‌సి)కి చెందిన ఈ మావోయిస్టులందరూ బిజాపూర్‌జిల్లాలో లొంగిపోయారు. బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టలింగం చొరవతో వీరంతా జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఈ 25 మంది మావోయిస్టు కార్యకర్తల ఆచూకీ తెలియజేస్తే మొత్తంగా రూ.1.47 కోట్లు ఇస్తామని ప్రభుత్వం గతంలో రివార్డు ప్రకటించింది. దేశంలో మావోయిస్టు తీవ్రవాదాన్ని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం విధించిన మార్చి 31వ తేదీ గడువు ముగిసిపోవడానికి కొద్ది గంటల ముందుగా ఈ పరిణామం సంభవించింది. దేశంలోని రెడ్ కారిడార్‌లో మావోయిస్టు తీవ్రవాదాన్ని గడువులోపు పూర్తిగా నిర్మూలించామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరువాయి 2లో

## రేపు నాసా వ్యోమగాముల 'చంద్ర'దర్శన యాత్ర

పరిభ్రమణంతో చరిత్ర సృష్టించనున్న 'ఆ నలుగురు'

48 గంటల కౌంట్ డౌన్ షురూ



**కెన్నడీస్పేస్ సెంటర్:** చంద్రుణ్ణి చుట్టి వచ్చేందుకు నలుగురు వ్యోమగాములతో అమెరికా నాసా తలపెట్టిన ప్రతిష్ఠాత్మకమైన ఆర్టెమిస్–2 ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఫ్లోరిడా రాష్ట్రం కెన్నడీ స్పేస్ సెంటర్ నుండి భారత కాలమానం ప్రకారం గురువారం తెల్లవారుజామున 3.54 గంటలకు ఆర్టెమిస్–2 బయలుదేరుతుంది. ఈ మిషన్ ద్వారా చంద్రుడి దగ్గరకు నాసా తరుపున ప్రయాణం చేసే మొదటి మహిళా వ్యోమగామిగా క్రిస్టినా కోచ్ చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉన్నారు. ఐదు దశాబ్దాల తర్వాత నాసా ఈ సాహసోపేతం చేపట్టింది. పది రోజుల పాటు కొనసాగే ఆర్టెమిస్–2 యాత్రలో ఈ నౌక తన వ్యోమగాములను గతంలో మునుపు ఎన్నడూ లేనివిధంగా అంతరిక్షంలోకి ఎవ్వరూ వెళ్ళనంత దూరం తీసుకువెళుతుంది. ఈ ప్రయోగంలో ఊహించని పరిణామాలు ఉంటే స్పేస్ లాంచ్ రాకెట్ దానికి కొనసాగింపులో వ్యోమగాములు ప్రయాణించే ఓరియన్ స్పేస్ క్యాప్సూల్ ఉంటాయి. అపోలో తర్వాత ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు, శాస్త్రవేత్తలు, ప్రజలు ఎంతో ఆసక్తిగా గమనిస్తున్న నాసా ప్రయోగం ఇదే. మహిళా వ్యోమగామి క్రిస్టినా కోచ్‌తోపాటు మరో ముగ్గురు వ్యోమగాములలో కమాండర్ రీడ్ వైజ్‌మన్, విక్టర్ గ్లోవర్, కెన్నడీ స్పేస్ సెంటర్‌కు చెందిన జెరెమీ హాన్సెన్‌లు నిష్ణాతులైన పైలట్లు, ఇంజనీర్లు,శాస్త్రవేత్తలుగా శిక్షణపొంది చంద్రుడిచుట్టూ మొదటిసారి పరిభ్రమించబోతున్నారు. గడచిన 50 ఏళ్ళకాలంలో చంద్రుడి చుట్టూ ఏకకాలంలో పరిభ్రమించబోతున్న ప్రముఖ వ్యోమగాములుగా ఈ నలుగురూ చరిత్ర సృష్టించబోతున్నారు. ఆర్టెమిస్–2కు సారథ్యం వహించనున్న రీడ్ వైజ్‌మాన్ నేవీ టెస్ట్ పైలట్. మేరీల్యాండ్‌లోని బాల్టిమోర్‌లో జన్మించిన వైజ్‌మాన్ కేన్సర్ వ్యాధి బారిన పడిన భార్యను కోల్పోయారు. టీనేజ్‌లో ఉన్న ఇద్దరు కుమార్తెలను పెంచుకుంటూ ఎంతో గౌరవప్రదమైన జీవనం సాగిస్తున్నారు. ఇక ఈ మిషన్‌లో చంద్రుడిచుట్టూ పరిభ్రమించేందుకు ఉవ్విళ్ళూరుతున్న ఏకైక మహిళా వ్యోమగామి క్రిస్టినా కోచ్ భౌతికశాస్త్రవేత్త, ఇంజనీర్. 2019లో సుదీర్ఘంగా 328 రోజులపాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడిపి గొప్ప రికార్డు సృష్టించారు. మిచిగాన్‌లోని గ్రాండ్ రాపిడ్స్‌లో జన్మించి నార్త్ కరోలినాలో ఎదిగిన కోచ్ పూర్తిస్థాయిలో స్పేస్‌వాక్ చేసిన మహిళగా రికార్డు సృష్టించారు. ఇక 2009లో కెన్నడీ స్పేస్ సెంటర్‌లో చేరిన జెరెమీ హాన్సెన్ రాయల్ కెనడియన్ ఎయిర్‌ఫోర్స్ మాజీ ఫైటర్ పైలట్. ఆయన ఇంతవరకూ అంతరిక్షంలోకి వెళ్ళకపోయినాగానీ అనేకమంది వ్యోమగాములకు శిక్షణ ఇవ్వడంలో పాల్గొన్నారు. ఆయన వివాహితుడు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. 2013లో నాసా వ్యోమగామిగా ఎంపికైన విక్టర్ గ్లోవర్ నాసా స్పేస్ ఎక్స్ క్రూ–1 మిషన్ పైలట్‌గా పనిచేశారు. కాలిఫోర్నియాలోని పోమోనాలో జన్మించిన గ్లోవర్ వివాహితుడు. నలుగురు పిల్లలు ఉన్న తండ్రి. చంద్రుడిపైకి వెళ్ళిన మొదటి నల్లజాతీయుడుగా రికార్డు సృష్టించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు.

# యుద్ధ ముగింపు వ్యూహ రచనలో ట్రంప్?

హోర్ముజ్ తెరవకపోయినా పట్టించుకోకూడదనే...!

ఆరు రోజుల్లో ఏదో ఒకటి తేల్చాల్సిందే

వాల్‌స్ట్రీట్ జర్నల్ తాజా కథనం

యావత్ ప్రపంచం ఇరాన్ పక్షానే...

సర్వత్రా వ్యతిరేకత

గగనతలం ఇచ్చేందుకు తిరస్కరించిన ఇటలీ, స్పెయిన్



**టెహ్రాన్:** యుద్ధం ఒక నెలరోజులు పూర్తిచేసుకుని రెండోనెలలోకి ప్రవేశించిన తరుణంలో యావత్ ప్రపంచం యుద్ధానికి వ్యతిరేకంగా మారుతోంది. అది పరోక్షంగా ఇరాన్ అనుకూల వాతావరణమే. ఇంటా,బయటా దౌత్యపరంగా, సర్వత్రా ట్రంప్‌కు తీవ్ర వ్యతిరేకత రోజు రోజుకూ పెరుగుతున్న పరిస్థితుల్లో యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ కొత్త వ్యూహాలు పన్నుతున్నారని వాల్ స్ట్రీట్ జర్నల్ (డబ్ల్యుఎస్‌జె) మంగళవారం సరికొత్త కథనం ప్రచురించింది. యుద్ధం ముగించాలంటే హోర్ముజ్ జలసంధిని తెరపించాల్సిందేనని ట్రంప్ ఇప్పటివరకూ పట్టుదలతో ఉన్నారు. హోర్ముజ్‌ను తెరిపించినప్పుడే అమెరికా పరువు దక్కుతుందన్న ఆలోచనలో ఉన్నారు. కానీ తాజాగా ట్రంప్ కొత్త బాట పట్టారు. ప్రపంచ వాణిజ్యానికి అతిముఖ్యమైన హోర్ముజ్ జలసంధిని తెరిపించడం యుద్ధ ముగింపునకు ఇంకెంతోకాలం ముఖ్యమైన విషయం కాదని తన సహాయకులకు ట్రంప్ చెప్పారని డబ్ల్యుస్‌జె పేర్కొంది. కాదూ...కూడదని హోర్ముజ్‌ను తెరిపించేందుకే ముందుకు వెళితే యుద్ధం అనుకున్నదానికంటే చాలా ఎక్కువకాలం కొనసాగుతుందని కూడా పెంటగాన్ అధికారులు అంచనావేశారు. ఇప్పటికే అమెరికా ఉభయచర నైపుణ్య దళాలు పశ్చిమాసియాకు చేరి కయ్యానికి కాలుదువ్వేందుకు ఉత్తర్వులకోసం ఎదురుచూస్తున్నాయి. తమ విద్యుత్ వ్యవస్థలను ధ్వంసం చేసినా, ఖర్గ్ ద్వీపం జోలికి వెళ్ళినా అంతమవుతారని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. ఇప్పటివరకూ ట్రంప్ మూడు విడతలుగా ఇచ్చిన గడువు ఏప్రిల్ ఆరో తేదీనాటికి ముగిసిపోతుంది. అందువల్ల ఆనాటికి ట్రంప్ ఏదో ఒక కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఆ ఆరు రోజులే అమెరికాను, ప్రపంచాన్ని మలుపుతిప్పే కాలం కాగలదని నిపుణులు అంచనావేస్తున్నారు. దీనికి భిన్నంగా ఈ లోపు ఇరాన్‌ను అనివార్యంగా దౌత్యమార్గం పట్టించేందుకు ఆ దేశ నౌకాదళ, క్షిపణి సామర్థ్యాలను తీవ్రస్థాయిలో బలహీనపరచే ఎత్తుగడలు కూడా కొనసాగుతున్నాయి. ఒకవేళ విఫలమైతే ఈ విషయంలో నాయకత్వం వహించాల్సిందిగా యూరప్, గల్ఫ్‌దేశాల్లో మిత్రదేశాలపై అమెరికా మరింత తీవ్రంగా ఒత్తిడి పెంచే అవకాశాలు ఉన్నాయి. శత్రుదేశాలకు హోర్ముజ్ జలసంధిలో అనుమతి లేదని ఇరాన్ గడచిన నెలరోజుల్లో అనేకసార్లు ప్రకటించింది. కొత్తగా టోల్ వసూలు చేసేందుకు ఇరాన్ పార్లమెంటులో చట్టం తీసుకువచ్చేందుకు కూడా ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంతకుమించిన స్థాయిలో అమెరికాలో ట్రంప్ రేటింగ్ కనిష్ఠస్థాయికి పడిపోయింది. చర్చల పేరుతో బెదిరింపులు బెడిసికొట్టాయి. ఇరాన్ విషయంలో తప్పుడు అంచనాలు వేశారని పెంటగాన్ చెప్పినా వినలేదనే కథనాలు పుంఖాను పుంఖాలుగా వస్తున్నాయి.

ఈ ఏడాది నవంబరులో ద్వైవార్షిక ఎన్నికలున్నాయి. ఈ ఎన్నికల్లో ఓడిపోతే ఇక రాబోయే రెండు సంవత్సరాల్లో ట్రంప్ కుక్కిన పేనులా పడి నరకం చూసే పరిస్థితులు ఎదురుకావచ్చు.గడచిన ఆదివారమే ట్రంప్‌కు దేశంలో అతిపెద్ద షాక్ ఎదురైంది. అమెరికాలోని అన్ని రాష్ట్రాలలో, చిన్న చిన్న పట్టణాలలో,రూరల్ ప్రాంతాలలో అనేకలక్షల మంది ఉప్పెనలా ట్రంప్ వ్యతరేక ప్రదర్శనలు చేశారు. ''నో కింగ్స్...'' నినాదాన్ని ప్రజలు మళ్ళీ మూడోసారి తెరమీదకు తీసుకువచ్చారు. యూరప్, ఇజ్రాయెల్‌లో కూడా ఏకకాలంలో ఇదే పరిస్థితి ఎదురైంది. ఈసారి జరిగిన ప్రదర్శనలు, నిరసనలు నభూతో...అన్న స్థాయిలో జరిగాయి. అమెరికా సుప్రీంకోర్టు తీర్పులు, అన్ని దేశాలలో పెరుగుతున్న వ్యతిరేకత, మిత్రదేశాల అసహనం, నాటో దేశాలు యుద్ధానికి దూరంగా జరిగిపోవడం, గగనతల దాడులకు కలిసిరాకపోవడం, పదే పదే విజ్ఞప్తులు చేసినాగానీ తమ ఆర్థిక వ్యవస్థలను బలిపెట్టి ముందుకు వచ్చేందుకు యూరప్ దేశాలు సిద్ధం కాకపోవడం,ముఖ్యంగా బ్రిటన్ ప్రధాన మంత్రి స్టార్‌మర్‌తో తీవ్రస్థాయిలో సంబంధాలు చెడిపోవడం, ఫ్రాన్స్ వ్యతిరేకత, స్పెయిన్, ఇటలీ దేశాలు బాహాటంగా అమెరికా యుద్ధ విమానాలకు తమ తమ గగనతల వ్యవస్థలను వాడుకోవడానికి తిరస్కరించడం, ఐక్యరాజ్యసమితిలో తీవ్ర వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపించడం, ఇజ్రాయెల్ దేశమే అమెరికాను యుద్ధంలో ఇరికించిందని, ట్రంప్ కంటే గతంలో ఉన్న అమెరికా అధ్యక్షులే ఇజ్రాయెల్ వలకు చిక్కకుండా ఎంతో విజ్ఞతతో వ్యవహరించారని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తం కావడం వంటి అనేక పరిణామాలు ట్రంప్‌ను తీవ్ర ఒత్తిడి గురిచేస్తున్నాయి. ఆయను ఈ ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లు స్తంభించిపోతున్నాయి. అమెరికా ప్రతిష్ట చరిత్రలో ఎన్నడూలేనివిధంగా దిగజారుతోంది. చమురు ధర బ్యారెల్‌కు 115 డాలర్లకు తగ్గి కిందకు రావడంలేదు. జపాన్, దక్షిణ కొరియా వంటి అమెరికా మిత్రదేశాలతోపాటు అనేక దేశాలలో చమురు సంక్షోభం నెలకుంది.

**యుద్ధం కొనసాగించమంటున్న గల్ఫ్ దేశాలు!**


వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనానికి భిన్నంగా మరో కథనం వెలుగులోకి వచ్చింది. ఇరాన్‌లో యుద్ధం కొనసాగించాలని సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాయకత్వానగల గల్ఫ్‌లోని పలు దేశాలు అమెరికాకు విజ్ఞప్తి చేశాయట! ఇరాన్‌పై సైనిక కొనసాగించాలని పలు గల్ఫ్ దేశాలు కోరుతున్నాయని అమెరికా,ఇజ్రాయెల్, పర్షియన్ గల్ఫ్ దేశాలకు చెందిన పేరుచెప్పడానికి ఇష్టపడని అధికారులు ప్రకటించారని అసోసియేటెడ్ ప్రెస్ తెలియజేసింది. ఇస్లామిక్ రిపబ్లిక్ దేశంలో సమూల మార్పులు వచ్చేవరకూ, లేదా ఆ దేశ నాయకత్వ వైఖరిలో మార్పు వచ్చేవరకూ సైనిక చర్య కొనసాగించాలని ఆ దేశాలు కోరుతున్నాయట! యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, బహ్రైన్ అధికారులు ప్రైవేటు సంభాషణల్లో ఈ విషయం చెప్పారని ఎ.పి తెలియజేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియాలపై ఇరాన్ ఎక్కువగా దాడులు చేస్తోంది. వారు ఇరాన్‌పై ఆగ్రహంతో ఉన్నారు. కానీ ఒమన్,ఖతార్ దేశాలు మాత్రం దౌత్య చర్చల వైపు మొగ్గుచూపుతున్నాయి.

## ఉక్రేన్‌లో 12 మంది యూరప్ విదేశాంగమంత్రుల సమావేశం

**కీవ్:** యూరప్‌కు చెందిన 12 దేశాల విదేశాంగ మంత్రులు మంగళవారం ఉక్రేన్‌లో సమావేశం జరిపారు. ఉక్రేన్ రాజధాని కీవ్ సమీపంలోని పట్టణంలో రష్యా దళాలు అరాచకాలకు పాల్పడి నారలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మిత్రదేశానికి సంఘీభావం ప్రకటించేందుకు యూరప్ విదేశీ మంత్రులు కీవ్ చేరుకున్నారు. 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించింది. రష్యా బృందాలు ఉక్రేన్ ప్రాంతాలను ఆక్రమించి నెలరోజులపాటు బుచాలో ఉన్నాయి. ఆ తర్వాత రష్యా దళాలు వెళ్ళిపోయాయి. ఆ ప్రాంతం నుండి 400 మంది మృతదేహాలను ఉక్రేన్ క్లీనింగ్ ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకుంది. అప్పటినుండీ పరస్పర దాడులతో యూరప్‌లో తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల ఉక్రేన్‌లో శాంతి ప్రయత్నాలు పూర్తిగా మూలనపడ్డాయి. ఈ సందట్లో ఇరు దేశాలు చేసుకుంటున్న పరస్పర దాడులు కూడా ప్రపంచవార్తల్లో అందరి దృష్టికీ రావడంలేదు. 12 మంది మంత్రులతోపాటు కిందిస్థాయి అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉక్రేన్ విదేవీమంత్రి ఆంద్రీ సైబిహా వారికి స్వాగతం పలికారు.



## వెనిజులాలో అమెరికా ఎంబసీ పునఃప్రారంభం



**కారకస్:** వెనిజులాలో అమెరికా దౌత్య కార్యాలయం తిరిగి ప్రారంభమైంది. కారకస్‌లో తమ దౌత్య కార్యాలయం తిరిగి తన కార్యకలాపాలు ప్రారంభిస్తుందని అమెరికా ప్రకటించింది. జనవరి ఐదో తేదీన వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన సతీమణిని కిడ్నాప్‌చేసి అమెరికాకు తరలించిన మూడు నెలల తర్వాత వైట్‌హౌస్ యంత్రాంగం ఈ ప్రకటన చేసింది. వెనిజులాలో మా దౌత్య ఉనికి కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ఒక అధికారి వ్యాఖ్యానించారు. పదవీచ్యుతుడైన మదురోస్థానంలో దేశాధ్యక్ష బాధ్యతలు తీసుకున్న డెల్సీ రోడ్రిగ్జ్ అమెరికా అనుకూలంగా పనిచేస్తున్నారని ట్రంప్ అనేకసార్లు ప్రకటించారు. 2019 మార్చి నుండి వెనిజులాలో అమెరికా దౌత్య కార్యాలయం మూతపడింది. నికొలస్ మదురో అనుసరించిన సామ్రాజ్యవాద వ్యతిరేక, చమురు దోపిడీ వ్యతిరేక విధానాల కారణంగా వెనిజులాపై అమెరికా ఆగ్రహం పెంచుకుంది. 2010 నుండి వెనిజులాలో అమెరికా రాయబారి లేరు. కారకస్‌లో ఉన్న చార్జి డి.అఫైర్స్‌ను 2018లో మదురో బహిష్కరించారు. ఆ తర్వాత అక్కడి నుండి తన దౌత్య సిబ్బందిని అమెరికా ఉపసంహరించుకుంది. ప్రస్తుతం మదురో, ఆయన సతీమణి న్యూయార్క్ జైలులో కోర్టు విచారణ కోసం ఎదురుచూస్తున్నారు.

# ప్రజాధనం పక్కదారి !

(మొదటి పేజీ తరువాయి)

మెట్రిక్ టన్నుల పొడి చెత్తను శాస్త్రీయంగా నిర్మూలించాల్సి ఉంది. ఒప్పందం ప్రకారం జవహర్ నగర్ యార్డులో తడి చెత్తతో ఎరువులు, పొడి చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేయాలి. అయితే, ఎనిమిదేళ్ల పాటు పొడి చెత్తను కేవలం గుట్టలుగా నిల్వ చేసి, ఎలాంటి శుద్ధి చేయకుండానే 'టిప్పింగ్ రుసుము' పేరుతో రాంకీ సంస్థకు భారీగా నిధులు చెల్లించినట్లు కాగ్ నిర్ధారించింది. అధికారులు ఉద్దేశపూర్వకంగానే ప్రైవేట్ ఏజెన్సీకి లబ్ధి చేకూర్చారని నివేదిక స్పష్టం చేస్తోంది.

**కాగ్ నివేదికలోని ముఖ్యాంశాలు..**

* సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు, ఇతర స్థానిక సంస్థల నుంచి రావాల్సిన రూ. 47.77 కోట్ల టిప్పింగ్ రుసుమును వసూలు చేయడంలో జిహెచ్‌ఎంసి విఫలమైంది.
* రోజుకు 100 కిలోల కంటే ఎక్కువ చెత్త ఉత్పత్తి చేసే రైల్వే స్టేషన్‌ల వంటి సంస్థల నుంచి సాధారణ రుసుములే వసూలు చేస్తూ ఆదాయానికి గండి కొట్టారు.
* నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాల్సిన ప్రత్యేక పర్యావరణ నిధిని ఏర్పాటు చేయకపోవడం వల్ల రూ. 2.29 కోట్ల ఆదాయ నష్టం వాటిల్లింది.
* నిర్మాణ వ్యర్థాల (సి అండ్ టి ) నిర్వహణకు సరైన చట్ట సవరణలు చేయకపోవడంతో జీడిమెట్ల, ఫతుల్లాగూడ కేంద్రాల్లో సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలు పేరుకుపోయాయి.

**వేరు చేయని చెత్త – వీడని తిప్పలు**

నగరంలో తడి, పొడి చెత్త వేరు చేయడం అనేది కాగితాలకే పరిమితమైంది. ఇళ్ల వద్ద తడి, పొడి చెత్తను వేరు చేయాలని నిబంధనలు ఉన్నా, క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదు. ప్రజలు వేరు చేసి ఇచ్చినా, రవాణా వాహనాల్లో మళ్ళీ కలిపి వేస్తున్నారని, దీనివల్ల డంపింగ్ యార్డుల వద్ద నిర్వహణ భారంగా మారుతోందని కాగ్ ఆక్షేపించింది. ఇప్పటికైనా జిహెచ్‌ఎంసి తన నిర్వహణ తీరును మార్చుకోవాలని, వినియోగదారుల ఛార్జీల వసూలుపై సమీక్ష చేపట్టాలని నివేదిక స్పష్టం చేసింది.

**ప్రాసెస్ చేయకుండానే బహిరంగ ప్రదేశాల్లోకి..**

రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల్లోనూ పరిస్థితి దారుణంగా ఉందని కాగ్ ఎత్తిచూపింది. డంపింగ్ యార్డులకు భూములు కేటాయించకపోవడంతో, 50 శాతానికి పైగా చెత్తను ప్రాసెస్ చేయకుండానే బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. ఇది ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తోంది.

# గల్ఫ్‌లో అగ్నిజ్వాల

(మొదటి పేజీ తరువాయి)

ధ్వంసం చేశాయి. దీంతో ట్యాంకర్ మంటల్లో దగ్ధమైంది. కానీ అందులో ఉన్న 24 మంది సిబ్బంది మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. అదేవిధంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అమెరికా రాడార్ కేంద్రంపై ఇరాన్ దాడులు చేసింది. అనేక ప్రాంతాలపై క్లస్టర్ బాంబు దాడులతో ఇజ్రాయెల్‌ను గడ గడ లాడించింది. టెల్‌అవీవ్‌పై చేసిన క్షిపణి దాడిలో తొమ్మిదిమంది గాయపడ్డారు. ఇరాక్ సులేమానియాలో ఉన్న అమెరికా విశ్వవిద్యాలయంపై ఇరాన్ క్షిపణులు మంగళవారం పూర్తిస్థాయిలో దాడులకు దిగాయి. దీంతో యూనివర్సిటీలో ఉన్న విద్యార్థులు, సిబ్బంది ప్రాణభయంతో గడగడలాడిపోయారు. యూనివర్సిటీ ప్రాంగణంలో భారీపేలుళ్ళు సంభవించాయి. ఇటీవల టెహ్రాన్‌లో ఉన్న సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ, ఇస్ఫహాన్ టెక్నలాజికల్ యూనివర్సిటీలపై ఇటీవల అమెరికా,ఇజ్రాయెల్ గగనతల దాడులు చేసిన తర్వాత, గల్ఫ్‌వ్యాప్తంగా ఉన్న అమెరికా విశ్వవిద్యాలయాలు, విద్యుత్ వ్యవస్థలపై దాడులు చేస్తామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ హెచ్చరిక చేసిన నేపథ్యంలో ఈ దాడి జరిగింది. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇరాన్ వ్యాప్తంగా బాంబుదాడులు చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో అనేక వారాలపాటు యుద్ధానికి తాము సిద్ధంగా ఉన్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

మరోవైపు దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా చేసిన దాడుల్లో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. అదేవిధంగా ఐక్యరాజ్యసమితి తరపున పనిచేస్తున్న శాంతి దళాలకు చెందిన మరో ఇద్దరు సైనికులు మరణించారు. అదేసమయంలో ఇరాన్‌పై దాడులు చేసేందుకు అమెరికా తమ తమ గగనతల వ్యవస్థలను ఉపయోగించుకోవడానికి స్పెయిన్, ఇటలీ దేశాలు తిరస్కరించాయి. దీంతో నాటో కూటమిలో పెద్ద చీలిక వచ్చినట్టుగా ఇరాన్ భావిస్తోంది. మిత్రదేశాలే అమెరికాకు సహాయం చేసేందుకు తిరస్కరించడంతో ఇరాన్ శిబిరంలో తమ వైఖరి సరైనదేనని మరింత ఆత్మవిశ్వాసం తొణకిసలాడుతోంది. కాగా నెలరోజులుగా జరిగిన యుద్ధంవల్ల ఇరాన్‌లో 3,492 మరణించారు. వీరిలో 1,574 మంది సామాన్య ప్రజలు కాగా, 236 మంది పిల్లలు ఉన్నారు. ఇజ్రాయెల్‌లో 19 మంది మరణించగా, లెబనాన్‌లో, 1,247 మంది మరణించారు. 10 లక్షలమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. గల్ఫ్‌దేశాలపై ఇరాన్ చేసిన దాడుల్లో నెలరోజుల్లో 24 మంది మరణించారు. వీరిలో 11 మంది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో మరణించారు. గల్ఫ్ మృతుల్లో ఎనిమిదిమంది భారతీయులు ఉన్నారు.

**హోర్ముజ్ వెళ్ళి.. ఆయిల్ తెచ్చుకోండి!**

**మిత్ర దేశాలకు ట్రంప్ సలహా**

హోర్ముజ్ జలసంధికి వెళ్ళి మీ ఆయిల్‌ను మీరే తెచ్చుకోవాలని డోనాల్డ్ ట్రంప్ నాటో మిత్ర దేశాలకు సలహా ఇచ్చారు. ''మీకోసం మీరు పోరాటం చేయండి'' అని పిలుపు ఇచ్చారు. జెట్ ఇంధనం కూడా లేకుండా తీవ్ర సంక్షోభంలో ఉన్న యూరప్, నాటో మిత్రదేశాలు హోర్ముజ్‌కు వెళ్ళి వారి చమురును వారే తెచ్చుకోవాలని కోరారు. ''మీ దగ్గర కనీస అవసరాలకు కూడా జెట్ ఇంధనం లేదు, కానీ మా దగ్గర పుష్కలంగా ఉంది, మేం మీకు ఇస్తాం, మా దగ్గర కొనుక్కుని మీరు హోర్ముజ్‌కు వెళ్ళండి, అక్కడ కదలకుండా నిలిచిపోయిన మీ చమురు నౌకలను మీరే తెచ్చుకోండి, కొంచెం అలస్యమైనా ఫర్వాలేదు, మీరందరూ ధైర్యం తెచ్చుకోండి, మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోవాలి,మీరు మాకు కష్టకాలంలో ఎలాగైతే అండగా నిలబడలేదో, అదేవిధంగా ఇకమీదట అమెరికా కూడా మీకు అండగా ఉండదు, మీకు అమెరికా ఉండదు, మీకోసం మీరు ఎలా పోరాటం చేయాలో ఇకమీదట నేర్చుకోండి'' అని తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పోస్టింగ్ పెట్టారు. అసలు ఫ్రాన్స్ ఎంతమాత్రం సహాయం చేయడంలేదని విమర్శించారు. రాబోయే రోజులు మరింత సంక్లిష్టమైనవని ఈ సందర్భంగా అమెరికా రక్షణమంత్రి పెట్ హెగ్సెత్ వ్యాఖ్యానించారు.

# అమిత్‌షాది అజ్ఞానం

(మొదటి పేజీ తరువాయి)

అమిత్ షా ఈ మహోన్నత త్యాగాలు, పోరాటాల వారసత్వాన్ని మొత్తంగా అవమానించారని మండిపడ్డారు. ఇక ఆర్‌ఎస్‌ఎస్, దాని భావజాల, సంస్థాగత మూలాలు విదేశీ, ఆందోళనకరమైనవని రాజా అన్నారు. బి.ఎస్. మూంజే వంటి వ్యక్తులు బెనిటో ముస్సోలినీతో సంబంధాలు పెట్టుకున్నారని, అడాల్ఫ్ హిట్లర్ విధానాలను ఎం.ఎస్. గోల్వాల్కర్ ప్రశంసించారని గుర్తు చేశారు. అంతకంటే ముఖ్యమైనది ఆర్‌ఎస్‌ఎస్ మొదటి ప్రధాన కార్యదర్శి బాలాజీ హుద్దార్ ప్రస్థానమని పేర్కొన్నారు. భారతదేశాన్ని బ్రిటీష్ వలస పాలనలో ఉంచడంలో హెడ్గేవార్ విధేయత,భాగస్వామ్యంతో విసిగిపోయిన బాలాజీ సిపిఐలో చేరేందుకు ఆ సంస్థను విడిచిపెట్టారని తెలిపారు. వలసవాద అధికారాన్ని ఎదుర్కొన్నందుకు కమ్యూనిస్టులు జైలు శిక్షలు, బహిష్కరణలు, అణచివేతలను ఎదుర్కొంటుండగా, ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం వలస వ్యతిరేక పోరాటాలకు దూరంగా ఉంటూ, విధేయతతో, సహకార ధోరణితో వ్యవహరించిందని విమర్శించారు. కాలాపానీ బ్యారక్(జైళ్ళు)లు కమ్యూనిస్టు విప్లవకారులతో నిండిపోగా, మితవాద నాయకులు బ్రిటీష్ వారు ఇచ్చే పెన్షన్లపై ఆధారపడి బతికారని తెలిపారు. నేడు 'విదేశీ సంబంధాల' గురించి మాట్లాడేవారే ప్రపంచ అధికార కేంద్రాలు, కార్పొరేట్ ప్రయోజనాలతో చేతులు కలపడం అత్యంత విడ్డూరమని అన్నారు.

ప్రధాని మోదీ బహిరంగంగా ఇజ్రాయిల్‌ను 'పితృభూమి' అని పేర్కొన్నప్పుడు, డొనాల్ ట్రంప్ వంటి ఎప్‌స్టీన్ వర్గానికి బిజెపి సేవ చేస్తున్నప్పుడు, దేశభక్తిపై ఇచ్చే ఉపన్యాసాలు డొల్లగా వినిపిస్తున్నాయన్నారు. క్షేత్రస్థాయి వాస్తవం మరింత కఠోరమైనదని, గిరిజనుల స్థానభ్రంశం, కార్పొరేట్‌ల ప్రసన్నం కోసం హింస, మూకదాడులు మతపరమైన విభజనలతో కూడిన మితవాద అతివాద వాతావరణం, ఇవే ఆర్‌ఎస్‌ఎస్– బిజెపి రాజకీయాల వాస్తవ ఫలితాలు అని విమర్శించారు. భారతదేశంలోని వామపక్షం సహజసిద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా, ప్రజల పోరాటాలలో పాతుకుపోయి ఉన్నదన్నారు.

# పసుపు రైతులను ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు చేయనున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరో సా ఇచ్చారు. ఇందుకు సంబంధించి మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం నాటికి సుమారు 4,500 పసుపు కుప్పలు (27,400 బస్తాలు) రాగా, సుమారు 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడంతో గత అర్ధరాత్రి సంభవించిన బలమైన గాలులు, వర్షాల ప్రభావంతో సుమారు 35–40 మంది రైతులకు చెందిన 70–80 పసుపు కుప్పలు తేమకు గురయ్యాయి. దీంతో తడిసిన పసుపును కూడా ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని, మేలురకం పసుపుకు ప్రభుత్వం ఖరారు చేసిన ధరల ప్రకారం రైతులకు చెల్లింపులు జరిగే విధంగా చూడాలని మంత్రి ఆదేశించారు.తేమ శాతం, కోతల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేసే మార్కెట్ యార్డు అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మార్కెట్ యార్డు సెక్రటరీలు, డైరెక్టర్, సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# నేలపాలు

(మొదటి పేజీ తరువాయి)

నేలపాలయ్యింది. 'రాత్రి ఆకాల వర్షంతో పసుపు, మొక్కజొన్న పంట నిర్మల్ నియోజకవర్గంలోనే చాలా ఘోరంగా ఉంది. పసుపును తొమ్మిది నెలలు పండించి, చేతికొచ్చిన పంట అమ్ముకుంటామనే సమయానికి ఇలా అయింది. ఆ పసుపును ఉడకబెట్టి కష్టపడి అంత చేస్తే రాత్రి అనుకోకుండా వర్షం రావడంతో తడిసి ముద్దయింది. దీనికి ఏమైనా ప్రభుత్వం స్పందించి సహాయం చేయగలరని కోరుకుంటున్నాం' ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఈదురు గాలులతో కూడిన వర్షం**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ఆరబెట్టిన మక్కలు తడిసిపోయాయి. నిర్మల్ జిల్లాలో కురిసిన అకాల వర్షానికి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన మామిడి పంట నేలపాలయ్యింది. కళ్లల్లో ఆరబెట్టిన పసుపుకొమ్ములు తడిసి ముద్దయ్యాయి. మంచిర్యాల జిల్లా దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలలో రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామంలో 20 ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరగడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన మామిడి పంట నేలపాలు కావడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

'రాత్రి అనుకోకుండా పెద్ద ఎత్తున గాలి, ధుమారం, పిడుగులు, వర్షాలు వల్ల చేతికొచ్చిన పంటలు మొక్కజొన్న, జొన్న, నువ్వు పంటలకు దాదాపు నష్టం జరిగింది. పసుపును ఉడుకబెట్టి రేపు, ఎల్లుండి రెడీ చేసుకొని అమ్ముకోవాలనుకున్నాం. కానీ ఇప్పుడు తడిసి ముద్దయింది' అని మరో బాధితుడు చెప్పారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి, మల్లాపూర్ , కథలాపూర్, పెగడపల్లి గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి గాలి దుమారంతో కూడిన అకాల వర్షం రైతులను నిలువుగా ముంచింది. మామిడి మొక్కజొన్న రైతులను కోలుకోకుండా చేసింది.కొన్ని గ్రామాల్లో నువ్వు పంట కూడా నేల పాలయింది. సోమవారం రాత్రి వచ్చిన గాలులకు మొక్కజొన్న నేలవాలగా, మామిడికాయలు రాలిపోయాయి. కళ్ళల్లో ఆరబోసిన పసుపు తడిసింది. కోత కోసి అమ్మే దశలో మొక్కజొన్న,అసలే అంతంత మాత్రం కాపుకొచ్చిన మామిడి ఈదురు గాలులకు వర్షార్పణం అయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన మొక్కజొన్న దెబ్బ తినడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. మంచిర్యాల జిల్లావ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం తీవ్ర విషాదాన్ని నింపింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి గాలివాన విరుచుకుపడటంతో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయల తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మందమర్రి, నెన్నెల, భీమారం, జన్నారం, హాజీపూర్ మండలాల పరిసరాల్లో చేతికొచ్చిన మామిడి పంట రాలిపోయి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

**తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు: వాతావరణ శాఖ**

ద్రోణి, గాలి అనిశ్చితితో పాటు ఉపరితల చక్రవాకం ప్రభావంతో తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ, రేపు ఉరుములు మెరుపులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపారు.

# 35 మంది నక్సలైట్లు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం లోక్‌సభలో ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఇటీవలికాలంలో భద్రతాదళాలు బిజాపూర్‌లోని ఒక రహస్య నిల్వ కేంద్రం నుండి రూ.2.90 కోట్లు నగదు, 93 ఆయుధాలు, రూ.11.16 కోట్లు విలువగల 7.20 కేజీల బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల ఉద్యమ చరిత్రలో ఎన్నడూలేనివిధంగా భారీస్థాయిలో ఈ నిల్వలను ఇటీవల స్వాధీనం చేసుకున్నామని సీనియర్ అధికారులు చెప్పారు. కాగా ఈనెలారంభంలో మావోయిస్టులు రహస్యంగా దాచి ఉంచిన ఒక నిల్వ కేంద్రం నుండి రూ.5.37 కోట్లు విలువైన ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో రూ.1.64 కోట్లు విలువైన కేజీ బంగారం, రూ. 3.73 కోట్లు నగదు స్వాధీనం చేసుకున్నారు. పైన చెప్పినట్లు కొత్తగా స్వాధీనం చేసుకున్న నిల్వలతో మొత్తం స్వాధీనం చేసుకున్న ఆస్తులు రూ.19.43 కోట్లకు చేరుకోగా ఇందులో రూ.6.63 కోట్లు నగదు, రూ.12.80 కోట్లు విలువైన 8.20 కేజీల బంగారం ఉన్నట్లు అధికారులు చెప్పారు. అదేవిధంగా నాలుగు ఎకె–47 రైఫిళ్ళు, తొమ్మిది ఎస్‌ఎల్‌ఆర్ రైఫిళ్ళు, ఒక ఇన్సాస్ ఎల్‌ఎంజి (లైట్ మెషిన్ గన్), ఏడు ఇన్సాస్ రైఫిళ్ళు, ఒక కార్బన్, 303 రైఫిల్స్ మరో 12, ఎనిమిది ఎంఎం పిస్తోల్, ఏడు సింగిల్ షాట్ వెపన్స్, 23 బ్యారల్ గ్రేడ్ లాంఛర్స్ (బిజిఎల్),మూడు 315 బోర్ రైఫిల్స్, 12–బోర్ గన్స్ మరో పద్నాలుగు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బిజాపూర్‌లో లొంగిపోయిన ప్రముఖులలో కంపెనీ కమాండర్లు మంగళ్ కోర్సా అలియాస్ మోటూ (42), ఆకాశ్ అలియాస్ ఫాగు ఊకే (38), డివిజనల్ కమిటీ సభ్యుడు శంకర్ ముచకి (33) ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరిపైన ప్రభుత్వం రూ.8 లక్షలు నగదు బహుమతి ప్రకటించింది. అదేవిధంగా లొంగిపోయిన ఏరియా కమిటీ సభ్యుడు పాలే కుర్సం అలియాస్ కమ్లి కుర్సమ్ (40)ను పట్టిస్తే రూ.5 లక్షలు నగదు బహుమతి ఇస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది.

దంతెవాడ జిల్లాలో డికెఎస్‌జెడ్‌సికి చెందిన ఐదుగురు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిపై మొత్తం రూ.తొమ్మిది లక్షల రూపాయలు నగదు రివార్డును ప్రభుత్వం ప్రకటించింది. వీరంతా సిఆర్‌పిఎఫ్ అధికారుల ఎదుట లొంగిపోయారు. వారిని బైరాంఘర్ ఏరియా కమిటీ సభ్యుడు సోమ్ కడ్తి (42) ఉన్నారు. ఆయనను పట్టిస్తే రూ.5 లక్షలు నగదు ఇస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. లఖ్మ ఓయం (19), సరిత (21),జోగి కల్మ(20), మోతీ ఓయం(19)లు ఒక్కొక్కరిపై ప్రభుత్వం లక్ష రూపాయలు రివార్డు ప్రకటించింది. లొంగిపోయిన కార్యకర్తలు ఇచ్చిన సమాచారం ప్రకారం భద్రతాదళాలు ఈ ప్రాంతంలోని మావోయిస్టు నిల్వ కేంద్రం నుండ 40 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. వీటిల్లో ఎస్‌ఎల్‌ఆర్‌లు, ఇన్సాస్ రైఫిళ్ళు, ఒక కార్బన్, 303 రైఫిల్, బిజిఎల్ లాంఛర్స్ ఉన్నాయి. సుక్మా జిల్లాలో జనిల అలియాస్ మడ్కమ్ హిడ్మే (30), సోని అలియాస్ మాధవి కోసి (24) లొంగిపోయారు. వీరిపై ప్రభుత్వం గతంలో రూ.8 లక్షలు రివార్డు ప్రకటించింది. ఈ జిల్లాలో ఒక మావోయిస్టు డంప్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. దీంతోంచి రూ.10 లక్షలు నగదు, ఇన్సాస్ ఎల్ ఎంజి, రెండు ఎకె–47 రైఫిల్స్,మూడు 303 రైఫిల్స్, ఆయుధ సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. కాంకెర్ జిల్లాలో శంకర్ అనే ఒక ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడు, ప్లటూన్ సభ్యుడు హిడ్మా దోడి లొంగిపోయారు. వారి నుండి ఒక ఎకె–47 రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు. నారాయణ్‌పూర్‌లో బిజ్లూ మాధవి (26) లొంగిపోయారు. ఈ ప్రాంతంలో ఆమె ఒక్కరే చిట్టచివరి క్రియాశీల మావోయిస్టు కార్యకర్త. అమెపై ప్రభుత్వం ఒక లక్షరూపాయలు నగదు బహుమతి ప్రకటించింది. జిల్లా రిజర్వు గార్డులు, జిల్లా పోలీసులు, ఛత్తీస్‌గఢ్ సాయుధ బలగాలు, ప్రత్యేక కర్తవ్య నిర్వహణా బృందాలు, కోబ్రా, సిఆర్‌పిఎఫ్, ఇతర యూనిట్ల సమన్వయ చర్యల ద్వారా వీరంతా లొంగిపోయారు.

# మహిళా సాధికారతకు మహాలక్ష్మి కిరీటం

❑ 290 కోట్ల ఉచిత ప్రయాణాలు.. రూ.10 వేల కోట్ల ఆర్థిక ఆదా ❑ ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట : భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి ఉచిత బస్సు ప్రయాణం'మహాలక్ష్మి పథకం' పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట వేశామని, సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే అని ప్రజా ప్రభుత్వం చేసి చూపిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ద్వారా ఇప్పటి వరకు మహిళలు సుమారు 290 కోట్ల సార్లు ప్రయాణించి, తద్వారా రూ.10 వేల కోట్ల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని ప్రభుత్వం ప్రకటించింది. ఈ చారిత్రాత్మక మైలురాయిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు.

### మహిళా ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి : భట్టి

మహిళలు ఆదా చేసుకున్న ఈ రూ. 10 వేల కోట్లు వారి కుటుంబ ఆర్థిక అవసరాలకు, పిల్లల చదువులకు ఉపయోగపడతాయనీ, కేవలం ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా, మహిళలను లక్షాధికారులను చేయడమే మా లక్ష్యమని చెప్పారు.

### ఆర్‌టిసి కార్మికులంతా మా కుటుంబ సభ్యులే : పొన్నం

'మహాలక్ష్మి పథకం విజయవంతం కావడంలో ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర మరువలేనిదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులలో 40 లక్షల మంది మహిళలే ఉండటం గొప్ప విషయమని, ఆర్‌టిసిని కాపాడుకుంటూనే మహిళలకు ఈ సదుపాయం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

### రాజకీయ విమర్శలకు మహిళలే సమాధానం చెప్పాలి : సీతక్క

మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉచిత ప్రయాణాన్ని విమర్శించే వారికి మహిళలు తమ తిరుగుబాటు ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళలను ఆర్‌టిసి బస్సులకు యజమానులను చేశాం. అనంతరం మహిళలు పొదుపు చేసుకున్న రూ. 10వేల కోట్ల మెగా చెక్కును మంత్రులు ఆర్‌టిసి ఎండి వై. నాగిరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్, మాజీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, సెర్ప్ సిఇఓ దివ్య, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, ఆర్‌టిసి ఇడిలు సిహెచ్.వెంకన్న, ఖుస్రో షా ఖాన్ , రాజశేఖర్ పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వేలాది మంది మహిళలు పాల్గొని ఉత్సాహంగా ఈ వేడుకను జరుపుకున్నారు.

### ఏప్రిల్ 2 నుంచి గ్రామసభలు పెద్ద ఎత్తున నిర్వహించాలి

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామ సభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి మంగళవారం సాయంత్రం డిప్యూటీ సిఎం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సిఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి ఆ తర్వాత ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, వాటి లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని, జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయనున్న విషయాన్ని వివరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం, ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా చెప్పాలని, వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నామని, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమం విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ, ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్‌ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని డిప్యూటీ సిఎం తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లండి

❑ రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ, నానో యూరియా, నానో డిఎపి వినియోగం వైపు మొగ్గు చూపాలి ❑ రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయం, నానో యూరియా వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం జరిగిన 88వ 'రైతు నేస్తం' కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు, అధికారులకు ప్రకృతి వ్యవసాయ, నానో యూరియా వాడకంపై దిశానిర్దేశం చేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న యువ రైతు సందీప్‌ను, నానో యూరియా వినియోగంలో ముందున్న మహేంద్ర రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. యూరియా అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ ద్వారా సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన యూరియా మోతాదును రైతులు సులభంగా తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ, నానో యూరియా, నానో డిఎపి వినియోగం, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. అలా గే, వ్యవసాయంతో పాటు అనుబంధ శాఖల ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక సమాచారాన్ని అందించాలన్నారు. 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా మే 4 నుండి 9 వరకు నిర్వహించనున్న రైతు ఉత్సవాల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. అంతకముందు రాష్ట్రవ్యాప్తంగా 1600 రైతు వేదికల ద్వారా పాల్గొన్న రైతులకు యాదాద్రి జిల్లాకు చెందిన సందీప్ ప్రకృతి వ్యవసాయం, స్వీయ మార్కెటింగ్ పద్ధతులపై వివరించారు. ఖమ్మం జిల్లాకు చెందిన మహేంద్ర రెడ్డి వరి సాగులో నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ సైనికుడు నవీన్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై తన అనుభవాలను పంచుకుని ఇతర రైతులకు స్ఫూర్తినిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బాబురావు ప్రకృతి వ్యవసాయంలో తన అనుభవాలను వివరించారు. అలాగే, జగిత్యాల జిల్లా గూడూరు, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ప్రాంతాలకు చెందిన రైతులు అడిగిన ప్రశ్నలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సమగ్ర సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ వ్యవసాయ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




### ఎపి నిబంధనలకు విరుద్ధంగా

## శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తే సహించేది లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని ఎక్సైజ్ శాఖ మంత్రి, జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లో కనిష్ట నీటి మట్టం స్థాయి 834 అడుగుల (254.2 మీటర్లు) కు చేరుకున్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేయరాదనే నిబంధనను బేఖాతరు చేస్తోందన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం అచ్చంపేట ఎంఎల్‌ఎ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎంఎల్‌ఎ రాజేశ్వర్ రెడ్డిలతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సాగు, తాగునీటి అవసరాలు పట్టించుకోకుండా ఎపి సర్కార్ అక్రమంగా, అన్యాయంగా నీటిని తోడేస్తోందని ఈ అంశంపై ఎన్ని సార్లు విన్నవించినా ఎపి సర్కార్ పట్టించుకోకపోవడంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధులం శ్రీశైలం వద్ద వంటావార్పు కార్యక్రమానికి పిలుపు నివ్వడంతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపేసిందని మంత్రి తెలిపారు. ప్రజాప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ముఖ్యం తెలంగాణకు దక్కాల్సిన నీటి కేటాయింపుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. పాలమూరు జిల్లాకు నష్టం జరిగితే రైతు పక్షాన ప్రభుత్వం పోరాడుతుందని ఎపి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



'కాళేశ్వరం' కొట్టుకుపోతే, మల్లన్న సాగర్‌లో 25 టిఎంసిల

## నీళ్లెక్కడి నుండొచ్చాయ్?

బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కేంద్ర మంత్రి సి.ఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలు బిజెపి, కాంగ్రెస్ పార్టీల ఫెవికాల్ బంధానికి నిదర్శనమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకుపోతే, మల్లన్న సాగర్‌లో 25 టిఎంసిల నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు,కాంగ్రెస్ నాయకులు తమతో వస్తే కాళేశ్వరం జలాలతో గలగలా పారుతున్న గోదావరి నీళ్లను, పండుతున్న పొలాలను చూపిస్తామని ఆయన సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీహాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ కేంద్ర మంత్రులు సిఆర్.పాటిల్, కిషన్ రెడ్డి, బండి సంజయ్, కాంగ్రెస్ నాయకులు యాదాద్రి భువనగిరి, చొప్పదండి, జగిత్యాల, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్ రైతుల వద్దకు కాళేశ్వరం నీటిని, వాటి వల్ల పండుతున్న పంటలను చూద్దామా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి పాటిల్ వ్యాఖ్యలు సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాషలాగే ఉందన్నారు. రూ 90వేల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయాలు ఎలా కొట్టుకుపోయాయని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఇచ్చిందే కేంద్ర ప్రభుత్వమని, కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే ఆదర్శమని అప్పట్లో కేంద్ర మంత్రులు, అధికారులు ప్రశంసించారని హరీశ్ రావు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ 'ఎకనామిక్ సర్వే', రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పెట్టిన బడ్జెట్ లెక్కలే కాళేశ్వరం విజయానికి సజీవ సాక్ష్యాలన్నారు. శాసనసభ సమావేశాలు ఒక దిశా నిర్దేశం లేకుండా ముగిశాయని, ఆరు గ్యారంటీలపైన స్పష్టత ఇవ్వలేదన్నారు. ప్రజా సమస్యలపైన చర్చించేందుకు ప్రభుత్వం కనీసం ముందుకు రాలేదని ఆరోపించారు. శాసనసభ సమావేశాల్లో సగం రోజులు ప్రశ్నోత్తరాలు నడపలేదని, ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలు చర్చకు రాకుండా చేశారని ఆరోపించారు. శాసనసభను గాంధీభవన్‌గా మార్చారన్నారు. అవినీతి నుంచి మంత్రిని కాపాడేందుకు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలను రెండు రోజుల పాటు సస్పెండ్ చేసి, ప్రతిపక్షం లేకుండానే ముఖ్యమైన బిల్లులను ఆమోదించుకున్నారని ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చిద్దామని అడిగితే సిఎం రేవంత్ రెడ్డి ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు.

## గిరిజన యువతకు సిఎంఎస్‌టిఇఐ పథకం సబ్సిడీ విడుదల

నిలిచిపోయిన ప్రాజెక్టులకు నూతన జీవం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక తోడ్పాటును అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సిఎంఎస్‌టిఇఐ (చీఫ్ మినిస్టర్ షెడ్యూల్ ట్రైబ్స్, ఎంటర్ ప్యూనర్‌షిప్, ఇనోవేషన్) పథకం కింద నిలిచిపోయిన ప్రాజెక్టులకు ఊపిరి వచ్చింది. దాదాపు రెండున్నర ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను విడుదల చేయడంతో లబ్ధిదారుల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఈ పథకం పరిధిలో మొత్తం 200 మంది అభ్యర్థులు ఎంపిక కాగా, అందులో 18 మంది తుది ప్రొసీడింగ్స్ పొందారు. ప్రాజెక్టుల అమలుకు అవసరమైన సబ్సిడీ విడుదలలో ఆలస్యం కారణంగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.50 కోట్లలో భాగంగా ఒక త్రైమాసికానికి సంబంధించిన రూ.12.30 కోట్లు విడుదల చేశారు. అందులో రూ.8.16 కోట్లు 18 మంది లబ్ధిదారులకు సబ్సిడీగా అందజేయడం విశేషం. ఈ పథకం కింద ప్రాజెక్ట్ ఆర్థిక నిర్మాణం 35 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకు రుణం, 10 శాతం లబ్ధిదారుడి వాటాతో అమలవుతుంది. సబ్సిడీ విడుదలతో నిలిచిపోయిన ప్రాజెక్టులు మళ్లీ గాడిలో పడే అవకాశాలు ఏర్పడ్డాయి.

### సిఎంకు లబ్ధిదారులు కృతజ్ఞతలు

ప్రభుత్వం సబ్సిడి నిధులను విడుదల చేయడంతో నిలబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ల చొరవ వల్లే ఈ సమస్య పరిష్కారమైందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మంగళవారం సచివాలయం లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌నుకలిపి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గిరిజన యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఇది ఒక కీలక అడుగు అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ సంతోష్, జిఎం శంకర్ రావు, స్టేట్ మిషన్ మేనేజర్ లక్ష్మీ ప్రసాద్, డిజిఎం రవి కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డికి జలమండలి ఉద్యోగుల ఘన సన్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తానని ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి అన్నారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులుగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డిని, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.పి.రాఘవేంద్ర రాజ్‌ను హైదరాబాద్, జలమండలి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జలమండలి ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణే తన ప్రధాన ధ్యేయమని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై గళమెత్తి, న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రావన్ కుమార్, ఎండి జాంగిర్, ప్రధాన కార్యదర్శి ఈ.చంద్రశేఖర్, నాయకులు కె.ఆనంద్ రెడ్డి, బి.శంకర్ ప్రకాష్, బి.నర్సింగ్ రావు, ఏ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లు ఆమోదం హర్షణీయం

ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లు 2026ను శాసనసభ, శాసనమండలిలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం పట్ల ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింప చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బిల్లుకు సహకరించి ఏకగ్రీవంగా ఆమోదింప చేసినందుకు అన్ని రాజకీయ పక్షాల శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులుకు ఐఎఎల్ తరఫున ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ప్రత్యేక పరిస్థితుల్లో కోర్టు ఆఫీసర్స్‌కు ఉన్న రక్షణను బిల్లులో న్యాయవాదులకు కల్పించడాన్ని స్వాగతిస్తున్నమన్నారు. బిల్లుపై శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు న్యాయవాదులకు ప్రత్యేకంగా అకాడమీ ఏర్పాటు, బార్ అసోసియేషన్‌లలో మౌలిక సదుపాయాలు, లైబ్రరీలు, మహిళా న్యాయవాదులకు ప్రత్యక గదులకు, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ పెంపు, కోర్టకు హాజరయ్యే కక్షిదారులకు గదులు ఏర్పాటు తదితర ప్రతిపాదనను మంత్రి శ్రీధర్ బాబు సానుకూలత వ్యక్తం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాద అకాడమీ ద్వారా న్యాయవాదుల వృత్తి నైపుణ్యం, న్యాయ వ్యవస్థ ఔన్నత్యానికి మరింత దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం బార్ అసోసియేషన్ పటిష్టతకు, కక్ష దారులకు తగు వసతులను కోర్టు ఆవరణలో ఏర్పాటు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు ఇచ్చే స్టైఫండ్ రూ.10వేలకు పెంచాలని, సీనియర్ న్యాయవాదులకు పెన్షన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని, చనిపోయిన న్యాయవాదుల కుటుంబాలకు సంక్షేమ నిధి నుంచి చెల్లించే మొత్తాన్ని రూ.20 లక్షలకు పెంచాలని, న్యాయవాదులకు మెడికల్ స్కీం ద్వారా పూర్తి వైద్య ఖర్చులు భరించాలని, అర్హులైన న్యాయవాదులకు గృహ వసతి పథకాన్ని చేపట్టాలని బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.500 కోట్లు కేటాయించి, నిర్వహణ బాధ్యతను బార్ కౌన్సిల్‌కే అప్పదించాలని ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు.

## హత్య కేసులో 15 మందికి యావజ్జీవ కారాగార శిక్ష

### జిల్లా ప్రధాన న్యాయస్థానం సంచలన తీర్పు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** గత కొన్నేళ్ల క్రితం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చామనపల్లి గ్రామంలో జరిగిన బోజ్జ తిరుపతి హత్య కేసులో నిందితులకు జిల్లా ప్రధాన, సెషన్స్ కోర్టు కఠిన శిక్షను ఖరారు చేసింది. నిందితులుగా ఉన్న 15 మందికి యావజ్జీవ కారాగార శిక్ష (Life Imprisonment), తలో రూ.1,500లు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెల్లడించారు. 2019, ఏప్రిల్ 19వ తేదీన చామనపల్లి గ్రామ పొలిమేరలో ఈ దారుణం జరిగింది. గ్రామ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న బోజ్జ తిరుపతి (48), చేపల వేటకు సంబంధించి నిందితులను సభ్యత్వం నుండి తొలగించారనే కక్షతో ఈ హత్య జరిగింది. నిందితులైన మయాకల ధర్మరాజం (ఎ1), మరో14 మంది సభ్యులు పథకం ప్రకారం తిరుపతిపై రాళ్లతో దాడి చేసి, తువాలుతో గొంతు నులిమి అత్యంత దారుణంగా హత్య చేశారు. మృతుడి భార్య బోజ్జ సమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో మయాకల ధర్మరాజం, మయాకల రాములు, మయాకల పోచయ్య, మయాకల కొమురయ్య, మయాకల అంజయ్య, మయాకల వెంకటేశం, మయాకల నవీన్, మయాకల ప్రవీణ్, మయాకల శ్రీనివాస్ (కొమురయ్య కుమారుడు), మయాకల శ్రీనివాస్ (రాములు కుమారుడు), మయాకల సంపత్, మయాకల లచ్చయ్య, మయాకల సత్తయ్య, మయాకల శ్రీనివాస్ (వెంకటేశం కుమారుడు), మయాకల వెంకట్రాజంలకు శిక్ష పడింది.

కేసును సమర్థవంతం గా దర్యాప్తు చేసిన నాటి కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.శశిధర్, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ ఏ.నిరంజన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ప్రతాప్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ (సిడిఓ) ఎన్.రాజేందర్, మరియు సి.ఎం.ఎస్ ఏఎస్‌ఐ ఎం. సత్తయ్యలను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను కోర్టు ముందు ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా చేయడంలో వీరు కీలక పాత్ర పోషించరన్నారు. నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చూడటంలో పోలీసు యంత్రాంగం నిరంతరం శ్రమిస్తుందని ఈ సందర్భంగా సిపి పేర్కొన్నారు.

## 'టూరిజంలో అక్రమాలు' కథనంపై టిజిటిడిసి వివరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిటిడిసి)పై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ ఆ సంస్థ వివరణ విడుదల చేసింది. టూరిజం శాఖలో అక్రమాలు శీర్షికతో ప్రచురితమైన కథనంపై స్పందిస్తూ, ఆ వార్తలో పేర్కొన్న అంశాలు వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేసింది. బోటింగ్ కార్యకలాపాలకు సంబంధించి రూ.1.48 కోట్ల ఆదాయ దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు అసత్యమని టిజిటిడిసి తెలిపింది. టికెటింగ్ వ్యవస్థ పూర్తిగా ఆన్‌లైన్, ఎలక్ట్రానిక్ విధానంలో జరుగుతుందని, ప్రతి టికెట్ నిర్దిష్ట రేట్ల ప్రకారం జారీ అవుతుందని వెల్లడించింది. బోట్ల వినియోగం, ప్రయాణ సమయం, ఇంజిన్ స్థితి ఆధారంగా ఖర్చులు నిర్ణయించబడతాయని, అన్ని బిల్లులు సరైన డాక్యుమెంటేషన్‌తో ఉండి ఆడిట్‌కు లోబడి ఉంటాయని తెలిపింది.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : కూకట్‌పల్లి జోన్**

Lr.No. 01/CMC/SWM/EE/2025-26 తేదీ: 31.03.2026

NIT No. 01/CMC/SWM/EE/2025-26, తేదీ: 31.03.2026, పని పేరు: గుర్రపు డెక్క తొలగించడం, అంచనా విలువ: రూ.42.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం: 01.04.2026న ఉ.11.30గం.ల నుండి 08.04.2026న ఉ.11.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీమతి సక్కుబాయి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యుఎం), కూకట్‌పల్లి జోన్, సిఎంసి, సెల్ నెం. 7893066262. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in/ లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యుఎం), కూకట్‌పల్లి జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 17851-PP/CL/ADVT/1/2025-26, Date: 31-03-2026

తెలంగాణ రాష్ట్రము
**పురపాలక సంఘం తాండూర్ :: వికారాబాద్ జిల్లా.**

No/MCT/1289/2026 బహిరంగ వేలం ప్రకటన తేదీ: 31.03.2026

మున్సిపల్ కౌన్సిల్ తాండూర్ వారు తెలంగాణ మున్సిపల్ యాక్ట్-2019 యొక్క సెక్షన్ 52 ప్రకారం ఆర్థిక సంవత్సరం 2026-27 కాలవ్యవధి కొరకు తాండూరు మున్సిపాలిటీ వద్ద డెలీ బేసిస్ పై చికెన్, మటన్ మరియు ఫిష్ వేస్ట్ లను సేకరించు, రవాణాచేయు మరియు సెంటిఫిక్ డిస్పోజల్ ఏజెన్సీల నియామకం కొరకు సంబంధిత మరియు అనుభవదారి కంపెనీలు/సంస్థలు/ ఏజెన్సీల నుండి దరఖాస్తులను అహ్వానించనైనది. "In favour of The Commissioner, Tandur Municipality" పేరున బ్యాంకు నుండి తీసిన డిడి రూ.5,000/- లను జతపరిచి తేదీ: 06.04.2006 న సాయంత్రం 4,00 వరకు మునిసిపల్ కార్యాలయంలో దాఖలు చేయవచ్చు. తేదీ: 07.04.2026 నాడు ఉదయం, 11:00 గంటలకు మున్సిపల్ కార్యాలయం యందు బహిరంగ వేలం (ఓపెన్ ఆక్షన్) వేయుటకు నిర్ణయించినాము. కావున ఇట్టి బహిరంగ వేలం (ఓపెన్ ఆక్షన్) యందు పాల్గొనే ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింద తెలిపిన నియమ నిబంధనలు పాటించవలెను.

అర్హత నియమావళి:-

1. బిడ్డరుదారుడు కంపెనీ ప్రొఫైల్ యొక్క క్రెడియన్షియల్స్, అనుభవం మరియు ఏవేని ఇతర సంబంధిత పత్రాలను దాఖలు చేయవలెను,
2. బహిరంగ వేలం యందు పాల్గొను పాటదారు రూ.1,00,000/- లు (డి.డి లేక నగదు రూపములో జమ చేయవలెను), వేలం దక్కని వారికి అట్టి రూపాయలు తిరిగి చెల్లించబడును.
3. తెలంగాణ యొక్క ఏవేని మునిసిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ చేత జారీ చేయబడిన కనీస (3) సం. ల రవాణా అనుభవం కలిగిన సర్టిఫికెట్.
4. స్వంతంగా లేదా లీజుతో కనీసం (2) రవాణా వాహనాలు కలిగి ఉండవలెను.
5. లేటెస్ట్ బాయిలర్ సర్టిఫికెట్- 2025,
6. స్వంత/ లీజ్ ఫీడింగ్ సెంటర్ లోకేషన్ వివరాలు,
7. మున్సిపాలిటీకి సంబంధించి ఆస్తి పన్ను మరియు గత వేలం పాటలో గెలుచుకొని బకాయి ఉన్న వారికి అనుమతించబడదు.
8. అత్యధిక పాటదారు డిపాజిట్ రూపాయలలో ధరావత్తు రూ.లు 1,00,000/-లు కలుపుకొని మిగిలిన రూపాయలు (7) రోజులలో చెల్లించి మీ సొంత ఖర్చుతో అగ్రిమెంటు చేసుకొనిన తదుపరి మాత్రమే వసూలు చేసుకొనుటకు అనుమతించబడును. సకాలంలో చెల్లింపులు చేయని యడల ధరావతు జప్తు చేసుకొని రెండవ అత్యధిక వేలం దారునికి షరతులతో అప్పగించబడును.

ఇతర వివరముల కొరకు పురపాలక సంఘం కార్యాలయ రెవెన్యూ విభాగములో సంప్రదించగలరు. 0.

నోట్: ఎటువంటి కారణములు చూపకుండానే బహిరంగ వేలమును వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకుగాను పురపాలక సంఘమునకు పూర్తి హక్కులు కలవు అని వేలములో పాల్గొనే వారందరు ఇట్టి విషయాన్ని గ్రహించవలెను.

సం/- కమిషనర్
పురపాలక సంఘం, తాండూర్.

DIPR R.O. No. : 17811-PP/CL/ADVT/1/2025-26, Date: 31-03-2026

**పురపాలక సంఘ కార్యాలయము :: భువనగిరి**

కొటేషన్ మరియు ఆసక్తి వ్యక్తీకరణ (E.O.I.) నోటీసు ప్రకటన

ఫైలు నెం. 21/28/2025-26, తేదీ: 31.03.2026

1) భువనగిరి పురపాలక సంఘం యందు గల వీధి కుక్కలను పట్టుకొని Animal Birth Control Centre (ABC) యందు శస్త్ర చికిత్సలు మరియు వాక్సినేషన్ చేసి వదిలి పెట్టుట కొరకు అనుభవజ్ఞులైన ఏజెన్సీల వారి నుండి, 2) భువనగిరి పురపాలక సంఘం యందు గల అన్ని వార్డులలో సంచరిస్తున్న కోతులను పట్టించుటకు మరియు పట్టిన కోతులను భువనగిరి పట్టణము నుండి దూరంగా అటవీ ప్రాంతంలో వదిలి పెట్టుటకు, 3) గౌరవ చైర్పర్సన్ మరియు గౌరవ కమీషనర్ గార్లు వివిధ సమీక్షా సమావేశములకు హాజరగుటకు, అభివృద్ధి పనుల పర్యవేక్షణకు అద్దె కార్లను ఎంగేజ్ చేయుట కొరకు వివిధ ఏజెన్సీల వారి నుండి ఆసక్తి వ్యక్తీకరణ (E.O.I.) కోరనైనది. ఆసక్తి గల వారు తేది 08.04.2026 లోపు శ్రీయుత మున్సిపల్ కమీషనర్ గారి పేరున రూ.5,000/-ల డిమాండ్ డ్రాఫ్ట్ కూడియున్న దరఖాస్తును పురపాలక సంఘ కార్యాలయం యందు సమర్పించి Request for Proposal (RFP) ఫారమ్ పొందగలరు.

భువనగిరి పురపాలక సంఘంలో 1) ప్రభుత్వ కార్యక్రమములు, జాతీయ నాయకుల జయంతి వర్ధంతులు నిర్వహించుటకు, పండుగల నిర్వహణకు అవసరమగు ఏర్పాట్ల కొరకు, 2) నీటి సరఫరా, వీధి దీపముల నిర్వహణకు అవసరమగు సామగ్రి కొరకు మరియు వాటర్ ట్యాంకర్లు ఎంగేజ్ చేయుట, 3) ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్ సరఫరా మరియు వాటి మరమ్మత్తుల కొరకు, 4) పార్కుల నిర్వహణ కొరకు అవసరమగు సామగ్రికి, 5) పురపాలక సంఘ వాహనముల మరమ్మత్తులకు, 6) పురపాలక సంఘం కంప్యూటర్లు, ప్రింటర్లు మరమ్మత్తులు, క్యాట్రిడ్జ్‌లు & ఫిల్లింగ్, మరమ్మత్తుల, 7) శానిటేషన్ నిర్వహణకు సంబంధించి వివిధ సామగ్రి మరియు కెమికల్స్, 8) పురపాలక సంఘం యందు వివిధ పనుల కొరకు జె.సి.బి., డోజర్, ట్రాక్టర్, లేబర్ ఎంగేజ్ చేసుకొనుటకు, 9) కార్యాలయ నిర్వహణకు అవసరమగు స్టేషనరీ సామగ్రి, రిజిష్టర్లు, అగ్రిమెంట్ బుక్లెట్స్, 10) చలివేంద్రములనీటి తొట్టెల నిర్వహణ, 11) విద్యుత్ పనుల నిమిత్తం గమ్ బూట్స్, టార్చ్ లైట్, 12) నర్సరీ నిర్వహణ, 13) విద్యుత్, సివిల్, మెకానికల్ పరికరములకు సంబంధించిన ఆక్సెసరీస్ సరఫా చేయుట, 14) బ్లౌజులు, మాస్కులు, అఫ్రాన్లు కొనుగోలు, 15) వివిధ కార్యక్రమముల కొరకు ఫ్లెక్సి బ్యానర్లు చేయించుట, 16) కార్యాలయ నిర్వహణ జిరాక్స్, 17) టీ స్నాక్స్ ఇతర రిఫ్రెష్‌మెంట్స్ సరఫరా, 18) మంచినీటి క్యాన్లు, వాటర్ బాటిల్స్ సరఫరా, 19) ఇంటర్‌నెట్ సరఫరా, 20) దిన పత్రికల సరఫరా, 21) వివిధ కార్యక్రమములు ఫ్లెక్సి బ్యానర్లు చేయించుట, వాల్ పెయింటింగ్స్ మొదలగు Non-SSR Items యొక్క ధరలు ఏజెన్సీలు / కాంట్రాక్టర్ల నుండి కొటేషన్లు కోరనైనది. కొటేషన్లు తేదీ: 01.04.2026 నుండి 03.04.2026 వరకు కార్యాలయము యందు సమర్పించగలరు. పూర్తి వివరముల కొరకు మున్సిపల్ ఇంజనీర్ : 9681853956 ను సంప్రదించగలరు.

సం/- కమీషనర్
భువనగిరి మున్సిపాలిటి.

DIPR R.O. No. : 17869-PP/CL/ADVT/1/2025-26, Date: 31-03-2026

## కేంద్ర మంత్రికి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పశ్చిమ ఆసియా యుద్ధ సంక్షోభం కారణంగా తెలంగాణ రాష్ట్రంలో ఆటో ఎల్‌పిజి రంగం తీవ్రంగా ప్రభావితమవుతోందని , దీనిని నివారించడానికి ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఒసిఐ ,హెచ్‌పిసిఎల్, ఐపిఎఫ్‌సిఎల్ అవుట్‌లెట్లలో ఆటో ఎల్‌పిజి లభ్యతను పెంచాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ పూరికి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కేంద్రమంత్రికి మంగళవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ రాశారు. రాష్ట్రంలో సుమారు లక్ష ఎల్‌పిజి ఆటోరిక్షాలు ఉండగా ఐఒసిఐ, హెచ్‌పిసిఐ, మరియు హెచ్‌పిసిఎల్, పిఎస్‌యులు సమిష్టిగా 20 శాతం మాత్రమే పరిమిత వాటాను కలిగి ఉండి, 33 అవుట్‌లెట్లను నిర్వహిస్తుయని, దీంతో ఆటోలకు గ్యాస్ దొరకని పరిస్థితి నెలకొందని లేఖలో పేర్కొన్నారు. ఆటో ఎల్‌పిజి పంపిణీలో 80 శాతం వాటా కలిగి ఉన్న ప్రైవేట్ సంస్థలకు కొరతగా ఉన్న ఎల్‌పిజిని సరఫరా చేయడం ద్వారా ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వ రంగ సంస్థలకు (ఒఒసిఐ, బిపిసిఐ మరియు హెచ్‌పిసిఎల్) తక్షణ ఆదేశాలు జారీ చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ రంగ అవుట్‌లెట్లలో ఆటో ఎల్‌పిజి ప్రస్తుత ధర లీటరుకు రూ.75 ఉండగా, ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలు లీటరుకు రూ.93ల చొప్పున అమ్ముతున్నాయని, ఈ సంక్షోభ సమయంలో ప్రైవేట్ సంస్థలు అనవసరంగా ధరలు పెంచకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు.ఈ అంశంలో తక్షణమే జోక్యం చేసుకుని ప్రజా రవాణా సేవలు నిరంతరాయంగా కొనసాగేలా చూడడంతో పాటు ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాల జీవనోపాధిని కాపాడటానికి సహాయపడాలని లేఖలో కోరారు.

## మహావీరుని బోధనలు సమాజానికి దిక్సూచి : అజారుద్దీన్

జయంతిలో పాల్గొన్న బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకులు
టి.హరీష్‌రావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అహింస, సత్యం, ఆత్మనిగ్రహం వంటి భగవాన్ మహావీరుని సూత్రాలు, ప్రగాఢమైన ఆధ్యాత్మిక బోధనలు అందరికీ ఆదర్శమని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. జైన మత స్థాపకులు, 24వ తీర్థంకరులైన భగవాన్ మహావీరుని 2625 వ జయంతిని శ్రీ జైన్ సేవా సంఘ్ హైదరాబాద్ నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించింది. తొలుత భారీ శోభాయాత్ర బేగంబజార్ ఫీల్‌ఖానా జైన్ మందిరం నుండి ప్రారంభమై నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు కొనసాగింది. అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన భగవాన్ మహావీర్ జయంతోత్సవాలను మొహమ్మద్ అజారుద్దీన్ భగవాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకులు టి.హరీష్‌రావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, విశ్వ హిందూ పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు హుకుంచంద్జీ సావ్లా, తెలంగాణ రాష్ట్ర మైనారిటీల కమిషన్ సభ్యులు హిమాన్షు బాప్నా, శ్రీ జైన్ సేవా సంఘ్ మార్గదర్శక మండల్ చైర్మన్ యోగేష్ కుమార్ సింగి, అధ్యక్షులు ఉమేష్ బాజీరెచ్చ, ఉపాధ్యక్షులు కైలాష్ భండారి, వినోద్ ముఖాన, కార్యదర్శి విమల్ ముథ, కోశాధికారి సురేష్ సూరాన, సంయుక్త కార్యదర్శి యోగేష్ సోని ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. సభలో మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ చారిత్రాత్మక 'గంగాజమున తెహజీబ్'లో భాగంగా అన్ని మతాలను గౌరవించడం ద్వారా దేశంలో హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నదన్నారు. అన్ని మతాల మధ్య ఐక్యతను పెంపొందించే సమ్మేళన సంస్కృతి కొనసాగుతూనే ఉండాలన్నారు. హరీష్‌రావు మాట్లాడుతూ భగవాన్ మహావీర్ చెప్పిన అహింస పరమో ధర్మః అనే సందేశం కేవలం మాట కాదని, అది ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన జీవన విధానమన్నారు. హింస, ద్వేషం పెరుగుతున్న ఈ కాలంలో మహావీరుని బోధనలు సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయని తెలిపారు.

## నేటి నుంచి 'జాగృతి శ్రేణుల'తో కవిత సమాలోచనలు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ పార్టీని ఈ నెల 25వ తేదీన ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో తెలంగాణ జాగృతి పార్టీ శ్రేణులతో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం నుంచి మూడు రోజుల పాటు సమాలోచనలు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాల వారిగా జాగృతి శ్రేణులతో ఈనెల 3వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు వరుస సమావేశాలను నిర్వహించి కార్యాచరణను రూపొందించనున్నారు. పార్టీ ఏర్పాటు కోసం వివిధ వర్గాల ప్రజల సమస్యలను,వాటికి పరిష్కారాలను, తెలంగాణ రాష్ట్ర స్వయం సమృద్ధి కోసం రూపొందించాల్సిన 'బ్లూ ప్రింట్'పై ఇప్పటికే 50 కమిటీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పార్టీ శ్రేణుల నుంచి పలు సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. సమావేశల షెడ్యూల్‌ను జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి మంగళవారం విడుదల చేశారు. కాగా బుధవారం నాడు హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ ఉమ్మడి జిల్లాల నాయకులు,ఆ మరుసటి రోజు ఏప్రిల్ 2వ తేదీన ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలు, ఏప్రిల్ 3వ తేదీన నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల నాయకులు, కార్యకర్తలతో కవిత సమావేశం కానున్నారు.

## ఐదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

పిల్లల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి
: టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** చిన్నారిపై లైంగిక ఘటనకు సంబంధించిన కేసును తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు ఛేదించారు. ఐదేళ్ల బాలికను రక్షించి, నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూసివ్ మెటీరియల్ టిప్‌లైన్ ద్వారా వచ్చిన ఆధారాలను టిజిసిఎస్‌బి చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ విశ్లేషించగా, ఈ ఘటన వెలుగులోకి వచ్చిందని, బాలిక తల్లిదండ్రులకు తెలియకుండా స్థానికంగానే ఈ ఘటన జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో నిందితుడు బాలికకు దగ్గరి బంధువే కావడం ఆందోళన కలిగిస్తోంది. అతను తరచూ బాలిక ఇంటికి వెళ్లి, ఇంటి పైకప్పుపైకి తీసుకెళ్లి దుర్వినియోగానికి పాల్పడినట్లు విచారణలో బయటపడింది. హెడ్‌క్వార్టర్స్ సిసిపిపి బృందం నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసింది. అతని వద్ద ఉపయోగించిన ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకుని, డిజిటల్ ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించారు. కేసును ఐటీ చట్టంలోని సెక్షన్ 67బి, పోక్సో చట్టంలోని సెక్షన్ 3, 4, 15 కింద నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. రక్షించబడిన బాలికకు అవసరమైన సహాయం అందిస్తూ, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ అందిస్తున్నారు. పిల్లలపై జరిగే ఇలాంటి నేరాలు ఎక్కువగా పరిచయస్తుల ద్వారానే జరుగుతాయని అధికారులు తెలిపారు. పిల్లల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే సైబర్ క్రైమ్ అధికారులకు తెలియజేయాలని టిజిసిఎస్‌బి సూచించింది.

# కాంగ్రెస్ బుల్లెట్‌ను కాదు, బ్యాలెట్‌నే నమ్మింది

- కమ్యూనిస్టు పార్టీలకు.. మావోయిస్టుల ఉద్యమానికి తేడా తెలియదా..
- మీరు ఏ పార్టీతో పొత్తుపెట్టుకున్నా తప్పులేదా..
- అమిత్ షాపై నిప్పులు చెరిగిన ఎంపి డా.మల్లు రవి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కమ్యూనిస్టు పార్టీలకు.. మావోయిస్టుల ఉద్యమానికి తేడా తెలియదని నాగర్‌కర్నూల్ ఎంపి డా.మల్లు రవి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడూ బుల్లెట్‌ను నమ్మలేదని.. బ్యాలెట్‌నే నమ్మిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎవ్వరితో పొత్తు పెట్టుకున్నా రాజ్యాంగానికి లోబడే వ్యవహరించిందని వివరించారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపి మల్లు రవి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పార్లమెంట్ సెషన్ ఏప్రిల్ రెండో తేదీన ముగుస్తుందని, ఈ సెషన్‌లో ముఖ్యంగా మావోయిస్టుల లొంగుబాటు, ఆపరేషన్ కగార్‌పై చర్చ జరిగిందన్నారు. మావోయిస్టులు అంతా సరెండర్ కావాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని, ఆయుధాలు పట్టుకొని రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రభుత్వం మీద పోరాటం చేస్తున్నారు కాబట్టి.. సరెండర్ కాకపోతే మీరు ఏ ఆయుధాలతోటి ప్రభుత్వం మీద పోరాటం చేస్తున్నారో.. అదే ఆయుధాలతోని మీ మీద కూడా పోరాటం చేస్తామని హెచ్చరించిందిదన్నారు. ఈ మార్చి నెలాఖరు లోపల మావోయిస్టులు లేకుండా చేస్తామని హోం మంత్రి అమిత్ షా ప్రకటించారన్నారు. మావోయిస్టుల విషయంలో గత సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఏం జరిగిందో.. ఏ రకంగా మావోయిస్టు రహిత భారత దేశంగా మారిందనే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం పార్లమెంటులో మాట్లాడారని, కాంగ్రెస్ పార్టీ తరపున ను కూడా మాట్లాడనన్నారు. 'మావోయిస్టులకు లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజమ్ అని పేరు పెట్టారు. దీన్నే నక్సలిజం, మావోయిజం అని అంటున్నారు. దీని మీద అమిత్ షా మాట్లాడుతూ.. నక్సలైట్స్ వల్ల ఎంత భూభాగం వారి ఆధీనంలోకి పోయింది, ఎంతమంది ప్రజలు వారి ఆధీనంలోకి పోయారు, ఏ రకంగా ప్రజా కోర్టులు పెట్టి ప్రభుత్వానికి ఛాలెంజ్‌గా నిలిచారు, ఎంతమంది సీఆర్పీఎఫ్ పోలీస్ అఫీషియల్స్ నక్సలైట్ల కాల్పుల్లో చనిపోయారు, ఏ రకంగా రాజకీయ నాయకులు చనిపోయారు.. ఈ లెక్కలన్నీ ఇచ్చారు. ఈ లెక్కలపై మాకేం అభ్యంతరం లేదు. కానీ ఈ లెక్కలు చెబుతూ అమిత్ షా.. ఇందిరా గాంధీ పేరును పదేపదే ప్రస్తావించారు. వీవీ గిరి, నీలం సంజీవరెడ్డి ఇద్దరూ రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పుడు.. ఇందిరాగాంధీ మావోయిస్టులతో అలయన్స్ పెట్టుకున్నారని అమిత్ షా చెప్పారు. ఇంతటితో ఆగకుండా 2004లో కూడా మన్మోహన్ సింగ్ ప్రధాని కావడానికి మావోయిస్టు పార్టీలతో పొత్తు పెట్టుకున్నారని అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తున్నప్పుడు.. తెలంగాణలో ఒకే డయాస్ మీద గద్దర్‌తో కలిసి రాహుల్ గాంధీ మాట్లాడారని అమిత్ షా చెప్పారు. కాంగ్రెస్ పార్టీపై రాజకీయంగా బురద జల్లాలని ఇందిరా గాంధీ మొదలు మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ వరకు అందరి పేర్లను అమిత్ షా ప్రస్తావించారు. 1969, 70 సమయంలో సిపిఐ సపోర్ట్‌ను ఇందిరాగాంధీ తీసుకున్న మాట వాస్తవమే. కానీ ఆ సమయంలో సిపిఐ రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఆయుధాలు పట్టుకొని పోరాటం చేయలేదు. అమిత్ షా ఈ విషయాన్ని తెలుసుకోవాలి' అని మల్లు రవి సూచించారు. మన దేశంలో మల్టీ పొలిటికల్ పార్టీస్ ఏర్పాటు చేసుకుని అవకాశం ఉందని, అన్ని పార్టీలు రాజ్యాంగానికి లోబడి ఎన్నికల్లో నిలబడే అవకాశం ఉందన్నారు. ఇందిరాగాంధీ ఏ సమయంలో సపోర్టు తీసుకున్నా కూడా.. రాజ్యాంగం నిషేధించిన పార్టీలతో ఎప్పుడు పొత్తు పెట్టుకోలేదు. మన్మోహన్ సింగ్ సపోర్ట్ తీసుకున్న సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు కూడా రాజ్యాంగం నిషేధించిన పార్టీలు కాదన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తెలంగాణలోకి చేరినప్పుడు గద్దర్‌తో వేదిక పంచుకున్న మాట నిజమే. కానీ అప్పటికే గద్దర్ నక్సలైట్ ఉద్యమాల నుంచి బయటకు వచ్చారు. బ్యాలెట్‌తోనే అధికార మార్పిడి జరుగుతుందనీ.. ఓటర్ లిస్టులో తన పేరును నమోదు చేసుకున్న తర్వాతే రాహుల్ గాంధీ గద్దర్‌తో వేదిక పంచుకున్నారన్నారు. గద్దర్ ఆయుధాలతో ఉన్నప్పుడు రాహుల్ గాంధీ ఆయనతో వేదిక పంచుకున్నట్లు అమిత్ షా క్రియేట్ చేశారని, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ ప్రతిష్టను దెబ్బతీసేలా అమిత్ షా మాట్లాడాని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా రాజ్యాంగాన్ని గౌరవిస్తూనే.. రాజ్యాంగానికి లోబడి పార్టీని, ప్రభుత్వాన్ని నడిపించింది. బ్యాలెట్ పేపర్ ద్వారానే అధికారాన్ని సాధిస్తామని కాంగ్రెస్ పార్టీ బలంగా నమ్ముతుంది. ఇదే విషయాన్ని పార్లమెంటులో తాను ప్రస్తావించానన్నారు. 'బుల్లెట్‌ను నమ్ముకొని అధికారం సాధిస్తామని కాంగ్రెస్ పార్టీ ఏనాడు నమ్మదు. ప్రజాస్వామ్యయుతంగా బ్యాలెట్ ద్వారానే అధికారాన్ని సాధించాలని కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంది. స్వాతంత్రం రాకముందు కూడా అహింసా మార్గంలోనే పోరాటం చేశాం. స్వాతంత్రం వచ్చాక రాజ్యాంగం ప్రకారం.. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను తొలగించడానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసింది. ఆయుధాలు పట్టుకొని అధికారం సాధించాలని ఆలోచనకు కాంగ్రెస్ పార్టీ పూర్తి వ్యతిరేకం. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో దాదాపు 30 ఏళ్లు బ్యాలెట్ ద్వారానే కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అదే రకంగా కేరళ రాష్ట్రంలో కూడా బ్యాలెట్ ద్వారానే సీపీఐ, సీపీఎం పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అంతేకానీ ఆయుధాలు చేతబట్టి బుల్లెట్‌ను నమ్ముకొని ఏ రోజు రాజకీయం చేయలేదు. బ్యాలెట్‌ను నమ్ముకున్న పార్టీలతో.. ఏ పార్టీ అయినా పొత్తులో ఉండవచ్చు. రాజకీయం చేయవచ్చు. జనతా పార్టీ ఏర్పడ్డ సమయంలో సిపిఐ, సిపిఐ(ఎం) కూడా ఆ పార్టీతో ఉన్నాయి. ఆ రోజుల్లో బిజెపి, జన్‌సంఘ్ కూడా ఆ పొత్తులో ఉన్నాయి. ఆ విషయాన్ని మాత్రం అమిత్ షా ప్రస్తావించలేదు. గతాన్ని మర్చిపోయి అమిత్ షా ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. దేనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం.. అని ఎంపి డా. మల్లు రవి వ్యాఖ్యానించారు. రాజ్యసభలో కేంద్ర మంత్రి కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చేసిన వ్యాఖ్యలపైనా మల్లు రవి స్పందించారు. ఇప్పుడు కేంద్రమంత్రి కాదు.. గతంలో ప్రధాని మోదీ, అమిత్ షా కూడా కాళేశ్వరంపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వానికి కాళేశ్వరం ఏటీఎంలా మారిందన్నారు. బండి సంజయ్ ఒక అడుగు ముందుకేసి.. జైల్లో వేస్తామన్నారు. కానీ ఏనాడూ ఏ చర్య తీసుకోలేదు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక.. చట్టబద్ధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. మల్లు రవి స్పష్టం చేశారు.

## నేటి నుంచి టోల్ ప్లాజాల వద్ద ఫాస్టాగ్, యుపిఐలతోనే చెల్లింపులు

నగదుకు చెల్లింపులకు స్వస్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను ఏప్రిల్ 1వ తేదీనుంచి పూర్తిగా నిలిపివేయనున్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) స్పష్టం చేసింది. ఇక నుంచి జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు టోల్ రుసుములను ఫాస్టాగ్ లేదా యుపిఐ వంటి డిజిటల్ పద్ధతుల్లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలపై కొత్త నిబంధన అమల్లోకి రానుంది. రహదారుల వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు, టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేయాలనే లక్ష్యంతో నగదు రహిత విధానాన్ని అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. టోల్ వసూళ్లలో పారదర్శకతను పెంచడంతో పాటు వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగకుండా వేగంగా వెళ్లేందుకు ఇది దోహదపడుతుంది. దీని వల్ల ఇంధన వినియోగం తగ్గి, కాలుష్యం కూడా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే,ఈ మార్పు వల్ల డిజిటల్ చెల్లింపులకు సిద్ధంగా లేని కొంతమంది ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. సరైన ఫాస్టాగ్ లేని లేదా అందులో తగినంత డబ్బులు లేని వాహనాలకు జరిమానా విధించవచ్చు. కొన్ని సందర్భాల్లో అటువంటి వాహనాలను టోల్ ప్లాజా వద్ద నిలిపివేసే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేసినట్లు జాతీయ రహదారుల అధికారులు వెల్లడించారు. ఒక వేళ ఫాస్టాగ్‌లో సమస్య ఉంటే, టోల్ బూత్ వద్ద అందుబాటులో ఉండే క్యూఆర్ కోడ్లను స్కాన్ చేసి యూపిఐ ద్వారా తక్షణమే చెల్లింపులు చేయవచ్చు. అయితే, కొన్నిసార్లు నెట్‌వర్క్ సమస్యల కారణంగా ఈ లావాదేవీలు ఆలస్యం కావచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందే ఫాస్టాగ్‌ను యాక్టివ్‌గా ఉంచుకోవడం, దానిలో తగినంత డబ్బులు ఉంచుకోవడం చేయాలని ఎన్‌హెచ్‌ఎఐ తెలిపింది. ఫాస్టాగ్‌ను తమ బ్యాంకు ఖాతాతో సరిగ్గా లింక్ చేసుకోవడం కూడా ముఖ్యమని, ముందు జాగ్రత్తగా స్మార్ట్ ఫోన్‌లో పనిచేసే యూపిఐ యాప్‌ను సిద్ధంగా ఉంచుకోవడం మంచిదని అధికారులు సూచించారు. ఈ మార్పు భారతీయ రహదారుల వ్యవస్థను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా మార్చడంలో ఒక కీలక ముందడుగు అని ఎన్‌హెచ్‌ఎఐ పేర్కొంటున్నారు.

## ఆస్తి పన్ను బకాయిలు

హైదరాబాద్‌లో మాజీ సిఎం జయలలిత నివాసం సీజ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జె.జయలలితకు చెందిన హైదరాబాద్‌లోని నివాసాన్ని జిహెచ్‌ఎంసి అధికారులు సోమవారం సీజ్ చేశారు. సుమారు రూ.83 లక్షల మేర ఆస్తి పన్ను బకాయిలు పేరుకు పోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. యూసుఫ్ గూడ సర్కిల్38 పరిధిలోని శ్రీనగర్ కాలనీలో జయలలిత పేరు మీద జి+4 అంతస్తుల భవనం ఇంటి నెంబరు : 8 31099/ఎ, పిటిఐఎన్ : 1100833474 ఉంది. ఈ భవనానికి సంబంధించి 2017 నుంచి ఆస్తి పన్ను చెల్లించలేదు. బకాయికి రాయితీలు పోను రూ. 82, 91,822. చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటిఎస్) పథకం మార్చి 31తో ముగియనుంది. ఈ బకాయిలపై గత ఫిబ్రవరిలోనే డిప్యూటీ కమిషనర్ సురేష్, జయలలిత వారసులకు లే దా సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. అయితే, వారి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో, జిహెచ్‌ఎంసి ఏఎంసీ బాల్‌రాజ్ ఆ ధ్వర్యంలో సిబ్బంది సోమవారం భవనానికి చేరుకుని సీజ్ చేశారు. గతం లో ఈ భవనంలో ప్రైవేట్ కార్యాలయం నిర్వహించడంతో అధికారులు దీ నిని వాణిజ్య సముదాయం కింద పరిగణించి పన్ను విధించారు. అయితే, 2017 నుంచి ఈ భవనాన్ని నివాస అవసరాలకే వాడుతున్నామని, కాబట్టి దీనిని రెసిడెన్షియల్ కేటగిరీలోకి మార్చాలని జయలలిత మేనల్లుడు దీపక్ జయకుమార్ గతంలోనే అధికారులను కోరారు. అయినప్పటికీ పన్ను చె ల్లింపులో జాప్యం జరగడంతో చివరకు భవనం సీజ్‌కు గురైంది. దీపక్ జ యకుమార్ చెల్లింపులు జరపడంతో అధికారులు సీజింగ్ తొలగించినట్లు తెలిసింది.

## పాడి కౌశిక్ రెడ్డికి సిఐడి నోటీసులు

ఏప్రిల్ 4న విచారణకు రావాలని ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సిఐడి నోటీసులు జారీ చేసింది. కరీంనగర్ సిపిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో సిఐడి అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కౌశిక్ రెడ్డితో పాటు మరో 20 మందికి నోటీసులు అందజేయడంతో పాటు ఏప్రిల్ 4న హైదరాబాద్‌లో విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. జనవరి 29 న సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా హుజురాబాద్‌లో కౌశిక్ రెడ్డి హంగామా చేసిన విషయం తెలిసిందే. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హుజురాబాద్‌లో నమోదైన కేసును మొదట స్థానిక పోలీసులు దర్యాప్తు చేసి తదుపరి విచారణ నిమిత్తం ప్రభుత్వం సిఐడికి బదిలీ చేసింది. ఈ కేసుపై ప్రస్తుతం సిఐడి అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. సిఐడి నోటీసులపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వేధిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే సిఐడి నోటీసులు జారీ చేసిందని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

## పోషణ అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ప్రొఫెసర్ కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పోషణ అభియాన్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ కోరారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్‌ను హైదరాబాద్‌లోని సచివాలయంలో కోదండరామ్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పోషణ అభియాన్ ఉద్యోగుల సమస్యలపైన వారు చర్చించారు. ఉద్యోగ భద్రత, కాంట్రాక్ట్ కాలం పొడిగింపు, జీతభత్యాల పెంపు, హెల్త్ ఇన్సూరెన్స్, మెటర్నిటీ సెలవులు తదితర అంశాలను పరిష్కరించాలని కోదండరామ్ కోరారు. అంగనవాడి కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న పోషణ అభియాన్ సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వారి జీతభత్యాలను పెంచాలని, కాంట్రాక్ట్‌ను క్రమబద్ధీకరించాలని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పించే విధంగా ప్రభుత్వ పాలసీలు అమలు చేయాలని తెలిపారు. పని భారం తగ్గించి, మానసిక ఒత్తిడి తగ్గించే విధంగా ఆధునిక సాంకేతిక పరికరాలను అందించాలని సూచించారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో పోషణ అభియాన్ పథకం సమర్థవంతంగా అమలుచేస్తున్నామన్నారు. సాంకేతిక సమస్యల కారణంగా కాంట్రాక్ట్ కాలపరిమితి పొడిగింపు ఆలస్యమైందని, ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. వేతనాలను పెంచాలని కేంద్ర ప్ర భుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, హెల్త్ ఇన్సూరెన్స్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చ లు జరుపుతున్నామని వివరించారు. ఈ సమావేశంలో పోషణ అభియాన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పొనుగోటి సంపత్, రాష్ట్ర కార్యదర్శులు నాగులవంచ సతీ ష్, శైలజ, సరిత తదితరులు పాల్గొన్నారు.

## లేక్ వ్యూ పార్క్‌లో పూలే దంపతుల విగ్రహ ఏర్పాట్ల పరిశీలన

ఈనెల 11న విగ్రహాలను
ఆవిష్కరించనున్న సిఎం రేవంత్ రెడ్డి



సామాజిక విప్లవకారులకు ఘన నివాళి..

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఈనెల 11న ఆవిష్కరించనున్నారు. ఈనెల 11న జరగనున్న పూలే జయంతి వేడుకలను పురస్కరించుకుని, పివిఎన్‌ఆర్ మార్గ్ లోని లేక్ వ్యూ పార్క్‌లో ఏర్పాటు చేస్తున్న విగ్రహాల పనులను మంగళవారం మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పరిశీలించారు. రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, మాజీ ఎంపి వి. హనుమంతరావు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, అంబర్‌పేట్ ఎమ్మల్యే కాలేరు వెంకటేశ్ ఈ పరిశీలనలో పాల్గొన్నారు. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన వారు ఈనెల 11న ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరిగే ఈ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ భారతదేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, విద్య కోసం పోరాడిన పూలే దంపతుల సేవలను కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన కృషి, బాలికల విద్య కోసం సావిత్రిబాయి పూలే పడిన శ్రమ వెలకట్టలేనివన్నారు. వారి స్ఫూర్తిని భావి తరాలకు అందించడమే ఈ విగ్రహాల ఏర్పాటు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ పర్యవేక్షణలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, బిసి సంక్షేమ కమిషనర్ బాల మాయాదేవి, హైదరాబాద్ కలెక్టర్ డి. హరిచందన, బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ కార్యదర్శి బి. సైదులు సహా హెచ్‌ఎండిఏ ఇంజనీర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసెంబ్లీలో బిఆర్‌ఎస్ నేతల ప్రవర్తన

ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్,
యెన్నం శ్రీనివాస్ రెడ్డి,
విజయరమణరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసెంబ్లీలో ప్రతిపక్ష నేతల ప్రవర్తన ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని ప్రభుత్వ విప్‌లు పేర్కొన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అసెంబ్లీలో హరీష్ రావు, కెటిఆర్‌కు స్పీకర్ తగిన సమయం ఇచ్చినా వారు పచ్చి అబద్ధాలు మాట్లాడారని ఆరోపించారు. బిఆర్‌ఎస్ సభ్యులకు మొత్తం 16 గంటల సమయం కేటాయించగా, అందులో హరీష్ రావు 4 గంటల 16 నిమిషాలు, కెటిఆర్ గంటా 44 నిమిషాలు మాట్లాడారని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ అసెంబ్లీకి హాజరు కాకపోవడం, ప్రజా సమస్యలపై మాట్లాడకపోవడం బాధాకరమని అన్నారు. బిఆర్‌ఎస్ వల్ల దాదాపు 4 గంటల 56 నిమిషాల సభా సమయం వృథా అయిందని తెలిపారు. పొంగులేటి శ్రీనివా స్ రెడ్డి అంశాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రస్తావించి స స్పెన్షన్‌కు దారి తీసేలా బిఆర్‌ఎస్ నాయకులు వ్య వహరించారని ఆరోపించారు. యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీలో 11 బిల్లులు ప్రవేశపెట్టి 10 బిల్లులు ఆమోదించామని తెలిపారు. ప్ర జలకు ఉపయోగపడే చట్టాలు తీసుకొస్తుంటే బిఆర్‌ఎస్ అడ్డంకులు సృష్టించిందని విమర్శించారు. ఇందిరమ్మ జీవిత బీమా వంటి కీలక పథకాలు తీసుకొచ్చామని, అనేక వర్గాలకు మేలు చేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కేంద్ర స్థాయిలో కూడా ఆరోపణలు వెలువడినట్లు పేర్కొన్నారు. విజయరమణరావు మాట్లాడుతూ సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్న ఆరోపణలు అసత్యమని అన్నారు. అసెంబ్లీలో చర్చల కంటే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేసి బిఆర్‌ఎస్ వాకౌట్ చేసిందని విమర్శించారు. గతంలో కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. కెటిఆర్ బయట చేస్తున్న వ్యాఖ్యలు అసభ్యకరంగా ఉన్నాయని అన్నారు. అన్ని ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓడిపోయినప్పటికీ వారి వైఖరిలో మార్పు లేదని విమర్శించారు.

# మోదీ స్మార్ట్ సిటీ మిషన్ విఫలం

## రాహుల్ గాంధీ విమర్శ




**కన్నూరు:** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేరళలోని కన్నూరులో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ సిసిఎం ఏమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని చెప్పుకొచ్చారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు బిజెపితో జత కట్టారని ఆరోపించారు. అందువల్లే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ విజయం సాధించాలని ప్రధాని కోరుకుంటున్నారని అన్నారు. ఇతరచోట్ల మతం, దేవుడి గురించి మాట్లాడే మోదీ కేరళలో మాత్రం ఆ విషయాలు ప్రస్తావించడం లేదన్నారు. శబరిమల ఆలయంలో జరిగిన బంగారు తాపడాల కుంభకోణం గురించి ఇప్పటివరకు ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బంగారు తాపడాలు మాయమవడం వెనక సిసిఎం నేతల హస్తం ఉన్నందువల్లే ఈ విషయంలో బిజెపి మౌనంగా ఉందని రాహుల్ అన్నారు. బిజెపితో సిసిఎం జత కట్టడం ఆ పార్టీలోని కొందరు సీనియర్ నేతలకు నచ్చలేదని, అందువల్లే వారు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ సిటీ మిషన్ వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని రాహుల్ అన్నారు. ఈ పథకం గురించి మోదీ నిత్యం గొప్పలు చెబుతుంటారని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. స్మార్ట్ సిటీలుగా కేంద్రం ఎంపిక చేసిన ఏ ఒక్క నగరాన్ని పూర్తిగా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. అక్కడి ప్రజలు కలుషిత నీరు, నిర్మాణ సమయంలోనే కుప్పకూలుతున్న బ్రిడ్జ్‌లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పౌరులకు ప్రాథమిక గౌరవం, స్వచ్ఛమైన నీరు, గాలి, భద్రత అందించడంలో ఆ నగరాలు విఫలమవుతుండడంతో అది ఓ అసంపూర్ణ పథకంగా మిగిలిపోయిందన్నారు.

### లోక్‌సభలో అమిత్‌షా తనకిష్టమైన తిట్టును వాడకుండానే...

# ఆవేశంగా వాగి అద్భుతం సృష్టించారు

## కాంగ్రెస్ ఎద్దేవా



**న్యూఢిల్లీ :** హోం మంత్రి అమిత్‌షాపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయి విమర్శల దాడికి దిగింది. లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా 90 నిమిషాల (గంటన్నర) పాటు తనకు ఇష్టమైన తిట్టు పదాన్ని ఒక్కసారి కూడా వాడకుండా ఆవేశంగా వాగి విరుచుకుపడటం ద్వారా ఒక అద్భుతం సాధించారని మంగళవారం కాంగ్రెస్ ఘాటైన విమర్శలతో విరుచుకుపడింది. గత రెండు దశాబ్దాలుగా నక్సల్ వ్యతిరేక వ్యూహం, కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ప్రతిపక్ష కాంగ్రెస్ నొక్కిచెప్పింది. అలాగే 2011 అక్టోబరులో జార్ఖండ్‌లోని దట్టమైన అటవీ ప్రాంతాలలో ప్రారంభించిన సరందా కార్యాచరణ ప్రణాళిక 'ఒక నిర్ణయాత్మక మలుపు' అని పేర్కొంది.మావోయిస్టుల అత్యున్నత సంస్థ, కేంద్ర వ్యవస్థను దాదాపు పూర్తిగా కూల్చివేయబడటంతో దేశం నక్సల్స్ నుంచి విముక్తి పొందిందని అమిత్‌షా ప్రకటించిన ఒక రోజు తర్వాత కాంగ్రెస్ ఈ ప్రకటనలు చేసింది. తీవ్రవాదులు సాగిస్తున్న సుదీర్ఘ హింసాకాండను అంతం చేయడానికి 'కాంగ్రెస్ ఏమీ చేయడంలేదు' అని కూడా అమిత్‌షా ఆరోపించారు. 'దేశాన్ని వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యుఇ) నుంచి విముక్తి చేసే ప్రయత్నాలు' అనే అంశంపై లోక్‌సభలో జరిగిన చర్చకు సమాధానమిస్తూ కాంగ్రెస్ నాయకుడైన రాహుల్‌గాంధీ సానుభూతిపరులైన నక్సల్స్‌తో బహిరంగంగా చాలాసార్లు కనిపించారని, అంతేకాకుండా తన మీడియా హ్యాండిల్ నుంచి మావోయిస్టుల పట్ల సానుభూతి చూపే అనేక వీడియోలను కూడా ఆయన పోస్ట్ చేశారని అమిత్‌షా ఆరోపించారు. అమిత్‌షాపై పరోక్షంగా విమర్శలు చేస్తూ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేశ్ ఇలా అన్నారు. నిన్న లోక్‌సభలో హోం మంత్రి ఒక అద్భుతం చేశారని. గత సందర్భాలలో తొలగించిన తనకు ఇష్టమైన తిట్టు పదాన్ని ఒక్కసారి కూడా ఉపయోగించకుండా, ఆయన 90 నిమిషాలపాటు ఆవేశంగా, తీవ్రంగా మాట్లాడారని ఈ నెల ప్రారంభంలో అమిత్‌షాపై విమర్శలు చేస్తూ జైరాం రమేశ్ చేసిన పోస్ట్‌కు 'X' అని ట్యాగ్‌చేసి, లోక్‌సభలో తాను మళ్లీ ఉచ్చరించడానికి ఇష్టపడే పదాలలో ఒకదానిని తొలగించారని కూడా ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలన్న ప్రతిపక్షాల ప్రతిపాదన దిగువసభలో జరిగిన వాడీవేడి చర్చ తర్వాత ఓడిపోవడంతో అమిత్‌షాపై ఆ విమర్శ వచ్చింది. ఆ చర్చకు స్పందిస్తూ సభలో తనను మాట్లాడటానికి తనను అనుమతించడం లేదన్న రాహుల్‌గాంధీ వాదనను అమిత్‌షా అప్పట్లో కొట్టిపారేశారు. ఆ కాంగ్రెస్ నాయకుడు మాట్లాడటానికి ఇష్టపడనందున సమావేశాలు, చర్చల సమయంలో ఉద్దేశపూర్వకంగానే ఆయన తరచూ బయట ఉండేవారని ఆయన అన్నారు. తీర్మానంపై రెండు రోజులపాటు జరిగిన చర్చలో హోం మంత్రి తన ప్రసంగాన్ని ముగిస్తున్న సమయంలో సభ్యులు సభ మధ్యలోకి దూసుకెళ్లి నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. అమిత్‌షా చేసిన కొన్ని వ్యాఖ్యలు 'అభ్యంతరకరమైనవి' అని పేర్కొంటూ వాటికి వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నక్సల్ హింస నిర్మూలనకు ప్రకటించిన గడువుకు ఒక రోజు ముందు ఈ చర్చ జరిగింది. గత సంవత్సరం 2026 మార్చి 31నాటికి దేశంలో ఎల్‌డబ్ల్యు అంతం అవుతుందని నక్సల్స్‌కు వ్యతిరేకంగా ఒక భారీ ఆపరేషన్ నిర్వహించబడుతుందని అమిత్ షా ప్రకటించారు. మోదీ ప్రభుత్వపు అతిపెద్ద విజయం 'నక్సల్స్‌రహిత భారతదేశం' అని, ఈ విషయాన్ని ఏ పరిశోధకుడైనాసరే అంగీకరించాల్సిందేనని అమిత్‌షా అన్నారు. 'అక్టోబరు 2011లో జార్ఖండ్‌లోని దట్టమైన అటవీ ప్రాంతాలలో ప్రారంభించబడిన సరందా కార్యచరణ ప్రణాళిక ఒక పరివర్తనాత్మకమైన చొరవి, ఇది ఇతర ప్రాంతాలలో కూడా అనుసరించబడిన ఒక నమూనాగా నిలిచింది. అది ఒక నిర్ణయాత్మక మలుపు' అని జైరాం రమేశ్ 2011 అక్టోబరులో అప్పటి జార్ఖండ్ ముఖ్యమంత్రి అర్జున్ ముండాకు రాసిన లేఖలో కూడా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

# బిహార్ గుడిలో తొక్కిసలాట

## 8 మంది భక్తులు మృతి



**పాట్నా:** బిహార్‌లోని నలందలో ఘోర విషాదం జరిగింది. శీతలా మాత ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 8 మంది మహిళలు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉ న్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం జరిగిన ఈ ఘటనలో భారీగా భక్తులు ఒక్కసారిగా గుమిగూడటంతో తీవ్ర రద్దీ ఏర్పడి, ఆందోళనలో ఒకరిపై ఒకరు పడిపోవడంతో ప్రమాదం సంభవించినట్లుగా తెలుస్తోంది.

**అధిక రద్దీ కారణంగా ప్రమాదం**

నలంద జిల్లాలోని మాఘా గ్రామంలోని శీతలామాత ఆలయానికి ప్రతి మంగళవారం భక్తులు వస్తుంటారు. అయితే ఈసారి మహావీర జయంతి, చైత్ర మాసం చివరి మంగళవారం కావడంతో ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచి భక్తుల రాక పెరుగుతూ వచ్చింది. ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో ఒక్కసారిగా రద్దీ పెరగడంతో భక్తులు ఒకరిపై ఒకరు పడిపోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానిక గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన మోదీ,సిఎం**

ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కూడా సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.6లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. మరోవైపు ఈ ప్రమాదంపై ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని చెప్పారు. గాయపడిన వారికి సరైన చికిత్స కోసం ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# బెంగాల్‌లో ఓటర్లకు ముప్పు

• సర్ పేరుతో నిజమైన ఓటర్లను తొలగించే ప్రమాదం • ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు మూడు పేజీల లేఖ రాసిన మమత బెనర్జీ



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. సర్ ప్రక్రియ పేరుతో నిజమైన ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు మూడు పేజీల లేఖ రాసిన మమత, ఇసి తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. 'ఒక రాజ్యాంగ సంస్థ నుంచి ఆశించే ప్రమాణాలు ఇవి కావు' అని ఆమె లేఖలో స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడం ఇసి బాధ్యత అని గుర్తు చేశారు. ఇక బంగాల్‌లో ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరుగగా, మే 4న ఫలితాలు వెల్లడించనున్నారు. ఇదే సమయంలో, బిజెపిపై కూడా మమతా ఘాటు విమర్శలు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ ఓటర్లను బెంగాల్ ఓటర్ల జాబితాలో చేర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

**బిజెపికి బెంగాల్ ప్రజలపై గౌరవం లేదు!**

పశ్చిమ మేదినిపూర్ జిల్లా చంద్రకోణాలో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడిన మమతా, ఒక్క రోజులోనే సుమారు 30 వేల కొత్త ఓటర్ల నమోదు ఫారాలు సమర్పించారని తెలిపారు. దీనిపై సమాచారం అందడంతో అభిషేక్ బెనర్జీ తన ప్రచారాన్ని మధ్యలో వదిలి ఇసి కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. బిజెపికి బెంగాల్ ప్రజలపై గౌరవం లేదని, ఎన్నికల్లో గెలవడానికి ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉందని మమతా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో మహిళలు, మైనారిటీల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు.

**నాన్ వెజ్‌పై నిషేధం విధించే ప్రమాదం**

బిజెపి, ఇసి కలిసి ప్రజల పౌరసత్వం, రాజ్యాంగ హక్కులను లాక్కుంటున్నాయి. దీనికి వ్యతిరేకంగా మేము చివరి వరకు పోరాడుతాం' అని మమత స్పష్టం చేశారు. అలాగే, బిజెపి అధికారంలోకి వస్తే బెంగాల్ ప్రజల ఆహారపు అలవాట్లపై కూడా నియంత్రణలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యేకంగా నాన్‌వెజ్ ఆహారంపై నిషేధం విధించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్‌సి అమలు చేయాలని చూస్తోందని, అయితే తమ ప్రభుత్వం ఉన్నంత కాలం బెంగాల్‌లో ఎన్ఆర్‌సికి అనుమతి ఇవ్వబోమని మమత తేల్చి చెప్పారు. డిటెన్షన్ క్యాంపుల ఏర్పాటుకు కూడా తాము వ్యతిరేకమని తెలిపారు. ఇంకా బ్యాంకురా, బిష్ణుపూర్, గర్బేటా ప్రాంతాల్లో జరిగిన సభల్లో మమతా బిజెపిపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షలాది నిజమైన ఓటర్ల పేర్లు తొలగించారని, అల్లర్లకు ప్రోత్సాహం ఇచ్చారని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను అడ్డుకున్నారని ఆరోపించారు.

**బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను వేధిస్తోందంటూ!**

బిజెపి ఒక బార్బరిక్ పార్టీ అని, బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను వేధిస్తోందని మమతా విమర్శించారు. బెంగాల్ యువత ప్రతిభ, సంస్కృతి, విజయాలపై బిజెపికి అసూయ ఉందని వ్యాఖ్యానించారు. తనను కొనుగోలు చేయలేరనే కారణంతోనే బిజెపి నాయకులు తనను ద్వేషిస్తున్నారని కూడా మమతా పేర్కొన్నారు. ఇక ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులెవరో పట్టించుకోకుండా, తానే అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థినిగా భావించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. మరోవైపు, బిజెపి నకిలీ ఓటర్ల నమోదు చేసిందంటూ టీఎంసీ ఆరోపించిన నేపథ్యంలో విచారణ జరుపుతామని బంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్ తెలిపారు. తన కార్యాలయంలోని సిసిటివి ఫుటేజీని సమీక్షిస్తానని హామీ ఇచ్చారు. ఓటర్ల జాబితాలో తొలిసారి ఓటు వేసేవారిని చేర్చడానికి లేదా ఒక నియోజకవర్గం నుంచి మరొక నియోజకవర్గానికి ఓటరును మార్చడానికి ఫారం 6 నింపుతారు. సుప్రీంకోర్టు ఆదేశాలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ, బిజెపి కొద్ది గంటల్లోనే సుమారు 30,000 ఫారం 6 లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) కార్యాలయానికి సమర్పించిందని టిఎంసి నాయకుడు అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. సోమవారం సిఇఒతో సమావేశమైన అనంతరం అభిషేక్ బెనర్జీ మాట్లాడుతూ 'సుప్రీంకోర్టు ఆదేశాలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ, ఆరు నుంచి ఏడు గంటల్లోనే సుమారు 30,000 ఫారం 6లు సిఇఒ కార్యాలయానికి వచ్చాయని మాకు విశ్వసనీయ సమాచారం ఉంది' అని అన్నారు. సిఇఒ సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేకపోయారని, టిఎంసి దీనిని చూస్తూ ఊరుకోదని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై స్పందిస్తూ, ఎన్నికల సంఘం ఫిర్యాదులను తీవ్రంగా పరిగణిస్తోందని, విచారణ జరుపుతామని మనోజ్ కుమార్ అగర్వాల్ అన్నారు.

### నలంద విశ్వవిద్యాలయం బౌద్ధ అధ్యయనాలకు...

# ప్రపంచంలోనే ఒక ప్రముఖ కేంద్రంగా ఆవిర్భవించాలి

• రాష్ట్రపతి ముర్ము ఆశాభావం • స్నాతకోత్సవంలో 36మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం



**రాజ్‌గిర్ (బిహార్) :** నలంద విశ్వవిద్యాలయం పునరుద్ధరణ అనేది దాని ఘనమైన వారసత్వాన్ని ఆధునిక వాతావరణంలో పున: స్థాపించడానికి జాతీయ, అంతర్జాతీయ నిబద్ధతకు ప్రతీక అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. మంగళవారం ఇక్కడ యూనివర్సిటీ స్నాతకోత్సవం కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ప్రాచీన నలంద విశ్వవిద్యాలయం సుమారు 8 శతాబ్దాలపాటు గొప్ప జ్ఞాన కేంద్రంగా నిలదొక్కుకుందన్నారు. దాని పతనం భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికే తీరని నష్టమని రాష్ట్రపతి పేర్కొన్నారు. 'దీని పునరుద్ధరణ అనేది యూనివర్సిటీ యొక్క ఘనమైన వాతావరణాన్ని ఆధునిక వాతావరణంలో పున: స్థాపించడానికి జాతీయ, అంతర్జాతీయ నిబద్ధతకు ఒక ప్రతీక' అని ద్రౌపది ముర్ము అన్నారు. ప్రపంచం అనేక సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో కరుణ, స్వాతంత్ర్యం, విమర్శనాత్మక ఆలోచనల అవసరం గతంలో కంటే ఎక్కువగా ఉన్నందున నలంద విశ్వవిద్యాలయం ఒక ప్రముఖ ప్రపంచ విద్యా సంస్థగా ఆవిర్భవిస్తుందని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. అదే సమయంలో దాని పురోగతి వల్ల కలిగే ప్రయోజనాలు అది స్థాపించబడిన సమాజానికి కూడా చేరాలని ఆమె నొక్కిచెప్పారు. సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థలతో అనుసంధానం కావడానికి విశ్వవిద్యాలయం చేపట్టిన సామాజిక కార్యక్రమాలను రాష్ట్రపతి అభినందించారు. పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేస్తూ ఈ సంస్థ విద్యార్థులు మానవాళి యొక్క ఉమ్మడి వారసత్వాన్ని పొందుతున్నారని ఇక్కడ నుండి పట్టభద్రులయ్యే విద్యార్థులు రెండు విషయాలను పొందుతారని అవి ఒకటి డిగ్రీ, రెండవది వారసత్వం అన్నారు. డిగ్రీ వారి వ్యక్తిగత విజయం అయితే మానవత్వ వారసత్వం అందరూ పంచుకునేది అని ద్రౌపది ముర్ము తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి నలంద విశ్వవిద్యాలయానికి చెందిన 36మంది విద్యార్థులకు బంగారు పతకాలను కూడా ప్రదానం చేశారు. ఈ సంవత్సరం పట్టభద్రులైన విద్యార్థులలో సగానికి పైగా30కి పైదేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని రాష్ట్రపతి ముర్ము సంతోషం వ్యక్తంచేశారు. జ్ఞానం శాశ్వతంగా నిలుస్తుందని, సంభాషణ విజయం సాధిస్తుందని, అభ్యసనం కొనసాగుతుందని ఇచ్చిన వాగ్దానాన్ని ఆ విద్య మానవత్వపు సేవ చేస్తూనే ఉంటుందని రాష్ట్రపతి అన్నారు. మహావీర్ జయంతిని పురస్కరించుకుని ముర్ము మాట్లాడుతూ మహావీర్, బుద్ధుడు ఈ ప్రాంతం నుంచి కరుణ, అహింస, ప్రేమ సందేశాన్ని యావత్ మానవాళికి వ్యాప్తి చేశారని చెప్పారు. బౌద్ధ ఆలోచన చరిత్రలోని అత్యుత్తమ మేధావులలో కొందరు నలందలో నివసించి, పనిచేశారని ఆమె చెప్పారు.

# బిజెపి గూటికి లియాండర్ పేస్

**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ బిజెపి కండువా కప్పుకున్నారు. కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సమక్షంలో మంగళవారం ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పేస్ సాధించిన విజయాలను రిజిజు గుర్తుచేసుకున్నారు. 22 ఏళ్లకే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో పురుషుల సింగిల్స్‌లో కాంస్యం నెగ్గి... పేస్ సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు. రిజిజు మాట్లాడుతూ 'ఒలింపిక్ మెడల్స్ జాబితాలో భారత్ పేరు చేరేలా చేశారు. బిజెపి వేదికగా ఇకనుంచి ఆయన దేశానికి సేవ చేయనున్నారు' అని చెప్పుకొచ్చారు. కోల్‌కతాలో పుట్టిన పేస్... తల్లిదండ్రుల ప్రోత్సాహంతో టెన్నిస్ వైపు నడిచారు. తన కెరీర్‌లో ఏకంగా 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచాడు. అందులో 10 మిక్స్‌డ్ డబుల్స్‌లో, 8 పురుషుల డబుల్స్‌లో నెగ్గారు. రాకెట్ వదిలి... 2021లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడు ఆ పార్టీ తరఫున ప్రచారం చేశారు.

# యుసిసి అమలు చేస్తాం



## మహిళలకు నెలకు రూ.3 వేలు అసోంలో బిజెపి మ్యానిఫెస్టో హామీ

**గువహతి:** అసోం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బిజెపి మంగళవారం మ్యానిఫెస్టో విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి)తో పాటు మహిళలకు నెలకు రూ.3 వేలు అందిస్తామంటూ హామీలు ప్రకటించింది. మొత్తం 31 హామీలతో కూడిన మ్యానిఫెస్టోను అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు నేతలు విడుదల చేశారు. మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే...రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్, ఎస్‌టి ప్రాంతాలు మినహా అసోం అంతటా యుసిసి అమలు చేస్తామని బిజెపి హామీ ఇచ్చింది. వరదరహిత రాష్ట్రంగా చర్యలు తీసుకుంటామని, బంగ్లాదేశీ మియాలు ఆక్రమించుకున్న భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, అరుణోదయ పథకం కింద మహిళలకు నెలకు రూ.3 వేలు అందజేస్తామని, ఐదేళ్లలో 2 లక్షల మందికి ఉద్యోగాల కల్పన,లఖ్‌పతి దీదీ పథకం కింద 40 లక్షల మంది మహిళలకు ప్రోత్సాహకాలు అందిస్తామని హామీలు గుప్పించింది.

# భారీ ఉగ్రకుట్ర బట్టబయలు

డిల్లీలో లష్కరే తొయిబా ఉగ్రవాది అరెస్ట్.. సంచలన నిజాలు వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశంలో భారీ ఉగ్రకుట్ర బయటపడింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు సహకరిస్తున్న షబ్బిర్ అహ్మద్ అనే ఉగ్రవాదిని ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి ఉగ్రదాడులకు సంబంధించి కీలక సమాచారాన్ని సేకరించారు. ఈ విచారణలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని వాణిజ్య ప్రాంతాలు, హిందూ దేవాలయాలే టార్గెట్‌గా ఎంచుకున్నట్లు వెల్లడైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బంగ్లాదేశ్ కేంద్రంగా పని చేసే ఉగ్రసంస్థలతో, అలాగే పాక్ ఉగ్రవాద సంస్థలతోనూ ఢిల్లీకి చెందిన షబ్బిర్ అహ్మద్ సంబంధాలు కలిగి ఉన్నాడు. దేశంలోని కీలక ప్రదేశాలకు సంబంధించిన సమాచారాన్ని అతడు లష్కరే తొయిబా వంటి సంస్థలకు చేరవేశాడు. ఢిల్లీలోని ప్రధాన కేంద్రాల్ని వారు లక్ష్యంగా ఎంచుకుని, అనేక ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని హిందూ ఆధ్యాత్మిక కేంద్రాలైన కల్కాజి టెంపుల్, చాతర్‌పూర్ టెంపుల్, లోటస్ టెంపుల్‌లతోపాటు ప్రధాన వాణిజ్య కేంద్రాలైన కొన్నాట్ ప్లేస్, పహార్‌గంజ్ వంటి కమర్షియల్ హబ్స్‌ను ఎంచుకున్నారు. షబ్బిర్ అహ్మద్ వాటిని మొత్తం పరిశీలించి, అక్కడి వివరాల్ని వీడియోలుగా చిత్రీకరించి, వాటిని పాక్ ఉగ్రసంస్థలకు చేరవేశాడు. షబ్బిర్ ఒంటరిగా తిరుగుతూ ఆ ప్రదేశాల వివరాల్ని సేకరించాడు. అతడు బంగ్లాదేశ్, పాక్ ఉగ్రవాద సంస్థలతోపాటు ఐఎస్‌ఐ వంటి పాక్ ఇంటెలిజెన్స్ సంస్థలతో కూడా కలిసి పని చేస్తున్నాడు. బంగ్లాదేశ్‌లో ఒక కొత్త తీవ్రవాద సంస్థను స్థాపించాలనే లక్ష్యంలో భాగంగా షాబిద్, మిగతా ఉగ్రవాదులు కలిసి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ చుట్టు పక్కల ప్రాంతాల్లో సభ్యుల్ని చేర్చుకోవడం, ఉగ్రవాదంపై ప్రోత్సహించడం వంటి కార్యకలాపాలు లక్ష్యంగా వీరు పని చేస్తున్నారు. భారత నిఘా సంస్థల నుంచి తప్పించుకునేందుకు షబ్బిర్.. టెలిగ్రాం వంటి యాప్స్ వాడేవాడు. ఇటీవల ఇలాగే జమ్మూ కాశ్మీర్‌లో ఇలాగే టీఆర్‌ఎఫ్ (ద రెసిస్టెన్స్ ఫ్రంట్) అనే ఉగ్ర సంస్థ పుట్టుకొచ్చిన సంగతి తెలిసిందే. ఢిల్లీ పోలీసులు సరైన సమయంలో షబ్బిర్ అనే ఉగ్రవాదిని గుర్తించడంతో భారీ కుట్ర భగ్నమైంది.

# నేటి నుంచి జేబుకు చిల్లు

## అమలులోకి కొత్త విధానాలు

**న్యూఢిల్లీ:** కొత్త ఆర్థిక సంవత్సరం (2026–27) బుధవారం నుంచి ప్రారంభం కానుండటంతో బ్యాంకింగ్, పన్నులు, పెట్టుబడులకు సంబంధించి పలు కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ మార్పులు ప్రజల నెలవారీ బడ్జెట్ నుంచి దీర్ఘకాలిక పొదుపు వరకు అన్నింటిపై ప్రభావం చూపుతాయి. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో పన్ను చెల్లింపుదారులు తమ ఆదాయ వివరాలు నమోదు చేసే ప్రక్రియలో మార్పులు ఉంటాయి. ముఖ్యంగా డిఫాల్ట్ పన్ను విధానం ఎంచుకునే వారికి మరిన్ని ప్రయోజనాలు అందే అవకాశం ఉంది. చాలా బ్యాంకులు ఏప్రిల్ 1 నుంచి క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్ల నిబంధనలు సవరించాయి. అద్దె చెల్లింపులు లేదా ఇన్సూరెన్స్ ప్రీమియంపై వచ్చే రివార్డ్ పాయింట్లలో కోత విధించే అవకాశం ఉంది. ఇక నుంచి అన్ని కొత్త బీమా పాలసీలను తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ రూపంలోనే జారీ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల డాక్యుమెంట్లు పోగొట్టుకునే భయం ఉండదు. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారులు తమ కేవైసీ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి. అధికారిక పత్రాల ప్రకారం కేవైసీ పూర్తి చేయని ఖాతాల నుంచి లావాదేవీలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ప్రతి నెల ఒకటో తేదీన చమురు సంస్థలు ఎల్‌పీజీ ధరలు సమీక్షిస్తాయి.

### సెమీ కండక్టర్ సరఫరాదారుగా

# భారత్ పాత్ర బలోపేతం: మోదీ



**న్యూఢిల్లీ:** ప్రపంచంలో విశ్వసనీయ సెమీకండక్టర్ సరఫరాదారుగా భారతదేశం తన పాత్రను బలోపేతం చేసుకుంటోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సనంద్‌లో కేన్స్ సెమికాన్‌కు చెందిన అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ ప్లాంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఈ ప్లాంట్ ప్రారంభోత్సవం ఆత్మనిర్భరత దిశగా భారతదేశం చేస్తున్న ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని, ఇది పటిష్టమైన సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో ఒక మైలురాయి అని తెలిపారు. ప్రపంచ సెమీకండక్టర్ సరఫరా గొలుసులో ఒక భారతీయ కంపెనీ చేరడం గర్వకారణమని పేర్కొంటూ, ఇది కేవలం ఆర్థిక పోటీ సమయం మాత్రమే కాదని, భవిష్యత్ టెక్నాలజీ రంగ స్వరూపాన్ని తీర్చిదిద్దాల్సిన సమయం అని మోదీ అన్నారు. 'ఈ ప్రాజెక్టులో ఉత్పత్తి ప్రారంభం కావడంతో ప్రపంచ మార్కెట్‌లో విశ్వసనీయ సెమీకండక్టర్ సరఫరాదారుగా భారతదేశం తన పాత్రను మరింత బలోపేతం చేసుకుంటోంది. ఒక విధంగా చెప్పాలంటే, ఈ రోజు సనంద్, సిలికాన్ వ్యాలీ మధ్య ఒక కొత్త వారధి ఏర్పడింది. సనంద్‌లోని ప్లాంట్ ఇప్పుడు కాలిఫోర్నియా కేంద్రంగా పని చేస్తున్న ఒక సంస్థకు 'ఇంటెలిజెంట్ పవర్ మాడ్యూల్స్‌ను సరఫరా చేస్తోంది' అని ప్రధాని పేర్కొన్నారు. భారతదేశం 2021లో సెమీకండక్టర్ మిషన్‌ను ప్రారంభించిందని, ఇది కేవలం ఒక పారిశ్రామిక విధానం మాత్రమే కాదని, భారతదేశ ఆత్మవిశ్వాసానికి ఒక ప్రకటన అని అన్నారు. 'ఉత్పత్తిలోని ప్రతి రంగంలో దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు భారతదేశం గత బడ్జెట్‌లో సెమీకండక్టర్ మిషన్ 2ను ప్రారంభించింది' అని ఆయన పేర్కొన్నారు.

# హైతీ సాయుధముఠా దాడిలో 70 మంది మృతి

## సమగ్ర దర్యాప్తునకు ఐక్యరాజ్యసమితి డిమాండ్

**పోర్ట్ ఔ ప్రిన్స్:** కరీబియన్ సముద్రంలో క్యూబా సమీప దేశం రిపబ్లిక్ ఆఫ్ హైతీలోని ఆర్టిబోనైట్‌లో సాయుధ ముఠా చేసిన దాడిలో 70 మంది మరణించారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీంతో తీవ్ర భయాందోళన చెందిన 6000 మంది ప్రజలు ఆ ప్రాంతం నుండి ఇళ్ళు ఖాళీ చేసి దూరంగా పారిపోయారు. గ్రాన్‌గ్రిఫ్ కు చెందిన సాయుధ ముఠా సభ్యులు తెల్లవారుజామున ప్రజలు గాఢనిద్రలో ఉన్న సమయంలో జీన్–డెనిస్ ప్రాంతంపై దాడి చేశారని స్థానిక పౌర రక్షణ అధికారులు చెప్పారు. ఈ సమీపంలో ఉన్న వెరెట్టెస్‌లో ఇటీవల దాడులు చేయడంతో 2000 మంది నిరాశ్రయులయ్యారు. గ్రాన్ గ్రిఫ్, వివ్ అన్సామ్ ముఠాలమధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణలు సర్వత్రా వ్యాపిస్తున్నాయి. రాజధాని పోర్ట్ ఔ ప్రిన్స్‌లో అధికభాగాన్ని సాయుధ ముఠాలు పాలిస్తున్నాయి. దీనిని అదుపు చేయడం కోసం ఐక్యరాజ్యసమితి సారథ్యంలోని బలగాలు, అమెరికాకు చెందిన ఒక ప్రైవేటు సంస్థ సహాయంతో హైతీ భద్రతా దళాలు కృషి చేస్తున్నాయి. 2021 నుండీ ఇప్పటివరకూ ఈ ముఠాలవల్ల 20,000 మంది మరణించారు. ఐనాగానీ ఏ ఒక్క ముఠా నాయకుణ్ణీ ఇప్పటివరకూ అరెస్టు చేయలేదు. ప్రతి ఏడాదీ ఈ మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆర్టిబోనైట్ అనేది వ్యవసాయ ప్రధానమైన ప్రాంతం. అధికారిక గణాంకాల కంటే చాలా ఎక్కువమంది ఈ దాడుల్లో మరణించారని హైతీ మానవహక్కుల సంఘం (కలెక్టివ్ డిఫెండింగ్ హ్యూమన్ రైట్స్) ప్రకటించింది. భద్రతా సిబ్బంది ఏ విధ ంగానూ స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మానవ హక్కుల సంఘం తీవ్రంగా విమర్శించింది.

# ఇండిగో కొత్త సిఇఒ విలియం వాల్ష్

**న్యూఢిల్లీ:** ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో సిఇఒగా బ్రిటీష్ ఎయిర్‌వేస్ మాజీ చీఫ్ విలియం వాల్ష్ నియమితులయ్యారు. పీటర్ ఎల్బర్స్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీని వాల్ష్‌తో ఇండిగో భర్తీ చేసింది. ప్రస్తుతం ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్‌గా వాల్ష్ వ్యవహరిస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో భారీ స్థాయిలో ఇండిగో విమానాలు రద్దైన సంగతి తెలిసిందే. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తర్వాత పీటర్ ఎల్బర్స్ తన పదవీకాలం ముగియడానికి 18 నెలల ముందే అకస్మాత్తుగా రాజీనామా చేశారు. దీంతో కొత్త సిఇఒ నియామకం చోటుచేసుకుంది. ఇండిగో వంటి బలమైన పునాదులు కలిగిన సంస్థకు నాయకత్వం వహించడం సంతోషంగా ఉందని విలియం వాల్ష్ పేర్కొన్నారు. విమానయాన రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంస్థను ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
బుధవారం
01-04-2026
www.prajapaksham.in
PEOPLE'S VIEWS
ఎడిట్
PEOPLE'S VIEWS



# ఉచిత ప్రదానాల్లో పోటీ

భారత రాజ్యాంగం సంక్షేమ రాజ్యాన్ని హామీ ఇచ్చింది. 1990 దాకా ప్రభుత్వాలు ఆ దిశలో ప్రయాణానికి ప్రాధాన్యం ఇచ్చాయి. 1991లో నయా ఉదార ఆర్థిక విధానాలు ప్రవేశించాక సంక్షేమానికి తిలోదకాలిచ్చారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) పేరుతో పెట్టుబడులకు పెద్ద పీట వేసి సామాన్య ప్రజలను, రైతులను దోచుకునే విధానాలు రాజ్యమేలుతున్నాయి. అధికారంకోసం ఇక్కడే మరో వైరుధ్యం అస్థిత్వంలోకి వచ్చింది. ప్రభుత్వ విధానాల్లో పెట్టుబడికి సేవచేస్తూ, అధికారంకోసం ఎన్నికల్లో ఓటర్లకు ఉచిత సహాయం అందించే పథకాలు నెమ్మదిగా ప్రారంభమై ఇప్పుడు పరాకాష్టకు చేరాయి. దోపిడీకి గురవుతున్న పేదలకు ఎంతోకొంత ఉపశమనం చేకూర్చేందుకు కొన్ని పార్టీలు ప్రారంభించిన ఈ వాగ్దాన చొరవలను 'తాయిలాలు'గా, పరిహసించిన ప్రధాని నరేంద్ర మోదీ, కొద్దికాలంలోనే బిజెపి మేనిఫెస్టోల్లో ఉచిత పథకాలు చేర్చటాన్ని అనుమతించారు. కేంద్రంలో తాము అధికారంలో ఉన్నందున రాష్ట్రాల్లో కూడా తమ/తమ కూటమి ప్రభుత్వాలను గెలిపిస్తేనే 'రెండు ఇంజిన్‌ల' ప్రభుత్వం ఉచిత పథకాలను సమర్థవంతంగా అమలు జరుపగలుగుతుందని ఉద్ఘాటించటం మొదలుపెట్టారు. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు పంపిణీ చేసే రాజకీయ అవినీతి, ఓటర్లకు ఉచిత ప్రదానాల పేరుతో అధికారికంగా రాజకీయ ఎజండాలోకి చేరింది. పాలక వర్గ పార్టీల మధ్య పోటీ పెరిగింది. అభ్యర్థుందరూ మహా కోటీశ్వరులే. ఆర్థిక అసమానతలు నెలకొని ఉన్న సమాజంలో అర్హులైన వారికి రాజ్యం సహాయం చేయటం సంక్షేమం కిందకు వస్తుంది. కాని విచక్షణారహితంగా మహిళా ఓటర్లను ఆకర్షించే పథకాలు పెరుగుతున్నాయి. మహిళలు ఉచిత నగదు సహాయం ఇవాళ దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఒక లక్షణంగా మారింది – చెల్లించే నగదు మొత్తంలో వ్యత్యాసాలున్నాయి – అంతే. సంక్షేమ పథకాలకు చెల్లింపులకే ఆదాయం సరిపోక పలు రాష్ట్రాలు అభివృద్ధి కార్యక్రమాలకు అప్పులపై ఆధారపడుతున్నాయి – కిస్తీలు చెల్లించలేక కొన్ని ప్రభుత్వాలు గింజుకుంటూ గత ప్రభుత్వాలను నిందిస్తుంటాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంచుకునేందుకు సంపన్నులపై, పెట్టుబడిదారులపై పన్నులు పెంచాలి. ఆ పనిచేస్తే పెట్టుబడిదారులు తక్కువ పన్నులున్న రాష్ట్రాలకు వెళ్లిపోతారన్న భయం. అందువల్ల వారికి రాయితీలు, పన్నుల తగ్గింపు మోదీ ప్రభుత్వ విధానంగా ఉండగా ఏ రాష్ట్రం సంపద వృద్ధిపై పన్నులు వేయగలదు!

ఏప్రిల్ నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో అసోం ఒకటి. అక్కడ ప్రధాన ప్రత్యర్థులు బిజెపి, కాంగ్రెస్. పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ అధికారంకోసం ఓటర్లకు కొన్ని 'గ్యారంటీలు' హామీ ఇచ్చిందంటే అర్థం చేసుకోవచ్చు. కాని పదేళ్లుగా అధికారంలో ఉండి అస్సామీ జాతీయవాదం, ముస్లిం వ్యతిరేకతతో సమాజాన్ని విభజించి ఏలుబడి సాగిస్తున్న బిజెపికి ఇబ్బెడుముబ్బెడు ఉచితాలు హామీ ఇవ్వటం ఎందుకు అవసరమైంది. కచ్చితంగా మూడవసారి అధికారం మాదే అని డప్పుకొడుతున్న ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ భయపడుతున్నారని అర్థం.

కాంగ్రెస్ పార్టీ మార్చి 29న అసోం ఓటర్లకు ఐదు 'గ్యారంటీల'తో మ్యానిఫెస్టో విడుదల చేయగా, రెండ్రోజుల తర్వాత బిజెపి 31వాగ్దానాలతో ప్రణాళిక విడుదల చేసింది. రాష్ట్రంలో ఎన్‌డిఎ, అంతకుముందు యుపిఎ ప్రభుత్వ సాఫల్యాలను బేరీజు వేసి తమ పాలన గొప్పగా ఉందని బిజెపి మ్యానిఫెస్టో ఉద్ఘాటించింది.

కాంగ్రెస్ ఐదు గ్యారంటీలు : వ్యాపారం ప్రారంభించటానికి లేదా వృద్ధి కోసం ప్రతి మహిళ బ్యాంక్ ఖాతాకు రూ.50,000లు బదిలీ. రాజకీయ వివక్షత ఉండదు. రెండు, రూ.25లక్షల వరకు నగదు రహిత ఆరోగ్య రక్షణ; మూడు, ప్రజా గాయకుడు జుబీన్ గార్గ్ హత్య విషయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో న్యాయం చేయటం; నాలుగు, వృద్ధాప్య పెన్షన్ నెలకు రూ.250 నుంచి రూ. 1250కి పెంపుదల; 5, 'భూమి పుత్రులకు' 10లక్షల వార్షిక పట్టాల స్థానంలో శాశ్వత పట్టాలు ఇస్తాం.

బిజెపి వారి వాగ్దానాల్లో కొన్ని : తొలి సంకల్పం – అసోం ఆది ప్రజల భూమిని, వారసత్వాన్ని, గౌరవాన్ని కాపాడతాం. ఇది చాలా మౌలికమైనది. రెండు, ఏకరూప పౌర స్మృతి అమలు (6వ షెడ్యూలు ప్రాంతాలు, గిరిజనులకు మినహాయింపు), లవ్ జిహాద్‌ను అరికట్టేందుకు కఠినమైన చట్టం, భూమి జిహాద్ నిరోధానికి గట్టి చర్యలు; అదనంగా 2లక్షల ఉద్యోగాలు, కొత్త పరిశ్రమల స్థాపనకు 10లక్షల మంది యువతకు రూ.5లక్షల వరకు ఆర్థిక సహాయం, ఉచిత రేషన్, జిల్లాకొక యూనివర్శిటీ, పేదలకు కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య, మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం రూ.3వేలకు పెంపు, రైతులకు ఏటా రూ.11 వేలు వగైరా.

బిజెపి అభ్యర్థులలో ముస్లిం ఒక్కరూ లేకపోవటం ప్రత్యేకించి గమనించదగింది. ఇది దేశవ్యాప్తంగా బిజెపి అనుసరిస్తున్న మినహాయింపు విధానం. ఇది సమాజాన్ని ఎంతగా విభజిస్తుందో ఊహించుకోవచ్చు. ఇది తాత్కాలికంగా ఎన్నికల ప్రయోజనం చేకూర్చవచ్చు. కాని దేశ సమైక్యతకు దీర్ఘకాలంలో జరిగే చేటును విస్మరించటం బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ సంకుచిత భావజాలానికి నిదర్శనం. ●



## హింస, సంఘర్షణలు ముగియాలి

అన్ని మతాలు సహనాన్ని, శాంతిని బోధిస్తాయి. హింసను ఖండిస్తాయి. ఏ ఆధ్యాత్మిక సంప్రదాయంలోనూ హింసకు స్థానం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు శాంతి కోసం కృషి చేయాలి. పశ్చిమాసియా సహా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న హింస, సంఘర్షణలు త్వరగా ముగియాలి. పశ్చిమాసియా, రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న సంఘర్షణలకు శాశ్వత పరిష్కారం చర్చలు, దౌత్యం, పరస్పర గౌరవంపై ఆధారపడి ఉంటుంది. మనమందరం తోబుట్టువులమనే అవగాహనతో ఈ సంఘర్షణలను పరిష్కరించుకోవాలి.

– నోబెల్ గ్రహీత దలైలామా

## ఆల్ ఫూల్స్ డే - మానసిక సాంత్వన వేదిక!

తాజా సమాచారం ప్రకారం, అమెరికా అధ్యక్షుడు తాను ఇటీవల తీసుకున్న నిర్ణయాలన్నింటినీ వెనక్కి తీసుకున్నారనే వార్త ప్రపంచ మానవాళిని ఆనంద డోలికల్లో ముంచేస్తున్నది. అదే విధంగా ప్రపంచ ప్రజలు స్మార్ట్‌ఫోన్‌పై విరక్తి చెంది నేటి నుంచి వాడడం మానేశారనే వార్త కూడా సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నది. ఈ వార్తలను మీరు నమ్మడం లేదు కదా ! మీరు నమ్మినట్లైతే మీరు పప్పులో కాలేయినట్లే, ఏప్రిల్ ఫూల్ అయినట్లే.

**చిలిపి సరదాల నెలవు ఆల్ ఫూల్స్ డే :** అనాదిగా ప్రపంచ దేశాలు 01 ఏప్రిల్ రోజున ఏప్రిల్ ఫూల్స్ డే లేదా ఆల్ ఫూల్స్ డే నిర్వహించుకోవడం చూస్తేనే ఉన్నాం. ఆత్మీయులను సరదాగా ఆట పట్టించడం, క్షణకాలం పాటు అబద్ధాలతో సహచరులు లేదా బంధువులను ఆశ్చర్యచకితులను లేదా ఫూల్ చేయడం, లేని దానిని ఉన్నట్లు లేదా ఉన్న దానిని లేనట్లుగా భ్రమింపజేయడం, జోక్స్ వేసుకొని నవ్వుకోవడం, చిలిపిగా ఒకరినొకరు మోసం చేసుకోవడం, అబద్ధపు వార్తలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం లాంటి పలు ప్రవర్తనలతో ఏప్రిల్ ఫూల్ అంటూ సంతోషంగా గడపడం ఆల్ ఫూల్స్ డేకు మాత్రమే సొంతం.

**ఏప్రిల్ ఫూల్ దినం చారిత్రక నేపథ్యం:** చారిత్రక నేపథ్యాలను తవ్వి చూస్తే ఏప్రిల్ ఫూల్స్ డే జననం 1582కు చెందుతుంది. ఫ్రాన్స్‌లో 01 ఏప్రిల్ రోజున ప్రారంభం అయ్యే జూలియన్ క్యాలెండర్ నుంచి 01 జనవరిన ప్రారంభమయ్యే గ్రిగోరియన్ క్యాలండర్‌కు మారిన సందర్భంలో ప్రజల కొంత అసౌకర్యానికి లోనుకావడం, ఈ మార్పును అర్థం చేసుకోలేదని వారిని ఏప్రిల్ ఫూల్‌గా గేలి చేయడం ఆచారంగా మారి, కాలక్రమంలో అన్ని దేశాలకు విస్తరించడంతో ఏప్రిల్ ఫూల్ డే బహుళ ప్రచారంలోకి వచ్చింది. మరో వివరణ ప్రకారం హిలారీ అనే పురాతన రోమ్ పండుగలో రుతువులు మారుతూ వాతావరణ మార్పులు అసంబద్ధంగా ఉండడంతో ఏప్రిల్ ఫూల్ అంటూ ఒకరినొకరు ఆట పట్టించుకోవడం జరిగేదని కూడా తెలుపబడింది. వ్యాపార సామ్రాజ్యాలు, క్రీడలు, రెస్టారెంట్లు లాంటి అనేక స్థలాల్లో కూడా 01 ఏప్రిల్ రోజున ఆల్ ఫూల్స్ డేను సరదాగా ప్రదర్శించడం జరుగుతూ వస్తున్నది.

హానికరం కాని, మరొకరి మనసు నొప్పించని జోక్స్, అవమానకరం కాని అవాస్తవ సమాచారాలు, ఆట పట్టించే సందర్భాలతో కొనసాగుతు న్న ఆల్ ఫూల్స్ డే ప్రపంచ మానవాళిని సంతోష సాగరంలో ముంచేయడంతో పాటు మానసిక సాంత్వన చేకూర్చడం జరుగుతున్నది. నేటి ఏప్రిల్ ఫూల్ డే సరదాగా గడపాలని, మన వల్ల మరొకరి మనసు నొచ్చుకోకూడదని అర్థం చేసుకుంటూ ఆనందంగా ఆల్ ఫూల్స్ డేను జరుపుకుందాం. దైనందిన వేగవంతమైన జీవన విధానం లోంచి కొంత సమయాన్ని కేటాయించి ఏప్రిల్ ఫూల్ అంటూ మానసిక ఒత్తిడిని తగ్గించుకుంటూ ఈ రోజైనా ఉల్లాసంగా గడుపుదాం.

(01 ఏప్రిల్ – ఏప్రిల్ ఫూల్స్ డే సందర్భంగా)

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

### మహనీయులు జన్మించిన నెల ఏప్రిల్

ఆంగ్ల క్యాలండర్‌లోని ఏప్రిల్ 1న ఎవరో ఒకర్ని ఏప్రిల్ ఫూల్‌ని చేసి ఏప్రిల్ ఫూల్‌గా అవహేళన చేయటం కొందరికి సరదా! ఇది భారతీయ సాంప్రదాయం కాకపోయినా ఇంగ్లీషు చదువులతో మన దేశంలో తిష్ట వేసింది.

భారత దేశానికి గొప్ప నాయకులను అందించిన నెల ఏప్రిల్.

* భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జన్మదినం – ఏప్రిల్ 14
* సంఘ సంస్కర్త, పరిపాలనాదక్షుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రాం జన్మదినం ఏప్రిల్ 5.
* గొప్ప హేతువాది, సత్యశోధక్ సమాజ్ వ్యవస్థాపకుడు, మహిళలకు విద్యాప్రదాత మహాత్మ జ్యోతిరావు పూలె జన్మదినం – ఏప్రిల్ 11
* సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినం – ఏప్రిల్ 16
* విప్లవ కవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) జన్మదినం – ఏప్రిల్ 30

# గడువు ముగిసింది – మావోయిస్టుల ప్రజా జీవితం ఎటు?

హోంమంత్రి అమిత్ షా సోమవారం లోక్‌సభలో చేసిన ప్రకటన ప్రకారం గత రెండు సంవత్సరాల్లో మావోయిస్టుల మొత్తం నాయకత్వాన్ని – ఒక్కరు మినహా – నిర్మూలించటం జరిగింది. 2024 ప్రారంభంలో సిపిఐ (మావోయిస్టు)కు పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులు 21మంది ఉండేవారు. ఈనాడు ఒకరు అరెస్టులో ఉన్నారు, ఏడుగురు లొంగిపోయారు, 12 మంది హతులైనారు; పరారీలో ఉన్న వ్యక్తితో సంభాషణ జరుగుతున్నది. త్వరలోనే లొంగిపోతాడని భావిస్తున్నాం.

గడచిన మూడు సంవత్సరాల్లో 706 మంది మావోయిస్టులు హతులైనారు. 2218 మంది అరెస్టు చేయబడినారు. 4800లకు పైగా కేడర్లు లొంగిపోయారు.

దేశం నుండి మావోయిస్టులను లేదా నక్సలైట్లను రూపుమాపటానికి హోంమంత్రి అమిత్‌షా 2024 ఆగస్టు 24న విధించిన 2026 మార్చి 31గడువు మంగళవారం ముగిసింది. దేశం నక్సల్స్ రహితం అయిందని ఆయన ఢంకా బజాయించారు. ఇప్పటికే కొన్ని వందల సంఖ్యలో నాయకులు, వారి దళసభ్యులు ముఖ్యంగా చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పోలీసులకు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. ప్రభుత్వాలు ప్రకటించిన నగదును, పునరావాస కార్యక్రమాలను అంగీకరించారు. ఇంకా గణపతిలాంటి ఒకరిద్దరు అగ్రనాయకులు, కొన్ని డజన్‌ల మంది కింది స్థాయి దళ నాయకులు, సభ్యులు సమాచారం అందక, పోలీసులతో కమ్యూనికేషన్ ఏర్పడకో లేదా పోరాటం కొనసాగించాలనే సంకల్పంతోనో రహస్య జీవితంలో ఉండి ఉండవచ్చు. గడువు ముగిసింది అంటే లొంగిపోయే అవకాశాలకు తలుపులు మూశారని అర్థం కాదు. ఆయుధాలు అప్పగించి ఎప్పుడైనా లొంగిపోవచ్చు, కాకపోతే ప్రభుత్వ పునరావాస కార్యక్రమాలకు అర్హులు కారు. ప్రభుత్వం తమకున్న ఇంటెలిజెన్స్ సమాచారం ప్రకారం లొంగుబాటుకు మరి కొంత సమయం ఇవ్వవచ్చు, పునరావాస సదుపాయాలు పొడిగించనూవచ్చు. అయితే ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన క్రూరమైన హింస, మావోయిస్టుల నుండి చర్చల ప్రతిపాదనను, రహస్య జీవితంలోని తమ నాయకుల మధ్య కమ్యూనికేషన్ నెలకొల్పుకుని హోంమంత్రి ప్రతిపాదనపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు కోరిన వ్యవధిని అమిత్ షా మూర్ఖంగా తిరస్కరించిన వైనం గత ఐదారు మాసాల్లో నివారించదగిన హింసకు దారితీసింది. ప్రభుత్వం మావోయిస్టులను హతమార్చి ఉండవచ్చు, కాని వారు లేవనెత్తిన ప్రధానమైన సమస్యలు పరిష్కరించనంతకాలం వారి భావజాలం సజీవంగానే ఉంటుంది.

*ఈ సందర్భంగా, 1967 తిరుగుబాటు అనంతరం గత ఆరు దశాబ్దాల్లో నక్సలైట్ ఉద్యమంలో మలుపులు, మెలికలను సూక్ష్మంగా విశ్లేషిస్తూ ప్రముఖ పాత్రికేయుడు అరుణ్ శ్రీవాస్తవ రాసిన వ్యాసాన్ని ఇక్కడ ఇస్తున్నాం – సం॥*

పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్‌బరీలో 1967లో రైతాంగ తిరుగుబాటు నుంచి ఉద్భవించిన నక్సలైట్ ఉద్యమం గత అరవై ఏళ్లలో ఎన్నో మలుపులకు, ఆటుపోట్లకు గురైంది. ఒక స్థానిక సాయుధ తిరుగుబాటు నుండి బయలుదేరి ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటుగా చెల్లాచెదురుగా అభివృద్ధి చెందిన ఈ ఉద్యమం, ఇటీవల కాలంలో పెద్దఎత్తున లొంగుబాట్లు, భద్రతా దళాల చేతిలో కేడర్ల దారుణ హత్యలతో అంతరించే దశకు చేరింది. అయితే ఒక పరిణామం ఎంతో ముఖ్యమైంది. నక్సలైట్లు పెద్ద సంఖ్యలో చంపబడినప్పటికీ, ఇంతకు క్రితం మావోయిస్టులు ఆధిపత్యం వహించిన ప్రాంతాల్లోని ఆదివాసీల్లో ఉద్యమ స్ఫూర్తి అలాగే ఉంది.

హోంమంత్రి అమిత్‌షా మావోయిస్టుల లొంగుబాటుకు 2026 మార్చి 31ని గడువుగా నిర్ణయించి మావోయిస్టుల ఊచకోతకు భద్రతాదళాలను భారీగా మోహరించి 'ఆపరేషన్ కగార్' పేరుతో అడవులు జల్లెడ పట్టడంతో సాయుధ మావోయిస్టులు పెద్ద సంఖ్యలో లొంగిపోయారు. నక్సలైట్ నాయకుల్లో అత్యధికులను ఏరివేశామని హోంమంత్రి సంతోషపడవచ్చు. అయితే నక్సలిజంను రూపుమాపామని ఆయన చెప్పుకునే గొప్ప లు భ్రమ. నక్సలైట్ పార్టీలు, వాటి నాయకులు హతులై ఉండవచ్చు లేదా లొంగిపోయి ఉండవచ్చు. కాని షా ఆ భావజాలాన్ని అణగద్రొక్కలేరు.

నక్సలైట్‌ల తొలి సంఘటిత పార్టీ 1969 మే 1 నాటి కలకత్తాలోని షాహిద్ మినార్ వద్ద భారీ బహిరంగ సభలో ఏర్పడింది. 1964లో సిపిఐలో చీలిక నుండి ఉద్భవించి, ఆరంభంలో చైనా పంథాను, మావోను అనుసరించిన సిపిఐ(ఎం) నుండి తిరుగుబాటు చేసిన నాయకుడు చారు మజుందార్ కొత్త పార్టీ చైర్మన్‌గా ఎన్నుకోబడ్డారు. 1972లో పోలీసుల కస్టడీలో చారుమజుందార్ మరణించిన దరిమిలా, ఉద్యమం 40కి పైగా వేర్వేరు గ్రూపులుగా చీలిపోయింది. అవి ఐక్య విప్లవ కార్యాచరణకన్నా తరచూ అంతర్గత ఘర్షణల్లో మునిగిపోయాయి. ఆ ఘర్షణలకు బలమైన సైద్ధాంతిక ఎల్లలున్నాయి. కొత్తగా ముందుకు వచ్చిన సాయుధ పోరాట భావజాలంలో కొన్ని ప్రాథమికమైన గందరగోళాలు, వైరుధ్యాలున్నాయి. అవి గ్రూపుల మధ్య ఘర్షణలకు దారితీశాయి. ఈ పరిస్థితి క్రియాశీల కార్యకర్తలను అరెస్టు చేయటానికి, చంపివేయటానికి రాజ్యయంత్రానికి అవకాశమిచ్చింది.

రెండు భావజాల సమస్యలు – వర్గ శత్రువుల నిర్మూలన, చైనా చైర్మన్ మన చైర్మన్ – ఉద్యమానికి హాని చేశాయి. ఈ రెండు సమస్యలను సరైన దృక్పథంలో మదింపు చేయటానికి బదులు పక్కకు పెట్టారు. వేర్వేరు ఫాక్షన్స్ వేర్వేరు ఆదేశాలు పంపాయి. పశ్చిమబెంగాల్, బీహార్‌లలో, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిస్సా, చత్తీస్‌ఘడ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పూర్తి గందరగోళం నెలకొంది. పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర్ రే ప్రభుత్వం అనేకమంది నాయకులను జైళ్లలో పెట్టింది. క్రియాశీలంగా ఉన్న నక్సలైట్ గ్రూపులను దాదాపు అణచివేసింది. 1977లో వామపక్ష ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఆ ప్రభుత్వం జైళ్ల నుంచి నక్సలైట్లను విడుదల చేసింది. వారిలో చాలామంది బెంగాల్‌లో నూతన పరిస్థితిని సమీక్షించటం మొదలుపెట్టారు. కాగా ఇతర రాష్ట్రాల్లో పాత గ్రూపులు చురుకుగా ఉండిపోయాయి.

భారత ఆర్థిక వ్యవస్థలో సరళీకరణ క్రమం మొదలుకావటం, డెంగ్ సియావోపింగ్ నాయకత్వం క్రింద చైనా మార్కెట్ సోషలిజం అనే నూతన పంథా చేబట్టటం, అటుతర్వాత సోవియట్ యూనియన్ సహా తూర్పు యూరప్‌లో సోషలిస్టు వ్యవస్థ కూలిపోవటం – ఈ 1980, 1990 దశాబ్దాల్లో సంభవించిన పరిణామాలను గ్రహించి మావోయిస్టులు తమ వ్యూహం సరిదిద్దుకోలేదు. పరిమిత సంఖ్యలోని మావోయిస్టు గ్రూపులు తమ పోరాటాన్ని ఇప్పటికీ పాత రూపంలోనే కొనసాగిస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో సైతం యువతలో బయలుదేరిన ఆకాంక్షలు ఉపయోగించుకుని వారిని ఏకాకులను చేసేందుకు రాజ్యయంత్రానికి పెద్ద అవకాశం ఇచ్చారు.

దక్షిణ భారతదేశంలో, ప్రధానంగా ఆంధ్ర–ఒడిస్సా సరిహద్దు (ఎఒబి) రీజియన్‌లో, తెలంగాణలో, కేరళ, కర్నాటక, తమిళనాడు ముక్కోణ కూడలి ప్రాంతంలో పనిచేస్తున్న మావోయిస్టులు సాయుధ పోరాటం పట్ల సైద్ధాంతిక నిబద్ధత, గ్రామీణ ప్రాంతాల్లో మిగిలివున్న తమ బలమైన కేంద్రాలను కాపాడుకోవలసిన అవసరం, పెచ్చుపెరుగుతున్న రాజ్య ఒత్తిడిని ప్రతిఘటించాల్సిన కారణాలన్నింటి దృష్ట్యా పోలీసుతో హింసాత్మక సంఘర్షణలు కొనసాగించారు. ఉద్యమం క్షీణిస్తున్నా, హింసాయుత ఘర్షణలు కొనసాగడం తర్కానికి అందదు. ప్రజాస్వామ్య క్రమాన్ని తిరస్కరించటం, "దీర్ఘకాల ప్రజా యుద్ధం" ద్వారా రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవటం సిపిఐ (మావోయిస్టు) మూల సిద్ధాంతం. రాజ్యస్వభావం ఫ్యూడల్, సామ్రాజ్యవాదం అయినందున తమ లక్ష్యాల సాధనకు హింసాయుత సంఘర్షణ ఒక్కటే మార్గంగా వారు భావించారు. పోలీసుల చేతిలో తమ నష్టాలకు వ్యతిరేకంగా మావోయిస్టులు ఎదురుదాడి చేసేవారు. తమ బలాన్ని ప్రదర్శించేందుకు, మరికొంతమంది లొంగుబాటును నిరోధించేందుకు వారు భద్రతా సిబ్బందిపై దాడులకు పాల్పడేవారు. వారి సంఖ్య బాగా క్షీణించింది. అయితే దృఢ సంకల్పులైన మావోయిస్టులు ఇప్పటికీ కొద్దిమంది ఉన్నారు. మార్చి 31 అంతిమ గడువు ముగిశాక కూడా వారు భద్రతా దళాలపై దాడులు చేయవచ్చు.

దక్షిణ భారతదేశంలో – "రెడ్ కారిడార్" అంతటా పరిశ్రమలు, మైనింగ్, మౌలిక వసతుల ప్రాజెక్టులకోసం బడా కార్పొరేట్లు భూమి సేకరిస్తుండటం మావోయిస్టు సాయుధ ప్రతిఘటన సాగుతుండటానికి దోహదం చేస్తున్న ముఖ్యమైన కారణం. అందువల్ల షా ఏమి గొప్పలు చెప్పుకున్నప్పటికీ రాటుదేలిన కేడర్లు ఇప్పటికీ ఉన్నారు.

భారతదేశంలో నక్సలైట్ ఉద్యమ చరిత్రను చూచినట్లయితే – 1972 మధ్య నాటికి పార్టీదాదాపుగా పూర్తి పక్షవాతానికి గురైంది. మొత్తం కేంద్ర నాయకత్వం ఆచరణలో నిర్వీర్యమైంది. మిగిలిన పార్టీ శక్తులు చీలికలు పేలికలై చెల్లాచెదురుగా ఉన్నాయి. పార్టీ పంథాకు సంబంధించి అంతటా గందరగోళం. 1990 జులైలో ఢిల్లీలో జరిగిన ప్రత్యేక మహాసభ, దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత, బహిరంగంగా పనిచేయాలని నిర్ణయించింది. అలా ఉద్భవించిందే సిపిఐ (ఎంఎల్)–ఎల్. అది భారతదేశ పరిస్థితిలోని నూతన వాస్తవికతలను పరిగణనలోకి తీసుకుని 1969 నాటి ఆది సిపిఐ(ఎంఎల్) వారసత్వాన్ని స్వీకరించటం మొదలుపెట్టింది. ఇతర కమ్యూనిస్టు రివల్యూషనరీ గ్రూపులు అస్థిత్వ సంక్షోభంలో పడ్డాయి. గత 60 ఏళ్లలో కొన్ని అంతరించాయి. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ బతికి బట్టకట్టటమేగాక, 1974లో అది పునర్నిర్మాణం పొందిన నాటినుంచీ నిరంతరాయతను, ఐక్యతను నిలబెట్టుకుంటున్నది. బలమైన జాతీయ నెట్‌వర్క్‌తోపాటు అది రెగ్యులర్‌గా పార్టీ కాంగ్రెస్‌లు, ప్రాంతీయ, జిల్లా స్థాయిలవరకు మహాసభలు జరుపుకుంటోంది.

సిపిఐ(ఎంఎల్)ను దాని పిడివాదం నుంచి, ఏకాకితనంతో కూడిన సాయుధ పోరాటం నుంచి వినోద్ మెహతా సరిదిద్దాడు. ప్రజాస్వామ్య దృక్పథంలోకి తెచ్చి, అంతిమంగా విప్లవ రాజకీయాలను లీగల్ పోరాటాలతో కలగలిపాడు. 1970ల్లో ఆయన ప్రారంభించిన దిద్దుబాటు కార్యక్రమం కచ్చితంగా అజ్ఞాత జీవితం గడపటమే పార్టీ విధానం అనే వైఖరిని విడనాడింది. ఇండియన్ పీపుల్స్ ఫ్రంట్ (ఐపిఎఫ్) వంటి బహిరంగంగా పనిచేసే సంస్థలను నిర్మించాడు. 1982లో లిబరేషన్. ఒఆర్‌జి.ఇన్ ప్రారంభించాడు. సిపిఐ(ఎంఎల్) ఆరంభకాలపు పిడివాదంతో తెగతెంపులు చేసుకున్నాడు. విస్తృతంగా ప్రజలతో సంబంధాలకు మార్గంగా, లీగల్‌గా నిలదొక్కుకోవటానికి ఎన్నికల క్రమంలో పాల్గొన్నాడు. బిహార్‌లో ఉద్యమాలు నిర్మించాడు.

అదే సమయంలో సాయుధ పోరాటాన్ని నమ్మిన మావోయిస్టులు గడ్చిరోలీనుంచి బస్తర్ మీదుగా చత్తీస్‌ఘడ్, ఒరిస్సా వరకు హింసాయుత కార్యక్రమాలు కొనసాగించారు. ఆదివాసీల అండ తగ్గింది. ఇన్‌ఫార్మర్‌లు పెరిగారు. రాజ్యహింస పెచ్చరిల్లింది. అడవుల్లో బతకటం దుర్లభమైంది. లొంగుబాట్లు, పోలీసులనుంచి సామూహిక హత్యలు పెరిగాయి.

భారతదేశంలో నక్సలైట్ ఉద్యమ క్షీణతకు కారణాలనేకం. అంతర్గత శతృత్వం, సైద్ధాంతిక చీలికలు, నాయకత్వ సంక్షోభం ప్రధాన కారణాలు.

చారు మజుందార్ కుమారుడు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి అభిజిత్ మజుందార్ ఇలా అంటారు – "...అవును, ఇప్పుడు మేము రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని కాపాడటంపై ముందుగా దృష్టిపెడుతున్నాం. ఫాసిజానికి వ్యతిరేకంగా, ఫ్యూడల్ అవశేషాలు, బడా వ్యాపారవర్గం మధ్య బంధానికి వ్యతిరేకంగా, వివిధ రకాల ప్రభుత్వాల దుష్పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటానికి నేడు దానిని అత్యంత ముఖ్యమైనదిగా భావిస్తున్నాం" అన్నారు. ఇది అజ్ఞాత జీవితం నుంచి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పంథాలోకి మార్పు చెంది, పేదల పక్షాన సమరశీల పోరాటాలు చేస్తున్న పార్టీ. ఇప్పుడు అసంతృప్తితో ఉన్న ఇతర మావోయిస్టు గ్రూపులను ఈ పార్టీ తన సైద్ధాంతిక, నిర్మాణ పరిధిలోకి రాబట్టగలుగుతుందా? లేక ప్రభుత్వానికి లొంగిపోయిన మావోయిస్టు ప్రముఖులు పునఃసమీకృతులై, ప్రస్తుత దేశ పరిస్థితులను, వివిధ శక్తుల పొందికలను బేరీజు వేసుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పంథాలో పని చేసే మరో ఎంఎల్ పార్టీని ఏర్పాటు చేస్తారా? స్థానిక పరిస్థితుల్ని బట్టి ఇతర లెఫ్ట్ పార్టీలలో చేరతారా? వేచి చూడాల్సిందే. ముందుగా వారు జనజీవన స్రవంతిలో కుదురుకోవాలి. కొత్త జీవితం ప్రారంభించాలి.

*(ఐపిఎ సర్వీస్)*

# మైనర్ల డ్రైవింగ్... పెరుగుతున్న విషాదాలు



గిలకత్తుల వెంకట రమణ గౌడ్
9866878769

వేగం ఒక మత్తు. దానిని అదుపు చేసుకోవాల్సిన వయస్సులోకి రాకముందే చేతిలో స్టీరింగ్ పట్టుకుంటున్నారు. అది కేవలం పిల్లల తప్పు మాత్రమే కాదు, తల్లిదండ్రులు, సమాజం యొక్క ఉదాసీనత, నిర్లక్ష్యం, పర్యవేక్షణ వైఫల్యం. నేడు ప్రపంచ వ్యాప్తంగా పిన్న వయసు డ్రైవర్ల వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలను, తీరని వేదనతో శోకసాగరంలో ముంచుతున్నాయి. సమ వయస్కుల చేత గుర్తించబడాలని ఆకాంక్ష, సామాజిక ఒత్తిడి, సినిమా హీరోల అనుకరణ ప్రభావం, చట్టాల పట్ల అవగాహన లోపం, ఈ విషాదాలకు దారి తీస్తున్నాయి.ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నివేదిక ప్రకారం 15 నుండి 35 సంవత్సరాల వయసు వారు ప్రపంచంలో జరిగే రోడ్డు మరణాలలో దాదాపు సగంమందిగా ఉన్నారు. ముఖ్యంగా 21సంవత్సరాల లోపు యువకులు రోడ్డు ప్రమాదాలలో మరణించే వారిలో మూడింట రెండు వంతులు ఉన్నా రు. అమెరికాలో జరిపిన పరిశోధన ప్రకారం 16–17 సంవత్సరాల డ్రైవర్ల ప్రాణాంతక ప్రమాద రేటు 20 సంవత్సరాలు పైబడిన డ్రైవర్ల కంటే మూడింతలు అధికంగా ఉంది. ఇవి అభివృద్ధి చెందిన దేశాల అంకెలు. అక్కడ నియమాలు కఠినంగా అమలవుతాయి, రోడ్లు మెరుగ్గా ఉంటాయి. మరి మన దేశంలో పరిస్థితి ఇంకెంత తీవ్రంగా ఉంటుందో అంచనా వేయవచ్చు.

**సోషల్ మీడియా**

పిన్న వయసు డ్రైవింగ్ ప్రమాదాలకు పరిశోధకులు చాలా కారణాలు గుర్తించారు. వాటిలో అత్యంత ఆందోళనకరమైనది. సోషల్ మీడియా మరియు డిజిటల్ ప్రభావం. సామాజిక అభ్యాస సిద్ధాంతం (Social Cognitive Theory) ప్రకారం, ప్రమాదకరమైన డ్రైవింగ్ ప్రవర్తనలు ఆదర్శ ప్రాయంగా, హీరోయిజంగా చూపించబడి, శిక్షించబడకుండా గుర్తింపు పొందినప్పుడు, అదే వయసు యువత వాటిని అనుకరించే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇక్కడే సమస్య మూలం దాగి ఉంది. సోషల్ మీడియాలో రీల్స్‌కు వేలాదిగా లైకులు వస్తాయి.ఆ గుర్తింపు ఆకర్షణే అపాయంలోకి నెట్టుతోంది. స్నేహితులు పక్కన కూర్చున్నప్పుడు టీనేజర్లు మరింత ప్రమాదకరంగా డ్రైవ్ చేసే అవకాశం ఉంటుంది.

ఈ సామాజిక ఒత్తిడి డిస్ట్రాక్షన్‌కు, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దారి తీస్తుంది. అదే సమయంలో మొబైల్ ఫోన్ చూస్తూ, డ్రైవ్ చేయడం వల్ల ప్రమాద అవకాశం 23 రెట్లు పెరుగుతుందని, దాదాపు 39% టీనేజర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ చూస్తున్నట్లు అంగీకరిస్తున్నారు.

**కనిపించని ముప్పు**

CDC పరిశోధన ప్రకారం, 16 నుండి 19 సంవత్సరాల డ్రైవర్లు 20 సంవత్సరాలు పైబడిన వారితో పోలిస్తే ప్రమాదం బారిన పడటానికి మూడింతలు ఎక్కువ అవకాశం కలిగి ఉంటారు. అనుభవం లేకపోవడం వల్ల, దూరాలు అంచనా వేయలేకపోవడం, ఆకస్మిక పరిస్థితులకు స్పందించలేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఎదురు ప్రయాణాలు, మితిమీరిన వేగంతో నియంత్రణ తప్పడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా రిస్క్‌ను అంచనా వేసే ప్రిఫ్రంటల్ కార్టెక్స్ భాగం ఆ సమయంలో పూర్తిగా పని చేయదు. మోటార్ వెహికిల్స్ చట్టం 1988 లోని Section 4 ప్రకారం 18 సంవత్సరాలు నిండని వారు వాహనం నడపడం చట్టవిరుద్ధం. 2019లో సవరించిన చట్టం ప్రకారం Section 199A కింద పిన్న వయసు వారు వాహనం నడిపితే, వాహనం యజమాని లేదా తల్లిదండ్రులు కూడా నేరుగా బాధ్యత వహించాలి. రూ. 25,000 జరిమానా, వాహన రిజిస్ట్రేషన్ రద్దు, ఆ పిల్లవాడికి 25 ఏళ్ల వరకు లైసెన్స్ నిరాకరణ ఇవి చట్టంలో ఉన్నాయి. IPC Section 279 మరియు 304A కింద జైలుశిక్ష సైతం విధించే వీలుంది. చట్టాలు కఠినంగా అమలు చేసినప్పుడే ప్రమాదాలను నివారించగలం.

అమెరికాలో అమలవుతున్న Graduated Driver Licensing (GDL) విధానం ప్రపంచవ్యాప్తంగా నిపుణుల ప్రశంసలందుకుంటుంది.దశలవారీగా డ్రైవింగ్ అనుమతులు ఇచ్చే ఈ కార్యక్రమాలు టీనేజ్ డ్రైవర్ల ప్రమాద రేట్లను గణనీయంగా తగ్గించాయి. భారత్‌లోనూ అలాంటి సంస్కరణలు అవసరం. పాఠశాల, కళాశాల స్థాయిలో రోడ్డు భద్రత అవగాహన పాఠ్యాంశంలో భాగం కావాలి. ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులతో క్రమంగా సంభాషించాలి. ప్రభుత్వం, యువత, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమ శిబిరాలు నిర్వహించాలి. చట్టాల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లలకు బైక్ ఇవ్వడం అంటే వారి మరిపట్ల ప్రేమ చూపించడమనే విషయం కారాదు. బైక్ ఇవ్వడంతో స్వేచ్ఛ ఇవ్వడం కాదు, వారిని ప్రమాదంలో నెట్టడం అనే విషయం అర్థం చేసుకోవాలి.సోషల్ మీడియా సంస్థలు కూడా బాధ్యత వహించాలి. ప్రమాదకరమైన స్టంట్ వీడియోలు వైరల్ అవ్వడానికి వేదిక కల్పించడం నైతికంగా, సామాజికంగా సరి కాక వారి ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా ఉంటున్నది.

**ప్రాణం తిరిగి రానిది**

రోడ్డు అనేది పోటీ మైదానం కాదు. వేగం అనేది సాహసం కాదు. స్టీరింగ్ అనేది సోషల్ మీడియా ప్రాప్స్ కాదు. ఈ రోజు అనేకమంది యువకులు వాహనాన్ని గుర్తింపు సాధనంగా మార్చుకుంటున్నారు. లైకులు వస్తాయని, వ్యూస్ పెరుగుతాయని, స్నేహితుల మధ్య హీరో అవుతారని. కానీ ఆ వేగపు మత్తులో ఒక్క సెకనులో కోల్పోయే ప్రాణం తిరిగి రాదు. ఏ లైక్,ఏ వీడియో కూడా చనిపోయిన వ్యక్తిని మళ్ళీ జీవింపజేయదు. 'మీరు ప్రపంచంలో చూడాలనుకుంటున్న మార్పుగా మీరే ముందు మారండి.' అన్న మహాత్మా గాంధీజీ మాటలు రోడ్డు భద్రతకు అక్షరాల వర్తిస్తాయి. తల్లిదండ్రులు పిల్లలకు తాళాలు ఇచ్చే తాళాలు తన పిల్లల జీవితంతో పాటు మరొకరి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఇస్తున్నామన్న గుర్తుంచుకోవాలి.ఒక నిర్లక్ష్య వైఖరిని ప్రోత్సహిస్తున్నామన్న విషయం గుర్తెరగాలి. ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠాల జ్ఞానంతో పాటు జీవిత విలువలు నేర్పే బాధ్యత కూడా తీసుకోవాలి. రోడ్డుపై మీకు ఎదురయ్యే ప్రతి వ్యక్తీ ఎవరో ఒకరికి అమ్మ, నాన్న, బిడ్డ, జీవిత భాగస్వామి. వారి ప్రాణం మీ వేగంకంటే విలువైనది. మీ ప్రాణం మీ రీల్స్, వ్యూస్ కంటే విలువైనది. స్టీరింగ్ పట్టుకున్న ప్రతిసారీ ఈ ఒక్క మాట గుర్తుండాలి.'నేను సురక్షితంగా ఇంటికి చేరుకోవాలి, ఇదే నన్ను ప్రేమించే వారికి నేనివ్వగలిగే అతిపెద్ద బహుమతి' అన్న మార్పు ఈ క్షణమే మొదలవ్వాలి.



## ఓపెన్ స్పేస్‌లపై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ జోన్ పరిధిలోని ఓపెన్ స్పేస్‌ల అభివృద్ధి, సంరక్షణపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఉప్పల్ భగాయత్ పరిధిలోని పలు ప్రదేశాలను జోనల్ కమిషనర్ రాధికా గుప్తా స్వయంగా పరిశీలిస్తూ, సంబంధిత అధికారులకు కీలక సూచనలు జారీ చేశారు. ఈ తనిఖీలో జోన్ ఎస్‌ఇ, జోనల్ సిపి, ఎసిపి టౌన్ ప్లానింగ్, డిఇఇ, ఉప్పల్ సర్కిల్ ఎఇ, తదితరులు పాల్గొన్నారు. పరిశీలన సందర్భంగా ఒసి (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు) బిల్డింగ్ పర్మిషన్‌లకు సంబంధించిన అంశాలను సమీక్షిస్తూ, నిబంధనల అమలుపై అధికారులను అప్రమత్తం చేశారు. పార్కులు, ఆటస్థలాలు, కమ్యూనిటీ సదుపాయాల అభివృద్ధికి అనువైన ఖాళీ ప్రదేశాలను గుర్తించడం, అలాగే ఇప్పటికే ఉన్న ఓపెన్ స్పేస్‌లను ఆక్రమణల నుంచి రక్షించడం ఈ తనిఖీ ప్రధాన లక్ష్యంగా వెల్లడించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

## నేటి నుండి మూడు నెలల కోటా సన్న బియ్యం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :**వేసవి కాలం దృష్ట్యా బుధవారం నుండి రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా పంపిణీ చేసే సన్న బియ్యం మూడు నెలల కోటాను జిల్లాలోని వినియోగదారులకు ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరా శాఖ జిల్లా మేనేజర్ ఎల్. సుగుణాబాయి తెలిపారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చేస్తున్న ఈ సరఫరా అన్ని రేషన్ దుకాణాల్లో ఏప్రిల్ మొదటి తేదీ నుండి నెల చివరి వరకు ప్రతిరోజు అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలోని 6,45,442 రేషన్ కార్డులకు సంబంధించి ఉన్న 22,17,063 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున మూడు మాసాలకు సరిపడే 39,360,154 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. జిల్లాలోని ఆరు ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా జిల్లాలోని రేషన్ దుకాణాలకు సన్న బియ్యం సరఫరా చేసి లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేస్తున్నామన్నారు.



## క్రియేటివ్ ఈవెంట్స్ గోదాంలో అగ్నిప్రమాదం

### పరిశీలించిన ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** గాజులరామారం డివిజన్ చంద్రగిరి నగర్‌లోని క్రియేటివ్ ఈవెంట్స్ గోదాం ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ మేరకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద గోదామును పరామర్శించి బాధితుడిని ఓదార్చారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన ఈవెంట్స్ గోదాము ఘటనలో ఆస్తి నష్టాన్ని అంచనా వేసి బాధితున్ని ఆదుకుంటామని అన్నారు. వేసవి కాలంలో గోదాములు, పరిశ్రమలు జాగ్రత్తలు వహించాలని, మండుతున్న ఎండలకు ఇలాంటి అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయని చెప్పారు. అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, బాల్‌రాజ్, కమలాకర్, నవాబ్ భాయ్, ఇమ్రాన్, తెలంగాణ సాయి, తదితరులు పాల్గొన్నారు.



## రూ.14 కోట్ల పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/ఉప్పల్ :** నాచారం డివిజన్ పరిధిలో మంజూరైన సుమారు రూ.14కోట్ల అభివృద్ధి పనులను వెంటవెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పనులను వేగవంతం చేస్తామని ఆమె స్పష్టం చేశారు. వీఎస్టీ కాలనీ అమ్మవారి గుడి ముందు వీధితో పాటు పరిసర వీధుల్లో రూ.20లక్షల వ్యయంతో చేపడుతున్న నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శాంతి స్వయంగా పరిశీలించారు. పనులు నాణ్యతగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ రోడ్లు సుమారు రెండు సంవత్సరాల క్రితం మంజూరైనప్పటికీ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పనులు నిలిచిపోయి. నిధులు వెనక్కి వెళ్లిన విషయం తెలిసిందే. అనంతరం మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సంప్రదించి నిధులను మళ్లీ తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ఎమ్మెల్యే సహకారంతో సుమారు రూ.10లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తిచేయించగా, ప్రస్తుతం సిమెంట్ రోడ్ల నిర్మాణం ప్రారంభమైంది. దీంతో ఆనందం వ్యక్తం చేసిన స్థానిక బస్తీ వాసులు మాజీ కార్పొరేటర్ శాంతిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, సువర్ణ సుగుణాకర్ రావు, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలను తొలగించిన అధికారులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తుండడంతో మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. కాప్రా సర్కిల్‌లోని ఏఎస్ రావు నగర్, కాప్రా డివిజన్ పరిధిలోని రాధిక దమ్మాయిగూడ ప్రధాన రహదారికి ఆనుకుని అక్రమంగా ఆక్రమించిన ఫుట్‌పాత్‌లను కాప్రా సర్కిల్



డిసి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు సిమెంట్ దిమ్మెలు, సైన్ బోర్డులు, ఇనుప గ్రిల్స్‌ను క్రేన్ సహాయంతో తొలగించారు.ప్రజలు నడిచేందుకు ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేసామని వాటిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు, చైన్‌మెన్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో 'హైడ్రా' యాక్షన్



### కాలువ కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయం!





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో భూమికి ఉన్న విపరీతమైన డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని వర్షపు నీటి కాలువలను సైతం అమ్మేస్తున్నారు. గతంలో జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో కీలక బాధ్యతల్లో ఉన్న కొందరు వ్యక్తులు బరితెగించారు. వరద కాలువలను సైతం వదలకుండా వాటిని ప్లాట్లుగా సృష్టించి విక్రయించిన వైనం వెలుగులోకి వచ్చింది. మాధాపూర్ మెట్రో స్టేషన్ పెద్దమ్మ గుడివైపు నుంచి వచ్చే రెండు ప్రధాన బాక్స్ డ్రైన్ల (వరద కాలువలు) పైభాగాన్ని కబ్జా చేశారు. 120 గజాల ఒక ప్లాట్, 180 గజాల మరో ప్లాట్‌ను సృష్టించి, ఏకం గా రిజిస్ట్రేషన్‌లు కూడా చేయించారు. ప్రస్తుతం ఇక్కడ గజం ధర సుమారు రూ.2 లక్షల వరకు పలుకుతుండటంతో, కోట్ల విలువైన ఈ స్థలాన్ని కొట్టేయాలని ప్లాన్ చేశారు. ఈ స్థలం చుట్టూ టిన్ షీట్లతో ప్రహరీ గోడలు నిర్మించి, లోపల వాచ్‌మెన్ గదులను ఏర్పాటు చేశారు.

**ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా**

జూబ్లీహిల్స్ సొసైటీలోని ఓ ప్లాట్ యజమాని ఈ అక్రమంపై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన హైడ్రా అధికారులు, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఆ స్థలం కింద వరద కాలువలు ఉన్నట్లు నిర్ధారించుకున్నాక, మంగళవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు.





**రూ. 6 కోట్ల విలువైన స్థలం సేఫ్**

హైడ్రా చేపట్టిన ఈ ఆపరేషన్‌తో సుమారు 300 గజాల స్థలం ఆక్రమణ దారుల చెర నుంచి విముక్తి కలిగింది. మార్కెట్ విలువ ప్రకారం దీని విలువ సుమారు రూ.6కోట్లు ఉంటుందని అంచనా. భూమిని కాపాడటమే కాకుండా, వరద నీరు సాఫీగా వెళ్లేలా కాలువలకు అడ్డంగా ఉన్న అడ్డంకులను తొలగించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**చెరువులు, పార్కుల స్థలాలు కాపాడిన హైడ్రా**

నగరం నలువైపులా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో మంగళవారం హైడ్రా భారీగా ఆక్రమణలను తొలగించింది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను, చెరువుల స్థలాలను స్వాధీనం చేసుకుంది. గండిపేట మండలం మచిరేవుల గ్రామంలో ఉన్న 8.24 ఎకరాల నాగిరెడ్డి కుంటను కబ్జాదారుల నుండి హైడ్రా రక్షించింది. బడా రియల్ ఎస్టేట్ సంస్థలు 20 అడుగుల రేకుల ప్రహరీ నిర్మించి, చెరువు కనిపించకుండా 7 ఎకరాలకు పైగా ఆక్రమించాయి.

స్థానిక మాజీ ప్రజాప్రతినిధి కూడా ఇందులో ఎకరం భూమిని విక్రయించినట్లు గుర్తించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేసి, చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేశారు. గండిమైసమ్మ మియాపూర్ ప్రధాన రహదారిపై 150 అడుగుల రోడ్డును ఆక్రమించి నిర్మించిన 10 షాపులను హైడ్రా కూల్చివేసింది. దీనివల్ల గత కొన్నాళ్లుగా ఉన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది. ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌లో 1987 నాటి లే అవుట్ లో కేటాయించిన 1440 గజాల పార్కు స్థలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తుండగా హైడ్రా అడ్డుకుంది. ఆ స్థలానికి ఫెన్సింగ్ వేసి స్వాధీనం చేసుకుంది. సకాలంలో స్పందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడుతున్న హైడ్రా చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# బడ్జెట్ విషయాలపై అవగాహనకు శిక్షణా కార్యక్రమాలు

### పురపాలక సంఘం వార్షిక బడ్జెట్ సమావేశంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్





**ప్రజాపక్షం/వికారాబాద్ :** మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య ఆధ్వర్యంలో వికారాబాద్ పురపాలక సంఘం వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన పురపాలక సంఘం ఎన్నికలలో ప్రజల ఆదరణ, అభిమానంతో విజయం సాధించి బాధ్యతలు స్వీకరించిన పాలక కార్యవర్గానికి ముందుగా అభినందనలు తెలిపారు. బడ్జెట్ విషయాలపై అవగాహన కోసం త్వరలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందనాన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా ఉన్న సమయంలో 2300కోట్లతో వికారాబాద్ పట్టణానికి శాటిలైట్ ప్రాజెక్టు మంజురు చేయించామన్నారు. ప్రభుత్వాలు మారడంతో ఆ నిధులలో మెజారిటీ రాలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్‌కు దీటుగా వికారాబాద్ మున్సిపాలిటిని అభివృద్ధి చేయడం జరుగుతుందని, మున్సిపల్‌లో విలీనమైన గ్రామాలలో అవసరమైన ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు.

పట్టణం పరిధిలో అవసరమైన మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలను మంజూరు చేయించడానికి రైల్వే శాఖతో ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. వికారాబాద్ పట్టణంలో ఉన్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి కృషి చేస్తున్నామని, మర్రి చెన్నారెడ్డి నిర్మించిన శివసార్ చెరువును పూర్తిగా ఆధునికీకరణ చేయిస్తామని, పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిధులు తెచ్చే బాధ్యత నాది , సక్రమంగా అవసరమైన చోట మాత్రమే ఖర్చు చేయండి అని సూచించారు. టియుఎఫ్ఐడిసి నుండి 60కోట్లు నిధులు మంజురు అయ్యాయి. ఎచ్‌డిఎనుండి 270కోట్లు త్వరలో మంజూరు అవుతాయని అన్నారు. వికారాబాద్ అభివృద్ధి నా లక్ష్యం అన్నారు. చిన్న వయస్సులోనే చైర్మన్ అయిన నా కూతురుకు మీ అందరి ఆశీర్వాదం ఉండాలని కోరారు.

**మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ** వార్డు సభ్యులు చెప్పిన సమస్యలను అన్నింటినీ వ్యక్తిగతంగా నోట్ చేసుకోవడం జరిగిందన్నారు. ప్రతి వార్డులో పర్యటించి కామన్ ప్రాబ్లమ్స్‌ను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేద్దాం అన్నారు. మీ వార్డులలలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బంది గురించి అవగాహన కలిగి ఉండలన్నారు. ఇబ్బందులు తలెత్తిన సమయంలో వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయడం జరుగుతుంది.

స్పీకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అధికంగా నిధులు తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మొత్తం 3320.84లక్షలు 2026–2027బడ్జెట్‌ను ఆమోదించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కమీషనర్ విక్రమంసింహరెడ్డి, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



**కోట్‌పల్లి వాగుపై రూ.27.50 కోట్లతో హైలెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన**

వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ మండల పరిధిలోని కోట్‌పల్లి వాగుపై రూ.27.50 కోట్లతో నూతనంగా నిర్మించే హైలెవల్ బ్రిడ్జికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి స్పీకర్ ప్రసాద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ నూతనంగా హై లెవల్ బ్రిడ్జి శంకుస్థాపనతో ఈ ప్రాంత ప్రజలకు వానాకలంలో వరదలు వచ్చినప్పుడు ప్రజలు బాగా ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను తొలగించడానికి 27కోట్ల యాబై లక్షలు మంజురు చేయించామని అన్నారు. పనులు త్వరగా పూర్తిచేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం అని అన్నారు. కోట్‌పల్లి రిజర్వాయిర్ ఆధునీకరణకు రూ.90కోట్లు మంజూరు చేయించి పనులు జరుగుతున్నాయన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో మొత్తం 600 కోట్లతో రోడ్లు వేయిస్తున్నామన్నారు. అనంతరం ధారూర్ మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు మండల కేంద్రంలో రైతుబజార్ వద్ద జరుగుతున్న అయిదురోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు.

**వికారాబాద్:**మహలక్ష్మి పథకంలో భాగంగా వికారాబాద్ బస్టండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పీకర్ పాల్గొని మాట్లాడుతూ మహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసు కుంటు ఆర్‌టిసి బస్సులలో నిరంతరం ప్రయణిస్తున్న లాయల్ ప్యాసింజర్‌లకు బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్‌ముదిరాజ్, డిపో మేనేజర్ నమ్రత,తదితరులు పాల్గొన్నారు.





## మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

### తోటకూర వజ్రేష్ యాదవ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమంలో అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలంగాణ రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహాలక్ష్మీ పథకం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఘట్‌కేసర్ సర్కిల్‌లో బస్టాండ్ ఆవరణలో మహిళలకు మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్‌లు మహిళలను శాలువాతో సన్మానించారు. ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకం ద్వారా ఇప్పటివరకు 251 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణంచేసి 10 కోట్ల విలువైన ప్రయాణాన్ని ఉచితంగా పొందినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు కొంతం అంజిరెడ్డి,మాజీ బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, గోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఉల్లి ఆంజనేయులు యాదవ్, మైనార్టీ అధ్యక్షులు ఫరూక్, తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ రుణాలు సకాలంలో చెల్లించండి

### ప్రత్యేకాధికారి జి. కిరణ్మయి



**ప్రజాపక్షం/బంట్వారం :** బంట్వారం మండల కేంద్రంలో మంగళవారం పిఎసిఎస్ సర్వ సభ్య సమావేశం ప్రత్యేకాధికారి జి. కిరణ్మయి సీనియర్ ఇన్‌స్పెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ముందుగా గత ఆరు మాసాలుగా పిఎసిఎస్ జరిగిన లావాదేవిలు తదితర అంశాలను సమావేశంలో ఏజెండాను సెక్రటరి శ్రీనివాస్ చదివి వినిపించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ ప్రత్యేకాధికారి జి. కిరణ్మయి సీనియర్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. రైతుల తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించినట్లయితే వడ్డి భారం పడదని, ఆలస్యంగా చెల్లిస్తే 13 శాతం వడ్డీ పెరుగుతుందన్నారు. వీలయినంత తొందరగా రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధి సహకరించాలని పేర్కొన్నారు. మొబైల్ యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవాలని, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుకు ఓటిపి ద్వారా యూరియా అందించబడుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వం రాష్టవ్యాప్తంగా అన్ని పిఎసిఎస్ సహకార సంఘంలో ప్రతి చోట పంట పొలాల్లో అతి తక్కువ ఖర్చుతో పురుగు మందుల పిచికారికి చేసేసుందుకు డ్రోన్‌లు అందించడం జరిగిందని, 5 నిమిషాల వ్యవధిలో ఒక ఎకరం పొలంలో మందు పిచికారి చేయవచ్చన్నారు. రైతులు డ్రోన్ ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, శ్రీనివాస్,నరేందర్, విశ్వనాథం, రైతులు తదితరులు ఉన్నారు.



## క్షేమంగా ఇంటికి చేరడమే అరైవ్–అలైవ్ లక్ష్యం : ఎస్‌పి

**ప్రజాపక్షం/కొడంగల్:**క్షేమంగా ఇంటికి చేరడమే 'అరైవ్ అలైవ్ లక్ష్యం' అని జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా అన్నారు. కొడంగల్ లో డ్రైవర్లకోసం ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించిన అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రక్స్ నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి ఉయవతదేశానికి వెన్నుముక అనిఅటువంటి యువశక్తి నిర్వీర్యం చేసేందుకు డ్రక్స్ మాఫియా పన్ను తున్న కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. డ్రక్స్ అనే మత్తు ఉబిలో చిక్కుకోవద్దని ,గంజాయి,ఇతర మత్తు పదార్థల సరఫార గురించి ఎలాంటి సమాచారం ఉన్న భయం లేకుండా వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వలని తెలిపారు. వివారలు అత్యంత గోప్యంగా ఉంచుతమని ఎస్‌పి తెలిపారు. ప్రతి రోజు ఉపది కోసం వేళ్లె వ్యక్తుల తిరిగి క్షేమంగా తమ కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడమే ఈప్రాజేక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. వాహనదారులు ట్రాపిక్ నియమాలను పాటించాలన్నారు. డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిరాములు నాయక్, పరిడి డిఎస్‌పి శ్రీనివాస్, కొడంగల్ సిఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యానారయణ, వసంత్, వైస్ చైర్మన్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంతోషమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** మహిళల సంతోషమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళ లు ఆర్టిసి బస్సులో దాదాపు రూ. 290కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ.10కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్నారని అన్నారు. తాండూరు డిపోలో ఆర్టి సి డిఎం సురేష్ ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅథిగా ఎమ్మెల్యే హాజరైనారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చి హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ఉచిత బస్సు సౌకర్యాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. బస్సు సర్వీసులు సరిపోవడం లేదని ప్రభుత్వం దృష్టికి రావడంతో మహిళల సంఘాలకు ప్రాధాన్యతను ఇచ్చి ఆర్టిసితో సమన్వయం చేసి మహిళలకు కొత్త బస్సులను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరాజబాల్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ నర్సిములు, వైస్ చైర్మన్ రజాక్, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తమ్‌రావు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



## కల్తీ ఐస్‌క్రీమ్‌ల గుట్టు రట్టు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణంలో కల్తీ ఐస్ క్రీమ్ తయారి గుట్టు రట్టు చేశారు. జిల్లా ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు చేసిన దాడులలో కల్తీ గుట్టు బయటపడింది. మంగళవారం సాయంత్రం తాండూరు పట్టణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. పట్టణంలోని సాయిపూర్ తదితర ప్రాంతాలలో దాడులు చేసిన అధికారులు కల్తీ ఐస్‌క్రీమ్ తయారీకి వాడుతున్న సామాగ్రిని సైతం సీజ్ చేశారు. పలువురు కల్తీ ఐస్‌క్రీమ్ తయారీదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



## హామీలు కాదు.. అభివృద్ధి చేసి చూపిస్తా

### అక్నాపూర్ గ్రామ సర్పంచ్ కౌకుంట్ల అరుణ బంధయ్య గౌడ్

**ప్రజాపక్షం/నవాబుపేట్:** గ్రామ సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అక్నాపూర్ గ్రామ సర్పంచ్ కౌకుంట్ల అరుణ బంధయ్య గౌడ్ పనిచేస్తు విశేష కృషి చేస్తున్నారు. పదవి చేపట్టిన నాటి నుండి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా సిసి రోడ్ల నిర్మాణం, మురికి కాలవల ప్రక్షాళన, అండర్ డ్రైనేజీ, వీధి దీపాల ఏర్పాటు, మంచినీటి సౌకర్యం కోసం బోర్ల రిపేర్ పనులు, నూతన బోర్ వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నారు. గ్రామంలో పర్యవేక్షిస్తూ, గ్రామాన్ని హరితవనంగా మార్చేందుకు కృషిచేస్తు ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అక్నాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పం ఉంటే అభివృద్ధి చేస్తామని అందుకు హామీలు అవసరం లేదు ప్రజల అవసరాలను తెలుసుకొని చేయడమే ముఖ్యం అని ఈ సందర్భంగా సర్పంచ్ కోకుంట్ల అరుణ బంధయ్య గౌడ్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలు అభివృద్ధికి సహకరించి అందరూ అండగా ఉంటే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

## సిఎంఆర్‌ఎఫ్ పేదల పాలిట వరం

ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సిఎంఆర్‌ఎఫ్ పేదల పాలిటవరమని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం బాలాపూర్ మండలం జిల్లెలగూడకు చెందిన శారదకు మంజూరైన సిఎం సహాయనిధి రూ.40,000 చెక్కును క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మీర్‌పేట్ బిఆర్‌ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షులు సునీత బాల్‌రాజ్ పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్య రక్షణ ప్రాధాన్యం

డిఎంహెచ్‌ఒ డాక్టర్ లలితాదేవి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మహిళల ఆరోగ్య రక్షణ ప్రాధాన్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు. హెచ్‌పివి హ్యూమన్ పాపిలోమా వైరస్ అనే వ్యాక్సిన్ పంపిణీని రంగారెడ్డి జిల్లాలోని 22 సెంటర్లలో ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈ వ్యాక్సిన్ వల్ల మహిళల్లో సాధారణంగా వచ్చే గర్భాశయ ముఖ క్యాన్సర్ నుండి నివారించడానికి వాడతారని, హెచ్‌పివి అనే వైరస్ వల్ల వచ్చే ఇతర క్యాన్సర్లను తగ్గిస్తుందన్నారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యాన్ని రక్షిస్తుందని, 9 నుండి 14 సంవత్సరాల బాలికలకు అత్యంత మంచిదని తెలిపారు. ఈ టీకా పూర్తిగా సురక్షితమైనదని, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని లలిత దేవి కోరారు.

## హరీష్‌రావుకు ఎమ్మెల్యే ఆహ్వానం



**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** ఏప్రిల్ 2న హనుమాన్ జయంతి సందర్భంగా ఎల్.బి.నగర్‌లో శోభాయాత్ర కార్యక్రమానికి హాజరుకావాలని మాజీ మంత్రి హరీష్‌రావుకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గురువారం సాయంత్రం బిఎన్‌రెడ్డి నగర్ చౌరస్తా నుండి సాహెబ్‌నగర్ శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్ , జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, రామావత్ పద్మ నాయక్, జక్కిడి మల్లారెడ్డి, లింగాల రాహుల్ గౌడ్, చిన్నగొని రవీందర్ గౌడ్, కటిక అరవింద్‌రెడ్డి, చింతల్ రవిచిరంజీవి, గజ్జల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## పకడ్బందీగా 99రోజుల ప్రణాళిక



**ప్రజాపక్షం/కేశంపేట:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రణాళికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారిణి రమాదేవి సూచించారు. మంగళవారం కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి, చౌలపల్లి గ్రామాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్యము, రోడ్ల పరిశుభ్రత, మురుగు కాలువల శుభ్రత, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఇందిరమ్మ ఇండ్లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, గ్రామ పంచాయతీలకు వైట్ బోర్డు లోగోల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కేశంపేట ఎంపిడిఒ రవి చంద్రకుమార్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి కిష్టయ్య, చౌలపల్లి సర్పంచ్ వజ్రమ్మతోపాటు కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## రూ.36.51కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతోనే మున్సిపాలిటీ ఆదాయం పెంచేందుకే రూ.36.51కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలపడం జరిగిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం కొత్తూరు మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అధ్యక్షతన మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజలందరి భాగస్వామ్యంతోనే మున్సిపాలిటి ఆదాయం పెంచడంతో మున్సిపాలిటీలు అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మున్సిపాలిటీలో వివిధ రకాల పన్నులు, అదనపు డిపాజిట్లు, ప్లాన్ గ్రాంట్, నాన్ ప్లాన్ గ్రాంట్‌లతో పాటు ఇతర అభివృద్ధి పనులకు కలిపి బడ్జెట్‌ను రూపొంధించడం జరిగిందని తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వార్డుల వారీగా సమస్యలను గుర్తించి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. పార్టీలకు అతీతంగా మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు కార్యచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. ఇంటి పన్నులు, నల్లా బిల్లుల, ఇతర పన్నులు పెండింగ్‌లో లేకుండా అధికారులు వసూళ్లు చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ డోలీ రవీందర్, కౌన్సిలర్లు మాధవి గోపాల్ గౌడ్, చంద్రకళ రాజేందర్ గౌడ్, కోస్గి శ్రీనివాస్ గౌడ్, సోమ్లానాయక్, వీరమోని హేమా దేవేందర్ ముదిరాజ్, కమ్మరి జయమ్మ జనార్ధన్‌చారి, మాదారం నరసింహా గౌడ్, భ్యాగరి ప్రసన్న లత యాదయ్య, మున్సిపల్ కమీషనర్ బాలాజీతోపాటు అధికారులు పాల్గొన్నారు.

# జిహెచ్‌ఎంసిలో నిధుల పక్కదారి

## ఆదాయానికి భారీ గండి ! ...కాగ్ నివేదికలో వెలుగులోకి నిజాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి)లో పాలనాపరమైన నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగంపై కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తాజాగా కీలక నివేదికను విడుదల చేసింది. వివిధ విభాగాల్లో పన్నుల ఎగవేత, నిధుల మళ్లింపు కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లుతోందని కాగ్ హెచ్చరించింది. ఓవైపు ఆదాయం పెంచుకునే మార్గాలు ఉన్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఖజానాకు గండి పడుతుందని కాగ్ గుర్తించింది. జిహెచ్‌ఎంసి ఆర్థిక నిర్వహణలో లోపాలు, పర్యవేక్షణలో నిర్లక్ష్యం, ప్రణాళికల అమలులో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నాయని కాగ్ స్పష్టంచేసింది. చెత్త నిర్వహణ వ్యవస్థలో కూడా లోపాలు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

### పర్యావరణ ప్రభావ రుసుం ఎగవేత

భవన నిర్మాణ అనుమతుల జారీలో అధికారులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం వల్ల కోట్లాది రూపాయల ఆదాయం చేజారిపోతోంది. 10 వేల చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భవనాలపై చదరపు అడుగుకు రూ.3 చొప్పున ఇంపాక్ట్ ఫీజు వసూలు చేయాలి. పార్కింగ్, సెల్లార్ల నిర్మాణ స్థలాన్ని లెక్కలోకి తీసుకోకపోవడం వల్ల ఈ నష్టం జరిగింది. 201617 నుండి 202122 కాలానికి సంబంధించి 4,632 దస్త్రాలను పరిశీలించగా, 1,052 కేసుల్లో దాదాపు రూ.2.29 కోట్ల ఆదాయాన్ని జిహెచ్‌ఎంసి కోల్పోయినట్లు కాగ్ గుర్తించింది.

### గ్రంథాలయ సెస్సు నిధుల మళ్లింపు

ప్రజల నుంచి వసూలు చేసిన గ్రంథాలయ సెస్సు నిధులను సంబంధిత సంస్థలకు చేరవేయడంలో జిహెచ్‌ఎంసి ఘోరంగా విఫలమైంది. వసూలైన రూ.321.51 కోట్లలో కేవలం రూ.20.12 కోట్లు (7 శాతం) మాత్రమే గ్రంథాలయ సంస్థలకు జమ చేశారు. మిగిలిన రూ.273.29 కోట్లు (దాదాపు 92 శాతం) నిధులు ఎటు వెళ్లాయో అన్న దానిపై స్పష్టత లేకుండా పోయింది.

### పారిశుద్ధ్య నిర్వహణలో వైఫల్యం

నగరంలోని చెత్త బదిలీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని కాగ్ పేర్కొంది. ఇమ్లీబన్, జియాగూడ వంటి ప్రాంతాల్లో చెత్త తరలింపు కేంద్రాల నిర్వహణ అధ్వాన్నంగా ఉంది. మూసీ ఒడ్డున ఏర్పాటు చేసిన కేంద్రాల వల్ల గాలి, నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఇమ్లీబన్‌లో కనీస వసతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారు. జియాగూడలో మూసీ నది ఒడ్డున ఏర్పాటు చేసిన కేంద్రం వల్ల అటు గాలి, ఇటు నీరు కలుషితమై ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉందని నివేదిక హెచ్చరించింది. మరోవైపు అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు సద్వినియోగం కాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ట్యాంక్‌బండ్ శివకు ప్రభుత్వం ఆర్థికసాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ట్యాంక్‌బండ్‌పై పలువురు ప్రాణాలను కాపాడిన శివకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు రూ.5లక్షల ఆర్థికసాయం అందించడంతో పాటు, ఆయన కుమారుడు వేణుమాధవ్‌కు హోంగార్డు ఉద్యోగ నియామకపత్రాన్ని అందజేశారు. ఇటీవల శివ కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు ముఖ్యమంత్రి దృష్టికి చేరడంతో, వెంటనే సహాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి లేక కుటుంబ పోషణ కష్టంగా మారిన నేపథ్యంలో, శివకు అవసరమైన మద్దతు కల్పించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ట్యాంక్ బండ్ సమీపంలో స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఉపాధి కల్పించాలని శివ చేసిన వినతిని ముఖ్యమంత్రి పరిగణనలోకి తీసుకున్నారు. ఈ మేరకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదే విధంగా, శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని సిఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి చేతులమీదుగా సహాయం అందుకోవడం పట్ల శివతో పాటు ఆయన కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తంచేశారు.

## హనుమాన్ విజయయాత్రకు భారీ బందోబస్తు

12 కిలోమీటర్ల యాత్ర రూట్‌మ్యాప్

ఏర్పాట్లను వివరించిన సజ్జనార్



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** ఏప్రిల్ 2న జరుపుకునే హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే వీర హనుమాన్ విజయయాత్రను ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కొత్వాల్ సజ్జనార్ తెలిపారు. యాత్ర ఏర్పాట్లపై మంగళవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో కొత్వాల్ సజ్జనార్ అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖలు, ఉత్సవాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొత్వాల్ సజ్జనార్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన శ్రీరామనవమి శోభాయాత్రను అన్ని శాఖల సహకారంతో విజయవంతంగా పూర్తి చేసినట్లే.. హనుమాన్ విజయయాత్రను కూడా శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈసారి ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సుమారు 3 వేల మంది పోలీసు సిబ్బందితో పాటు అదనపు సాయుధ బలగాలు, టాస్క్ ఫోర్స్ బృందాలను కీలక ప్రాంతాల్లో మోహరిస్తున్నట్లు వివరించారు. యాత్ర నిర్వహణలో వాలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. యాత్రలో కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నిర్ణీత మార్గాల్లోనే యాత్ర సాగేలా చూడాలని కోరారు. ఫ్లయిఓవర్లు, రైల్వే బ్రిడ్జిల దృష్ట్యా విగ్రహాల ఎత్తు విషయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మళ్లింపులు చేపడతామని, ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశం అనంతరం కొత్వాల్ సజ్జనార్ గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకుని.. అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల యాత్ర మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమావేశంలో అదనపు సిపి (ఎల్‌అండ్ ఎ) తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి(ట్రాఫిక్)డెవిస్, చార్మినార్ జెడ్‌సి శ్రీనివాస్‌రెడ్డి, బల్దియా అదనపు కమిషనర్(పారిశుధ్యం) రవి కిరణ్, విహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షుడు నరసింహామూర్తి, బజ్‌రంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ రామరాజు, విహెచ్‌పీ స్పోక్స్ పర్సన్ శషిధర్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల నుంచి పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో దోమల నివారణకు, పారిశుద్ధ్య మెరుగుదలకు క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కాప్రా, నాచారం సర్కిళ్ల వార్డు ఎంటమాలజీ సూపర్‌వైజర్లతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ల పనితీరును కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో నిల్వ ఉన్న నీటిని తొలగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన చోట కెమికల్ స్ప్రేయింగ్ చేయాలని సూచించారు. చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించి, దోమల లార్వాను అరికట్టే గంబూసియా చేపలను వదలాలని ఆదేశించారు. సమావేశంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డి, డిప్యూటీ కమిషనర్లు నిత్యానందం, శ్రీహరి పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ పరిధిలో కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన



'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఘట్‌కేసర్ సర్కిల్‌లో పర్యటించారు. నాగారంలోని ఎస్‌సి నగర్ కాలనీలో పారిశుద్ధ్యం, ఆస్తి పన్ను వసూళ్లపై ఆయన స్వయంగా తనిఖీలు చేపట్టారు. కాలనీల్లో సాట్ ఆటోల ద్వారా చెత్త సేకరణ జరుగుతున్న తీరును పరిశీలించారు. దుకాణదారులు డస్ట్ బిన్లు వాడాలని, ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు. రోడ్ల పక్కన ఉన్న నిర్మాణ వ్యర్థాలను తక్షణమే తొలగించి మార్జిన్లను క్లియర్ చేయాలని డిప్యూటి కమిషనర్‌ను ఆదేశించారు. సుమారు రూ. 19 లక్షల ఆస్తి పన్ను బకాయి ఉన్న హోలీ మేరి కాలేజీని కమిషనర్ సందర్శించారు. పన్ను చెల్లించనందుకు సదరు యాజమాన్యానికి 'డిస్ట్రెస్ వారెంట్' జారీ చేస్తూ, సాయంత్రం లోపు బకాయిలు చెల్లించాలని స్పష్టం చేశారు.

## ఖేలో ఇండియా గిరిజన క్రీడల్లో 4 పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్‌లో భాగంగా ఛత్తీస్‌గడ్‌లో జరుగుతున్న పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు ప్రతిభ చాటారు. మొత్తం ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్య పతకాలు సాధించారు. సూర్గుజాలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో మహిళల 57 కేజీల విభాగం లో నాగలక్ష్మి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో కర్ణాటక క్రీడాకారిణి సాయి సిద్ధిపై 100 తేడాతో ఘనవిజయం సాధించింది. పురుషుల గ్రీకోరోమన్ 77కేజీల విభాగంలో జాదవ్ చరణ్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. కాంస్యపోరులో ఛత్తీస్‌గడ్‌కు చెందిన హనీష్‌కుమ్పా 80తేడాతో విజయం సాధించాడు. గ్రీకోరోమన్ 135 కేజీల నార్డిక్ విభాగంలో రాజు మరో కాంస్య పతకాన్ని సాధించాడు. అథ్లెటిక్స్‌లో జగ్దాల్పూర్‌లో జరిగిన 110 మీటర్ల హర్డిల్స్‌లో దత్తు రజత పతకం గెలుచుకుని మెప్పించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడలమంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధులు క్రీడాకారులను అభినందించారు.



## కాలనీల సమస్యలపై వినతి



**ప్రజాపక్షం/మియాపూర్ :** మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్‌సిఐ కాలనీ, టీఎన్ నగర్ కాలనీ, వీడియా కాలనీలలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై కాలనీల ప్రతినిధులు మియాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలలో ఉన్న యూజీడీ, సీసీ రోడ్లు, తాగు నీటి వసతి వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన శ్రీకాంత్ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, సమ్మెట ప్రసాద్, సుప్రజ, కప్పెరా రమేష్, ఉమాకిషన్, వెంకటేశ్వరావు, శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, నర్సింగ్ రావు, శ్రీనివాస్, సర్వోత్తమ్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనల మేరకే నష్టపరిహారం చెల్లిస్తాం

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్/కొందుర్గు:** రేడియల్ రోడ్డు భూ సేకరణకు అన్నదాతలు పూర్తి స్థాయిలో సహకరించడంతోపాటు భూములు ఇచ్చేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి కోరారు. మంగళవారం నియోజకవర్గంలోని కొందుర్గు మండలం ముట్పూర్, ఉమ్మెంత్యాల గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ రవాణ వ్యవస్థ మెరుగుపడితేనే ప్రాంతాలు అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రేడియల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, రోడ్డు నిర్మాణాల్లో భూములు కొల్పోతున్న అన్నదాతలకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని వివరించారు. ఈ రోడ్డు నిర్మాణాల ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరగడంతోపాటు అనేక రకాల పరిశ్రమలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. పెద్ద పరిశ్రమలు వస్తే నిరుద్యోగ సమస్య తీరడంతోపాటు ఉపాధి అవకాశాలు లభించే అస్కారం ఉంటుందని అన్నారు. ఈ రేడియల్ రోడ్డు నిర్మాణానికి అన్నదాతలందరు సహకరించాలని, ఏ సమస్య ఉన్నా మండల రెవిన్యూ అధికారులను సంప్రదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత, షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ, కొందుర్గు తహసీల్దార్ ఆజాం అలీ, కొందుర్గు ఎస్‌ఐ రవీందర్ నాయక్‌తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, రెవిన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని జానంపేట శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో శ్రీ గోదా సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరై పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుతోపాటు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్ అప్ప పాల్గొన్నారు.

## గ్రామ, వార్డు సభలు విజయవంతం చేయాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఏప్రిల్ 2 నుండి నిర్వహించే గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ సంబంధిత అధికారులు, ఆర్డీఓలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామ వార్డు సభలు సమర్ధవంతంగా నిర్వహించాలని, పాఠశాల, పంచాయతీభవన్, బహిరంగ ప్రదేశం, ఏదైనా ఇతర అనువైన వేదికను ఏర్పాటు చేసి ఉదయం 10 గంటలకు ప్రారంభించాలని, గ్రామ వార్డు సభలలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, మంత్రులకు, ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, సభలను రాష్ట్ర గీతంతో ప్రారంభించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు చదివి వినిపించాలని సూచించారు. అమలులో ఉన్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై చర్చించాలని, గ్రామసభలలో సర్పంచ్ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శులు సంబంధిత శాఖల అధికారులు గ్రామ పెద్దలు స్వయం సహాయక సంఘాల సభ్యులు యువత రైతులు మహిళా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు ఉండేలా చూడాలని సూచించారు. మహిళలు వృద్ధులు కూర్చునేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, జిల్లా పరిషత్ సిఇఒ సిహెచ్ కృష్ణ రెడ్డి, డిపిఓ వి.సురేష్‌మోహన్, సిపిఓ సౌమ్య, సంక్షేమ శాఖల అధికారులు రామరావు, కోట్ల నవీన్‌కుమార్‌రెడ్డి, బి కేషరామ్, జొన్నలగడ్డ పద్మావతి, పిడి డీఆర్డీఏ ఎల్ శ్రీలత, విద్యాశాఖ అధికారి పి.సుశిందర్‌రావు, పిడి హౌసింగ్ చంప్లా నాయక్, జిఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషా, ఉద్యానవనశాఖ అధికారి కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# పోరాడి ఓడిన గుజరాత్..!

## ఒంటిచేత్తో పంజాబ్‌ను గెలిపించిన కూపర్..

పంతొమ్మిదో సీజన్‌లో వరుసగా నాలుగో మ్యాచ్‌లో ఛేజింగ్ జట్టే విజేతగా నిలిచింది. ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ అదిరే బోణీ కొట్టింది. బౌలర్ల విజృంభణతో గుజరాత్ టైటాన్స్‌ను కట్టడి చేసిన పంజాబ్‌ను కూపర్ కొన్నొల్లీ(74 నాటౌట్) ఒంటి చేత్తో గెలిపించాడు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (37) మెరుపులతో అలవోకగా లక్ష్యాన్ని అందుకునేలా కనిపించినా.. ఇంప్యాక్ట్ ప్లేయర్ ప్రసిధ్ కృష్ణ (329) వరుస వికెట్లతో భయపెట్టాడు. కానీ, చివరిదాకా నిలబడిన కూపర్.. గ్జావియర్ బార్ట్‌లెట్ (11 నాటౌట్)తో కలిసి జట్టును గెలిపించాడు. పద్దెనిమిదో సీజన్ రన్నరప్ పంజాబ్ కింగ్స్ విజయంతో పంతొమ్మిదో సీజన్‌ను మొదలెట్టింది. ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్‌పై వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా కూపర్ కొన్నొల్లీ(74 నాటౌట్) అర్ధశతకంతో జట్టును గెలిపించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా చివరిదాకా నిలబడిన కూపర్ పంజాబ్‌ను విజయ తీరాలకు చేర్చాడు. ముల్లన్‌పూర్‌లో గుజరాత్‌ను 162కే కట్టడి చేసిన పంజాబ్ కింగ్స్‌కు కగిసో రబడ ఆదిలోనే షాకిచ్చాడు. డేంజరస్ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(7) అశోక్ శర్మ క్యాచ్ అందుకోగా పెవిలియన్ చేరాడు. 7 పరుగులకే వికెట్ పడిన వేళ కూపర్ కొన్నొల్లి జతగా మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(37) లు దూకుడుగా ఆడాడు. రెండో వికెట్‌కు76 రన్స్ జోడించిన ఈ జంటను రషీద్ ఖాన్ విడదీశాడు. ప్రభ్‌సిమ్రన్ ఔటయ్యాక వచ్చిన శ్రేయాస్ అయ్యర్(18), నేహల్ వధేరా(3)లు విఫలమయ్యారు. అప్పటికీ పంజాబ్ విజయానికి 42 బంతుల్లో యాభై రన్స్ అవసరమవ్వగా కొన్నొల్లి, శషాంక్ సింగ్‌లు జట్టును గెలిపించే బాధ్యత తీసుకున్నారు. కానీ, ఇంపాక్ట్ ప్లేయర్ ప్రసిధ్ కృష్ణ(329) తెలివైన బౌలింగ్‌తో వరుస బంతుల్లో శశాంక్, మార్కస్ స్టోయినిస్(0)ను ఔట్ చేయడంతో గుజరాత్ రేసులోకి వచ్చింది. రబడ ఓవర్లో కొన్నొల్లి రెండు ఫోర్లు బాదగా.. ప్రసిధ్ బౌలింగ్‌లో యాన్సెస్ సిక్సర్‌తో మ్యాచ్‌ను పంజాబ్ వైపు తిప్పాడు. ప్రసిధ్ విసిరిన షార్ట్ పిచ్ బంతిని గ్జావియర్ బార్ట్‌లెట్(11 నాటౌట్) స్టాండ్స్‌లోకి గుజరాత్ ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి ఓవర్లో 2 పరగులు అవసరమవ్వగా.. బౌండరీతో పంజాబ్‌కు 3 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు కూపర్. గుజరాత్ టైటాన్స్ శుభారంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఓపెనర్లు సాయి సుదర్శన్ (13), శుభ్‌మన్ గిల్(39)లు రాణించినా.. సొంత మైదానంలో పంజాబ్ కింగ్స్ బౌలర్ల ధాటికి గుజరాత్ మిడిలార్డర్ తేలిపోయింది. సాయిని ఔట్ చేసిన యాన్సెన్ తొలి బ్రేకివ్వగా.. జోస్ బట్లర్ (38)తో కలిసి గిల్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, చాహల్ ఓవర్లో అతడు కొన్నొల్లి చేతికి చిక్కడంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం గ్లెన్ ఫిలిప్స్(25) మెరుపు బ్యాటింగ్‌తో అలరించి స్కోర్‌బోర్డును ఉరికించాడు. అయితే.. విజయ్‌కుమార్ ఓవర్లో అతడు అర్ష్‌దీప్ చేతికి చిక్కగా.. కాసేపటికే చాహల్ బౌలింగ్‌లో సిక్సర్‌కు యత్నించిన బట్లర్ బౌండరీ లైన్ వద్ద బార్ట్‌లెట్ పైకెగిరి క్యాచ్ అందుకోవడంతో వెనుదిరిగాడు. ఆ తర్వాత పంజాబ్ బౌలర్లు మరింత కట్టుదిట్టంగా బంతులు సంధించగా వాసింగ్టన్ సుందర్(18), షారుక్ ఖాన్(4), రాహుల్ తెవాటియా (11నాటౌట్)లు బౌండరీలు కొట్టేందుకు ఇబ్బంది పడ్డారు. చివరి ఓవర్లో అర్ష్‌దీప్ వైడ్స్ వేయడంతో గుజరాత్ 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేయగలిగింది.



## సత్తాచాటిన తెలంగాణ క్రీడాకారులు..

### జాతీయ పారా తైక్వాండోలో 2వ ఓవరాల్ చాంపియన్‌షిప్





నాలుగవ జాతీయ పారా తైక్వాండో పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు చరిత్ర సృష్టించారు. ఈనెల 28, 29 తేదీల్లో బెంగళూరులోని కోరమంగళ స్టేడియంలో జరిగిన పోటీల్లో తెలంగాణ పారా తైక్వాండో అసోసియేషన్ (టీపీటీఏ) ఆధ్వర్యంలో పాల్గొన్న క్రీడాకారులు 3 పసిడి, 2 రజత, 3 కాంస్యాలతో మొత్తం 8 పతకాలు సాధించి జాతీయ స్థాయిలో 2వ ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఎల్లావుల గౌతమ్ యాదవ్ (పీ51), కె.శివ (పీ52), కె.లోకేశ్వరి (పీ33) బంగారు, ఎం.మమత (పీ52), జి.రాజేశ్ (పీ53) వెండి, సాయక్ అబ్దుల్ (పీ52), సి.జ్ఞానేశ్వర్ (పీ52), ఎం.లోకేష్ (కే44 అండర్80 కేజీ) కాంస్య పతకాలు సాధించారు. వీరి విజయం దేశవ్యాప్తంగా పారా క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పారా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్లావుల గణేశ్ యాదవ్ అన్నారు.

## పారా ఆర్చర్ ఆఫ్ ది ఇయర్‌గా శీతల్

ఢిల్లీ : భారత యువ పారా ఆర్చర్ శీతల్ దేవీకి అరుదైన గుర్తింపు దక్కింది. 19 ఏండ్ల ఈ జమ్మూ కశ్మీర్ అమ్మాయి 2025 సంవత్సరానికి గాను 'పారా ఆర్చర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైనట్టు వరల్డ్ ఆర్చరీ ప్రకటించింది. నిరుడు గ్వాంగ్జులో జరిగిన వరల్డ్ పారా ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీల్లో స్వర్ణం గెలిచిన మొదటి మహిళా ఆర్మ్లెస్ (చేతుల్లేని) ఆర్చర్‌గా రికార్డులకెక్కిన ఆమె నిలకడగా రాణిస్తుండటంతో వరల్డ్ ఆర్చరీ శీతల్‌కు ఈ అవార్డును ప్రకటించింది.వరల్డ్ చాంపియన్‌లో స్వర్ణమే గాక శీతల్.. పారిస్ పారాలింపిక్స్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్లో కాంస్యం, వరల్ చాంపియన్‌షిప్‌లో మహిళల టీమ్ సిల్వర్, మిక్స్‌డ్ టీమ్ కాంస్యంతో సత్తాచాటింది. ఇక 'ఆర్చర్ ఆఫ్ ది ఇయర్'గా టర్కీకి చెందిన ఎమిర్కన్ హేనీ ఎంపికైంది.

మహిళ

## మహిళా సాధికారత దానం కాదు..హక్కు





మహిళా సాధికారత అనేది ఎవరో ఇచ్చే దానం కాదు. మహిళల హక్కు. స్త్రీలకు తమ జీవితానికి సంబంధించిన నిర్ణయాలను స్వయంగా తీసుకునే శక్తి, స్వేచ్ఛ, నమ్మకాన్ని ఇవ్వడాన్ని సూచించే ఈ పదం చాలాకాలంగా అందరూ అంటునే ఉన్నప్పటికీ, వాస్తవ రూపాన్ని దాల్చుకోవడం లేదన్నది నిజం. చాలా కాలంగా సమాజంలో మహిళలు సమాన హక్కులు పొందకుండా వివక్షకు గురవుతునే ఉన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ హక్కులు, సామాజిక గౌరవం వంటి అనేక రంగాల్లో వారికి అవకాశాలు పరిమితమయ్యాయి. అయితే కాలక్రమేణా ఈ పరిస్థితి మారడం ప్రారంభమైంది. మహిళలు తమ హక్కుల కోసం పోరాడి సమాజంలో సమాన స్థానం పొందడానికి కృషి చేస్తున్నారు. మహిళా సాధికారత అనేది కేవలం మహిళల సమస్య కాదు. అది మొత్తం సమాజ అభివృద్ధికి సంబంధించిన అంశం. మహిళలు శక్తివంతంగా, స్వతంత్రంగా ఉంటే కుటుంబాలు, సమాజాలు, దేశాలు మరింత బలంగా మారుతాయి. అందువల్ల మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ఒక న్యాయసమ్మతమైన మరియు అభివృద్ధి దిశగా తీసుకునే ముఖ్యమైన చర్య. చరిత్రలో చాలా కాలంగా పితృస్వామ్య సమాజ వ్యవస్థ ప్రబలం గా ఉంది. ఈ వ్యవస్థలో పురుషులు కుటుంబం, సమాజంలో ప్రధాన అధికారాన్ని కలిగి ఉన్నారన్నది కాదనలేని నిజం. మహిళల పాత్ర ఎక్కువగా గృహ పనులు, కుటుంబ సంరక్షణకు మాత్రమే పరిమితమవుతున్నది. అనేక దేశాలలో మహిళలకు ఓటు హక్కు కూడా లేదు. వారు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచలేకపోయేవారు. క్రమంగా, ఈ పరిస్థితికి వ్యతిరేకంగా మహిళలు పోరాటాలు ప్రారంభించారు. మహిళల ఓటు హక్కు కోసం జరిగిన ఉద్యమాలు ప్రపంచవ్యాప్తంగా పెద్ద మార్పులను తీసుకొచ్చాయి. విద్యావకాశాలు పెరగడంతో మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపించడం ప్రారంభించారు. సమాజంలో వారు కేవలం గృహ పనులకే పరిమితం కావాల్సిన అవసరం లేదని ప్రపంచం గుర్తించింది. పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయని చెప్పలేకపోయినా, చెప్పుకోదగిన మార్పులు సాధ్యమయ్యాయనడంలో అతిశయోక్తి లేదు. ఇక్కడ, మహిళా సాధికారత అంటే ఏమిటనే ప్రశ్న తెరపైకి వస్తుంది. మహిళా సాధికారత అంటే మహిళలకు సమాన హక్కులు ఇవ్వడం. వారు తమ జీవితాన్ని స్వతంత్రంగా నిర్మించుకునే అవకాశాన్ని కల్పించడం. ఇది విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యం మరియు నిర్ణయాధికారాన్ని కలిగి ఉండటాన్ని సూచిస్తుంది. ఒక మహిళకు విద్య ఉంటే ఆమెకు తన జీవితంపై నియంత్రణ పెరుగుతుంది. ఆమె తన కుటుంబం, సమాజంలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోగలుగుతుంది. సాధికారత పొందిన మహిళలు తమ పిల్లలకు మంచి విద్యను అందించడానికి ప్రయత్నిస్తారు. వారు కుటుంబ ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపరుస్తారు. మహిళా సాధికారత ఒక వ్యక్తిగత ప్రయోజనంగా మాత్రమే కాకుండా, సమాజ మొత్తం అభివృద్ధికి దోహదపడే శక్తిగా మారుతుంది.

## పడవ నడుపుతూ

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సూరజ్‌పూర్ జిల్లా లో ఉదయం సూర్యకిరణాలు నీటి మీద మెరుస్తుంటే, ఒక చిన్న మోటార్ బోటు నెమ్మదిగా సరస్సు మీద ప్రయాణం మొదలుపెడుతుంది. సాధారణంగా అలాంటి బోట్లను పురుషులే నడిపిస్తారు. కానీ, ఇక్కడ దృశ్యం వేరుగా కనిపిస్తుంది. ఆ బోటును ఒక మహిళ నడిపిస్తుందే. ఆ సాహసికురాలే పూజా సాహు. నిన్నమొన్నటి వరకూ ఆమె ఒక సాధారణ గ్రామీణ మహిళ, కానీ ఇప్పుడు ఆమె కథ అసాధారణ ప్రేరణ. 'ఇప్పుడు నన్ను నా భర్త పేరుతో కాదు..'బోటింగ్ వాలి దీదీ అనే పేరుతో పిలుస్తారు' అంటున్నప్పుడు ఆమె కళ్లలో కనిపించే ఆత్మవిశ్వాసానికి ఎవరుఖరీదు కట్టగలరు? ఈ ఒక్క మాటలోనే ఆమె జీవిత మార్పు మొత్తం దాగి ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు పూజా జీవితం సాధారణ గృహ పనులకే పరిమితమైంది. నిర్ణయాలు ఇతరుల చేతుల్లో ఉండేవి. తనకంటూ ఒక గుర్తింపు ఉండాలనే ఆలోచన కూడా దూరమైన కలలా అనిపించేది. కానీ పరిస్థితులు మారాయి, అవకాశాలు తలుపు తట్టాయి. ఒకప్పుడు బొగ్గు గని ఉన్న ప్రాంతాన్ని శాస్త్రీయ పద్ధతిలో పునరుద్ధరించి రూపొందించిన కెనాపారా ఎకోటూరిజం పార్క్ ఆమె జీవితానికి కొత్త దిశ ఇచ్చింది. సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన ఈ పార్క్ ఇప్పుడు ప్రకృతి, ఉపాధి, గ్రామీణ అభివృద్ధి కలిసిన కేంద్రంగా నిలిచింది. పెద్ద నీటి వనరు, తేలియాడే రెస్టారెంట్, చేపల పెంపకం, బోటింగ్ వంటి కార్యకలాపాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. ఈ బోటింగ్ సేవలను నిర్వహించే శివ శక్తి మహిళా గ్రామ సంఘటన్ స్వయం సహాయక సంఘంలోని 12 మంది మహిళల్లో పూజా ఒకరు. మొదటిసారి బోటు స్టీరింగ్ పట్టుకున్నప్పుడు ఆమెకు భయం కలిగింది. కానీ ప్రతి రోజు సాధన ఆమెకు నమ్మకాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఆమె నైపుణ్యంతో బోటును నడుపుతూ పర్యాటకులను సురక్షితంగా తీసుకెళ్తుంది. రోజుకు సుమారు రూ.200 సంపాదిస్తూ, తన జీవితంపై తానే నిర్ణయాలు తీసుకునే స్థితికి చేరుకుంది. 'ఇప్పుడు నా ఫోన్‌లో డబ్బు ఉంటుంది. నాకు నచ్చిన భోజనం తింటాను, నచ్చిన బట్టలు కొనుగోలు చేస్తాను' అని ఆమె చిరునవ్వుతో చెబుతుంది. ఆర్థిక స్వాతంత్ర్యం ఆమెకు ఆదాయంతోపాటు, ఆత్మగౌరవంగా కూడా ఉంది. పూజా కథ ఒక మహిళ ఎదుగుదల మాత్రమే కాదు..అది మార్పు సాధ్యమని నిరూపించే ఉదాహరణ. ఎవరో ఒకరిపై ఆధారపడే జీవితాన్ని గౌరవంతో కూడిన స్వయం ఆధారిత జీవితంగా మార్చుకోవచ్చునని ఆమె చేతల్లో చూపించింది. 'ఇంటి గడప దాటి బయటికి రండి. ఆర్థికంగా స్వతంత్రంగా మారండి.' అని ఆమె తనలాంటి గ్రామీణ మహిళలకు స్పష్టమైన సందేశమిస్తున్నది. ఈ రోజు సరస్సు మీద సాగుతున్న ప్రతి బోటు ప్రయాణం, ఒక మహిళ తన భయాలను జయించి గుర్తింపును సృష్టించుకున్న ప్రయాణానికి ప్రతీకగా నిలుస్తోంది.

అవకాశం దొరికితే సాధారణ మహిళ కూడా అసాధారణ మార్పునకు నాయకురాలవుతుందని పూజా సాహు కథ మనకు స్పష్టం చేస్తున్నది.



# హామీల అమలుకు పోరాటాలకు సిద్ధంకావాలి

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా పిలుపు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** హామీల అమలుకు పోరాటాలకు సిద్ధం కావాలి సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు ఎస్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు, రైతు రుణ మాఫీ తూతూ మంత్రంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కార్మికుల హక్కులను కాలరాస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సేవ్ సింగరేణి పేరుతో సోమవారం సింగరేణి ప్రధానకార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయవంతమైందని, దీంతో ప్రభుత్వానికి తమ సత్తా ఎంటోచాటామని తెలిపారు. సింగరేణి కార్మికుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల విధానాన్ని అవలంభిస్తోందని ఆరోపించారు. రాజకీయ సయోధ్యకు తాము కట్టుబడే ఉన్నామని, కానీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసేందుకు వెనుకంజ వేసేదే లేదన్నారు. కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, జర్నలిస్టుల సమస్యలపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తన గళాన్ని అసెంబ్లీలో వినిపిస్తున్నారని, చట్టసభల్లో మన ప్రాతినిధ్యం పెంచుకునేందుకు కృషిచేయాలన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటిరిగా బరిలోకి దిగి తమ సత్తా ఎంటో చాటామని, కమ్యూనిస్టులను తక్కువ చేసి చూసిన, మాట్లాడిన వాళ్లు నోళ్లు ఎల్లబెట్టుకునే ఫలితాలు సమిష్టిగా రాబట్ట గలిగామన్నారు. రానున్న జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిద్దామని సాబీర్ పాషా పార్టీ శ్రేణులకు కోరారు. అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ పోకడలు ప్రపంచ శాంతికి పెనుప్రమాదంగా మారిందని, దేశంలో యుద్ధం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ దేశ ప్రధాని నరేంద్ర మోదీ నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. విదేశాంగ విధానానికి కట్టుబడ్డ మోదీ మానవీయ కోణాన్ని మరిచారన్నారు. ఈ యుద్ధ కారణంగా ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో 3 వేల మంది మావోయిస్టులను ప్రభుత్వం హతమార్చిందని, కేంద్ర పోకడల కారణంగా అనేక మంది లొంగిపోతున్నారని చెప్పారు. చర్చలకు రానివ్వకుండా మారణహోమం సృష్టిస్తూ భయానక వాతావరణాన్ని కల్పించారన్నారు. మావోయిస్టు రహిత భారతాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పిన కేంద్రం ఆ దిశగా సత్ఫలితాలు సాధించామంటూ చెప్పుకుంటుందన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన ఉన్న సహజ వనరులను దోచుకునేందుకు కేంద్రం మావోయిస్టులను అడవుల నుండి బయటకు పంపుతోందని, అదానీ, అంబానీలకు అక్కడి సంపదను కారు చౌకగా కట్టబెట్టేందుకు బిజెపి చూస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వాల పనితీరుపై ప్రశించే వారిని అర్బన్ నక్సలైట్లు అంటూ ముద్రవేసి వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. జి.వీరస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర రావుతో పాటు కె.సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మిర్యాల రంగయ్య, మున్నా లక్ష్మీ కుమారి, ఎస్‌డి సలీం, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస రావు, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వర రావు, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా, ఎస్‌కె.ఫహీమ్‌దాదా, డి.శంకర్, బంధం నాగయ్య, మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



### సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికి సిపిఐ కార్యక్రమంతో ముందుకు వెళ్తున్నామని సిపిఐ మహబూబ్‌నగర్‌జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఇంటింటికీ సిపిఐ కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం బాలకిషన్ మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటో తేది నుండి పదో తేదీ వరకు జరిగే ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని, ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వాలపై పోరాటం చేస్తామన్నారు. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బాలకిషన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 1వ తేది నుండి 10వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఐ పేరుతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి సిపిఐ సానుభూతిపరులు ప్రజలు మద్దతు ఇచ్చి పార్టీ శ్రేణులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, కె.పద్మావతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్ భాషా, జి.సత్యనారాయణరెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, రాజశేఖర్, శేఖర్, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు సుందర్ రాజు, వీరేంద్ర కుమార్, మల్లేశ్వరి, రామేశ్వరి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించకుంటే సమ్మెలోకి

### ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్




**ప్రజాపక్షం/రెబ్బెన :** మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రెబ్బెన తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఐ ఉదయ్ కిరణ్, ఎంపిడిఒ శంకరమ్మకు ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు చెల్లించని పక్షంలో బుధవారం నుంచి ఆసిఫాబాద్ సెగ్మెంట్ పరిధిలోని 600 మంది కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. ఎల్ అండ్ టి యాజమాన్యం వేతనాల చెల్లింపులో కాలయాపన చేస్తోందని, దీనివల్ల కార్మికులు కుటుంబాలను పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి చట్ట ప్రకారం బోనస్ చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెట్రోల్ అలవెన్స్, మొబైల్ బిల్లులను కంపెనీయే భరించాలని, సమానపనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వమే గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, జాతీయ పండుగలకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ వివరాలను కార్మికులకు వెల్లడించాలని కోరారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కలీమ్, కార్యదర్శి దుర్గాజి, సాయి, గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, పట్టాలివ్వాలి

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి డిమాండ్




**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న అర్హులయిన పేదలకు పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ మహబూబాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశం సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై విజయసారథి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలతో అసలైన పేద ప్రజలకు ఇల్లు అందించడం లేదన్నారు. ప్రజలు గుడిసెలు వేసుకుని ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటుంటే వారికి పట్టాలు లేవనే నెపంతో ఇందిరమ్మ ఇల్లు అందించడం లేదన్నారు. గత ప్రభుత్వం జిఒ 58 కింద పట్టాలు ఇస్తామని ఇవ్వ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టాలు ఇవ్వడం లేదని విజయసారథి ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిఒ 58 పట్టాలు రాక సుమారు 7నుండి 8 వేల మంది ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారని తెలిపారు. ఈ ప్రభుత్వమైనా పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న వారు సకాలంలో బిల్లులు రాక ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పేదలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఇంటి నెంబర్లు యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి ప్రజలను ఆదుకోవాలని కోరారు. సిపిఐ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని, రానున్న ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు విజయసారథి పిలుపునిచ్చారు. ఏప్రిల్ 1వ తేది నుండి 10వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఐ పేరుతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి పోరాటాలు చేయడమే ఇంటింటికీ సిపిఐ లక్ష్యమన్నారు. కార్యక్రమానికి సిపిఐ సానుభూతిపరులు ప్రజలు మద్దతు ఇచ్చి పార్టీ శ్రేణులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, బైస స్వామి, మారగాని బాలకృష్ణ, మేక వీరన్న, కేదాసు రమేష్, కృష్ణమూర్తి, రమేష్ ,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**ప్రజాపక్షం/నర్సంపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమయిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల రవి విమర్శించారు. సిపిఐ ఖిలా వరంగల్ మండల సమితి సమావేశం శివనగర్ తమ్మర భవన్‌లో ఓర్సు రాజు అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా మేకల రవి హాజరై మాట్లాడారు. దేశంలోని పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఆచరణలో అరకొర అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నాయని ఆరోపించారు. కేంద్రంలో ప్రధాని మోదీ పరిపాలనలో దేశం తిరోగమనానికి వెళ్లిందని, కేవలం ప్రసంగాలు, మాటలు తప్పితే ప్రజలకు చేసేందేమీ లేదని విమర్శించారు. ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న అమెరికా, ఇజ్రాయెల్‌ల సామ్రాజ్యవాదం నశించాలని, ఈ యుద్ధం కారణంగా దేశంలో పెరిగిన గ్యాస్, నిత్యావసరాల ధరలను అదుపు చేయటంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర ఏళ్ల కావొస్తున్న ప్రజాసమస్యలు పరిష్కారంలో జాప్యం కారణంగా రాష్ట్రంలో పూర్తిగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఏజెండాగా సిపిఐ పోరాడుతుందని, ప్రజా పోరాటాల పార్టీ సిపిఐకి చేయూతనివ్వాలన్నారు. ఏప్రిల్ ఒకటి నుండి పది వరకు సిపిఐ ఇంటింటి మాస్ ఫండ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేకల రవి కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఖిలావరంగల్ సహాయకార్యదర్శి తాళ్లపల్లి జాన్ పాల్, మండల కార్యవర్గసభ్యులు సుంకరి భవాని, నల్లతీగల కుమార్, గజవెల్లి చిరంజీవి, ఉప్పుల రవి, మండల సమితి సభ్యులు రోళ్ళ యాదమ్మ, జట్టి విజయలక్ష్మి, కుమార్, బాబు, ఖాజా మైనుద్దీన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు





## చదువుతో పాటు సంస్కారం, మానవతా విలువలు నేర్పించాలి

24 నెలల్లో కేవలం విద్యా వ్యవస్థ బలోపేతం కోసమే రూ.1000 కోట్లు : ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్:** విద్యావర్ధిగా పేరొంది దినదినాభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం శుభసూచకమని, విద్యార్థులకు విలువలతో కూడిన చదువు సంస్కారం, తల్లిదండ్రులపై భక్తిశ్రద్ధలు ఉండేలా విద్యాబోధన చేయాలని దానితో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను రాణించేలా ప్రత్యేక దృష్టి సారించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బచ్ పన్ పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన సొంత ప్రాంతం మీద ఉన్న అభిమానంతో ఎంతో కొంత సేవ చేసుకోవాలన్న దృక్పథంతో ఈ పాఠశాలను ఏర్పాటు చేసిన మీరాసిపల్లి శ్రీనివాసులుకి, ఆయన కుమారులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, స్థానిక కౌన్సిలర్ క్రాంతిగౌడ్, పాఠశాలాయాజమాన్యం, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ను కలిసిన నాయకులు



**ప్రజాపక్షం/ధన్వాడ:** నారాయణపేట్ జిల్లా ధన్వాడ మండల నాయకులు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధన్వాడ మండల నాయకులు ముదిరాజ్, పెద్ద విజయ్ మార్కెట్ వైస్ చైర్మన్, గోని శ్రీనివాస్ మాజీ ఎంపిటిసి, పటేల్ శ్రీనివాస్, గువ్వలపల్లి రాఘవేందర్, నీరటి శివకుమార, జి.రాములు, సి.కురుమార్తి, పి.అనిల్ కుమార్, ఎం.రామచంద్రయ్య, ఎస్.బాలచందర్, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా ఉంటాం

టియుడబ్ల్యుజె (ఐజెయు)



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి:** జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తూ, జర్నలిస్టులకు అండగా ఉంటామని నాగర్ కర్నూల్ జిల్లా టియుడబ్ల్యుజె(ఐజెయు) కార్యదర్శి సరోజ్ సురేష్ అన్నారు. సీనియర్ జర్నలిస్టు కల్లా ఉమా శంకర్ గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కొల్లాపూర్ నియోజక వర్గ టియూడబ్ల్యుజె యూనియన్ నాయకులు మంగళవారం సాతాపూర్ గ్రామంలోని ఉమా శంకర్ గౌడ్ ఇంటికి వెళ్లి ఉమా శంకరను పరామర్శించి, మనోధైర్యం కల్పించి, యూనియన్ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారిలో కొల్లాపూర్ నియోజకవర్గ టియుడబ్ల్యుజె(ఐజెయు) అధ్యక్షులు, కార్యదర్శులు, మాలే రాజేందర్ గౌడ్, బోల్గం వెంకటస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి పి వినోద్ కుమార్ ఈసీ మెంబర్, వెంకటేష్ చారి శేఖర్ ఉన్నారు.

## ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి : గద్వాల ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/గద్వాల :** ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నందు 27 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు గదుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదనపు గదులను, నూతన ప్రధాన గేటును రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల ప్రాంతంలో బాలికల ఉన్నత పాఠశాల 40సంవత్సరాలుపైగా కావడం జరిగిందన్నారు. ఈ పాఠశాలలో ఎంతోమంది విద్యార్థులు ప్రస్తుతం వారు వివిధ ప్రభుత్వ, ప్రవేట్ రంగాలలో అత్యంత స్థాయిలో ఉన్నారని తెలిపారు. గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండలంలో సైనిక గురుకుల పాఠశాలను మంజూరం కావడం జరిగిందని. త్వరలోనే భూమి పూజ చేసి పాఠశాల నిర్మాణ పనులను ప్రారంభించే విధంగా ప్రభుత్వం కృషి చేయడం జరుగుతందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి యాదవ్, వైస్ చైర్మన్ శంకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ బాబర్, నాగులు యాదవ్, రామలింగేశ్వర కాంబ్లే, చంద్రశేఖర్, సులోచనమ్మ, జిల్లా విద్యాధికారి, నాయకులు సాయి శ్యామ్ రెడ్డి, బంగి సుదర్శన్, వెంకటేశ్వర్ రెడ్డి, ఇలియాన్, ముత్యాల రవి, గోవిందు, రంగారెడ్డి, కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు, కాంట్రాక్టర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో కానిస్టేబుల్‌కు సిల్వర్ మెడల్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మండలంలోని పోలెపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కటిక రాజశేఖర్ జాతీయ స్థాయిలో ఫోటో గ్రాఫ్ విభాగాల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈనెల 29 ప్రారంభించమైన 69వ జాతీయ పోలీస్ డ్యూటీ మిట్‌లో హైదరాబాద్ సిటీ అర్మడ్ విభాగంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కటిక రాజశేఖర్ ప్రొఫెషినల్ ఫోటోగ్రఫీ విభాగంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రజిత పతకాన్ని కైవలం చేసుకోవడంతో పాటు, ఫోటో గ్రాఫీ టీం విభాగంలోను రన్నరప్ ట్రోఫీ సాధించాడు. జాతీయ పోలీస్ డ్యూటీ మీటిలో పతకాన్ని సాధించినందుకు హైదరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు, గ్రామస్తులు రాజశేఖర్‌కు అభినందనలు తెలిపారు.

# కొత్త సూగయ్య, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలు వెలకట్టలేనివి

ఉచిత మజ్జిగ, అంబలి కేంద్రం ప్రారంభించిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్:** కొత్తసూగయ్య, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 28వ సంవత్సర వార్షిక మజ్జిగా అంబలి కేంద్రను మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర పాడి పశుసంవర్ధక డెయిరీ క్రీడా మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. కొత్త సూర్యనారాయణగుప్తా ఆధ్వర్యంలో సోదరులు కొత్త శ్రీనివాస్ గుప్తా, కొత్త జగదీశ్ గుప్తా, కొత్త నర్సిములు గుప్తా, డాక్టర్ కిరణ్ తదితరుల సమక్షంలో కొత్తసూగయ్య, రత్నమ్మ చిత్రపటానికి పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, ప్రజలకు ఉచిత మజ్జిగా అంబలి కేంద్రను ప్రారంభించారు. గత 27 సంవత్సరాల నుంచి అంబలి కేంద్రను మక్తల్ పట్టణంలో కొత్త సూగయ్య, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని, దీంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని మంతి వాకిటి శ్రీహరి కొనియాడారు. బీదవారి పెళ్లిళ్లకు, పుస్తెలు, మెట్టలు, బట్టలు, బియ్యం తదితర వస్తువులు పంపిణీ చేస్తున్నామని కొత్త సూర్యనారాయణ గుప్తా తెలిపారు. పేదవిద్యార్థులు చదువుకునేందుకు ఆర్థిక సాయం సైతం అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న కొత్త సూర్యనారాయణగుప్తా, సోదరులకు పలువురు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు బాలక్రిష్టారెడ్డి, లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, బి.చంద్రకాంత్ గౌడ్, బి.కొండయ్య, రాజుల ఆశిరెడ్డి, గణేష్, కట్టా సురేశ్ గుప్తా, కోళ్ల వెంకటేష్, దేవరింటి నరసింహారెడ్డి, గోలపల్లి నారాయణ, చిన్న హనుమంతు, బి.నర్సింలు, అన్వర్, మనన్, కావలి ఆంజనేయులు, వల్లంపల్లి లక్ష్మ ణ్, నీలప్ప, రహీంపటేల్, పి.రంజిత్ రెడ్డి, శుభోదయ రాములు, మందుల నరేందర్, రవికుమార్, అమర్, కల్లూరి గోవర్ధన్, చందాపూర్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

**ఐఎన్‌టిఎస్ఓ ఒలంపియడ్ పరీక్షలో విద్యార్థుల ప్రభంజనం**

మక్తల్ శ్రీచైతన్య పాఠశాల నుంచి ఐఎన్‌టిఎస్ఓ ఒలంపియడ్ పరీక్షలో విద్యార్థుల అద్భుత ఫలితాలు సాధించారని తెలియజేయడానికి ఎంతో గర్వంగా ఉందని పాఠశాల యందు జరిపే ఒలింపియాడ్ ఎగ్జామ్స్ వల్ల ఇది సాధ్యమైందని, పాఠశాలలో ఉండే కరికులం వల్ల ఈ విజయం సాధ్యముందని పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి విద్యార్థులను ఎంతో అభినందించి వారు ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మక్తల్‌కి, వారి తల్లితండ్రులకు, వారి పాఠశాలకి ఎంతో పేరు తేవాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి విజయాలు ఒక్క శ్రీచైతన్యకి సాధ్యమని ఇటువంటి ఫలితాలను అందించి తల్లితండ్రుల కలలను సాధ్యచేస్తుందని తెలిజేస్తూ విద్యార్థులను, పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ను ఉపాధ్యాయుల బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ శాఖ ప్రిన్సిపల్ రామకృష్ణ, అకాడమిక్ కోఆర్డినేటర్ రఘు బాబు, పాఠవాల డీన్ రఘు, ప్రైమరీ ఇంచార్జీ జ్యోతి, ప్రీ ప్రైమరీ ఇంచార్జి మహాలక్ష్మి , ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 'అరైవ్.. అలైవ్' కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు

రోడ్డు భద్రతపై కీలక సూచనలు : ఎస్‌పి



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని మహబూబ్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి హాజరై ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించి అవగాహన సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ఆటోలకు ట్రాఫిక్ నంబర్లు వేయించుకోవడం వల్ల డ్రైవర్లకు, పోలీసులకు గుర్తింపు సులభమవుతుందని, ప్రయాణికులు మరిచిపోయిన వస్తువులను సులభంగా గుర్తించి తిరిగి అందించవచ్చని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ వినియోగం చూపుపై ప్రభావం చూపి ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. అధిక వేగంతో వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలను పిపిటి ద్వారా వివరించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ పాటించాలని సూచించారు. అలాగే పార్కింగ్, బస్ స్టాండ్‌ల వద్ద వాహనాలను సింగిల్ లైన్‌లో పార్క్ చేయాలని సూచించారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన ఆటో డ్రైవర్లకు కళ్లజోళ్లు త్వరలోనే కంటి పరీక్షలు రాగానే పంపిణీ చేయడం జారుతుంది. ఆటో డ్రైవర్లు మంచి పేరు సంపాదించుకుని, ప్రజలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని ఎస్పీ కోరారు.

**రోడ్డు భద్రత- మనందరి బాధ్యత**

సురక్షితంగా ప్రయాణిద్దాం సురక్షితంగా గమ్యాన్ని చేరుదాం ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సిబ్బందికి రెండు నెలల పాటు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు ముందుకు వచ్చిన 'మునాఫ్ మిల్క్ పాయింట్' (విఎన్ఆర్ డెయిరీ) యజమాని మొహమ్మద్ మునాఫ్‌ని జిల్లా ఎస్పీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, బాల్యా నాయక్, 100 మంది ఆటో డ్రైవర్లు, ఇతర ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.2 లక్షలు రైతు రుణమాఫీ చేయాలి: బికెఎస్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** మంగళవారం తాసిల్దార్ కార్యాలయం నారాయణపేట్ నందు భారతీయ కిసాన్ సాంగ్ నారాయణపేట్ పట్టణ మండల కమిటీ పిలుపుమేరకు గతంలో ప్రభుత్వము ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేస్తా అని హామీ ఇచ్చి ఇంతవరకు చేయని కారణంగా బ్యాంకులో రుణాలకు వడ్డీలు పెరిగిపోయి అప్పులు ఎక్కువ కావడం వల్ల రైతాంగం ఆందోళన చెందుతుంది అదేవిధంగా ఈ ప్రాంతలో వ్యవసాయ పంటలు ఆరుగాలం పండించిన అడవి పందులు జింకలు, నెమల్లిలా కోతుల వల్ల పంటలు నాశనం అవుతున్న సందర్భంగా ఇట్టి విషయాన్ని భారతీయ కిసాన్ సాంగ్ దృష్టి సాధించి తాసిల్దార్ అమరేందర్ కృష్ణ వినతి పత్రం సమర్పించడం జరిగినది ఇట్టి విషయాన్ని నగర ఉపాధ్యక్షులు బాపన పల్లి రాము తంగు విశ్వనాథ్ రెడ్డి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గంప ఆధ్వర్యంలో నారాయన పేట్ బైరం కొండ జిల్లాల పూర్ బాజపురం షేర్న పల్లి పేరపల్ల పగిడి మారి గడిమున్నపల్లి సంబంధించిన రైతులు పాల్గొని తాసిల్దార్ ముందు తమ యొక్క ఆవేదన వ్యక్తపరచడం జరిగింది. కాబట్టి ప్రభుత్వం వెంటనే రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేసి రైతు కుటంబాలని ఆదుకోవాలని రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయే కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరుతున్నారు. రైతు ఆర్థికంగా బాగుంటేనే ఈ ప్రాంతం బాగుంటుంది రైతు ఇబ్బంది పడితే ఈ ప్రాంతం అధోగతి అవుతుంది రాత్రింబవళ్లు కష్టపడి పంటలు పండించి నిరంతరంగా ఆహార ధాన్యాలు పండించిన రైతుల బాధలు పరిగణాలకు తీసుకొని వెంటనే మాఫీకి అనుమతి ఇవ్వాలని ఆదేవిధంగా ఈ ప్రాంత ఆడవి జంతువులను నిర్మూలించి ఈ ప్రాంత నుండి తరలించాలని ప్రభుత్వానికి వన్నివించడం జరిగింది.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


మహాలక్ష్మీ పథకంతో లాభాల్లోకి ఆర్‌టిసి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఆర్టీసీ సంస్థ మహాలక్ష్మి పథకంతో లాభాల్లో ముందుకు సాగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం డ్యాం వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తుండడంతో నాగర్ కర్నూల్ జిల్లా ప్రజలకు తాగునీరు సమస్య తీవ్ర అవుతుందని పలు మార్లు తెలియజేసిన ఏపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు ఆధ్వర్యంలో మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి వద్దకు 300 వాహనాలలో జిల్లా రైతాంగంతో కలిసి ప్రజా ప్రతినిధులందరూ ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని సోమవారం ప్రకటన చేయడంతో ఎపి ప్రభుత్వం రాత్రి పది గంటల సమయంలో విద్యుత్ ఉత్పత్తిని ఆపడం జరిగిందని అందుకు ఎపి ప్రభుత్వానికి ధన్యావాదాలు తెలుపుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మళ్లీ తిరిగి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తే లక్షలాదిమంది రైతాంగంతో ధర్నా చేపడతామని జిల్లా రైతాండం ప్రజల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ లాభాల బాట పట్టిందని కల్వకుర్తి డిపోలోనే కోటి 49 లక్షల మంది ప్రయాణం చేశారని, ఉమ్మడి జిల్లాలో 23కోట్ల 20లక్షల మంది ప్రయాణం చేశారని అందుకు 92కోట్ల నిధులు ఆర్టీసీకి ప్రభుత్వం సమయంలో విడుదల చేయడం జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా 249 కోట్ల మందికి పైగా మహాలక్ష్మి పథకం కింద మహిళలు ప్రయాణం చేశారని అందుకు ఆర్టీసీకి పదివేల కోట్లకు పైగా నిధులను ఆర్టీసీకి విడుదల చేయడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి కమిటీ సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేయడంతో పాటు ఆసుపత్రి వైద్యులు అడిగిన సౌకర్యాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. వంగూరు మండల మహిళా సమైక్యకు ఇచ్చిన ఆర్టీసీ బస్సు వల్ల ఆ సంఘానికి 50 లక్షల లాభం చేకూరిందని, వెల్దండ మండల సమైక్యకు బస్సు అందించడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ షాన్ వాజ్ ఖాన్, కౌన్సిలర్లు రాజేష్ కుమార్, కరుణాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి అశోక్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్ యాదవ్, చంద్రకాంత్ రెడ్డి, గణేష్, పుస్తకాల రాహుల్ తదితరులు ఉన్నారు.

## సిఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/అమరచింత:** అమరచింత మండల పరిధిలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయ ఆవరణలో పశు సంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, టిపిసిసి కల్లుగీత సెల్ డిప్మార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ ఆదేశానుసారంగా కాంగ్రెస్ శ్రేణులు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాల ద్వారా అభివృద్ధి జరుగుతున్నదని తెలిపారు. మండల పరిధిలోని 33 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు విడుదలైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎస్.ఎం.అరుణ్ కుమార్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్యామ్ కుమార్, ఎస్పీ సెల్ మండల అధ్యక్షుడు ప్రకాశం, మైనారిటీ సెల్ అధ్యక్షుడు తౌఫిక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు జింక రవి యాదవ్, ముని, కురుమన్న, మోహన్ రెడ్డి, నరేష్ వీరేష్ గౌడ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత హక్కుల పోరాట సమితి నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కిరణ్ కుమార్, బండి లక్ష్మీ పతి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్:** దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్, జిల్లా రెండవ మహాసభలలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన డిహెచ్ పిఎస్ మహాసభలో జిల్లా అధ్యక్షునిగా తప్పిట కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బండి లక్ష్మీ పతితో పాటు ఉపాధ్యక్షులుగా లక్ష్మీ నారాయన, వంకేశ్వరం శ్రీను, సహాయ కార్యదర్శులుగా బిజ్జ శివకుమార్, చిన్నపాగా శ్రీను, కోశాధికారిగా కొత్త రామస్వామి 28 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రింగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో కుల వివక్షకు అంటరానితనానికి వ్యతిరేకంగా సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం దళిత హక్కుల సాధన కోసం ఉధృతమైన పోరాటాలు చేస్తామని పాలకవర్గాలు అవలంబిస్తున్న దళిత వ్యతిరేక చర్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. మాపై నమ్మకం ఉంచి మిమ్మల్ని ఎన్నుకున్నటువంటి రాష్ట్ర నాయకత్వానికి జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## ల్యాబ్ టెక్నీషియన్ లేక రోగుల ఇక్కట్లు

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ సేవలు సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి వీపనగండ్ల చిన్నంబావి మండలాలకు ఏకైక ప్రభుత్వ ఆసుపత్రిగా ఉన్న ఈ ఆసుపత్రికి ప్రతిరోజు వందలాది మంది రోగులు వివిధ రక్త పరీక్షలు కోసం వస్తున్నారు. అయితే, ల్యాబ్ టెక్నీషియన్ సమయానికి విధులకు హాజరు కాకపోవడం వల్ల పరీక్షలు ఆలస్యమవుతూ రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యేకించి మధుమేహం (షుగర్) వ్యాధిగ్రస్తులు ఉదయం ఖాళీ కడుపుతో, అలాగే భోజనం అనంతరం రక్తం మూత్రపరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. కానీ ల్యాబ్ టెక్నీషియన్ ఉదయం 10 గంటలు దాటిన తరువాత మాత్ర మే విధులకు హాజరుకావడం వల్ల రోగులు ఉదయం నుంచే ఆసుపత్రి ప్రాంగణంలో వేచి ఉండాల్సి వస్తోంది. అంతేకాక, గత 15 రోజులుగా ల్యాబ్‌లో సీబీపీ మిష న్ చెడిపోయి ఉన్నప్పటికీ, దానిని మరమ్మత్తు చేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ల్యాబ్ సేవలు సరిగా అందకపోవడంతో కొందరు రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, ల్యాబ్ టెక్నీషియన్ సమయానికి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, సిబిపి మిషన్‌ను వెంటనే మరమ్మత్తు చేయించాలని ప్రజలు డిమాండు చేశారు.

## అభివృద్ధి కోసమే గ్రామ సర్పంచు వార్డు బాట



**ప్రజాపక్షం/చిన్నంబావి:** అమ్మాయిపల్లి గ్రామంలో గ్రామ అభివృద్ధి కొరకై సర్పంచు వార్డు సభ్యులు గ్రామ నాయకులు వార్డు బాట అనే పేరుతో వివిధ సమస్యల పరిష్కారానికి వార్డు బాట పేరుతో ముందుకు సాగారు. గ్రామంలో వీధి దీపాలు సంబంధిత స్తంభాలు లేని చోట పరిశీలించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయుటకు అలాగే గ్రామంలో రోడ్లపై మురుగునీరు పారకుండా ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తూ ప్రజలకు తెలియజేశారు. నడుస్తున్న ఎండాకాల సమయాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామంలో ఏ ఇంటికి కూడా నీటి సమస్య ఉండకూడదని అమ్మాయిపల్లి గ్రామ పొలిమేర దగ్గర ఉన్న మోటార్ కు చుట్టుపక్కల ఇళ్లకు నీటి కొరత ఉండోద్దని పైప్ లైన్ ద్వారా నీరు ఇళ్లకు వెళ్లేలా లైన్ కనెక్షన్ చేయించడం జరిగింది. అలాగే వార్డు బాటలో సమస్యలు పరిష్కరిస్తూ ఆపద ఉందంటే మీ వెన్నంటే ఉంటానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన సర్పంచు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న పోతుగంటి జగదీష్ ని పరామర్శించి గ్రామ సర్పంచు ఉపసర్పంచు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు మాదగొని కవిత ప్రభంజన్ గౌడ్, ఉపసర్పంచు ఆరేపల్లి మాధవి మాధవరెడ్డి, వార్డు మెంబర్లు అల్లెనగౌడ్, మహేశ్వరమ్మ, సత్యరెడ్డి, దర్గయ్య స్వేరో, పావని కవీందర్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, నాయకులు సుకుమార్, బిట్టు, వెంకటేశ్ నాయుడు, తారాచంద్, పబ్బు రామన్ గౌడ్, పెద్దిరెడ్డి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/గద్వాల రూరల్:** గద్వాల పట్టణ అభివృద్ధికే స్థానిక ప్రజాప్రతినిధులు, పురపాలక సంఘం అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గద్వాల మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని మంగళవారం స్థానిక అక్షయ బంకిట్ హాల్లో పుర చైర్ పర్సన్ జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తో పాటు హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం నిర్వహిస్తున్న మొదటి బడ్జెట్ సమావేశం కావడంతో నూతన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. గద్వాల మున్సిపాలిటీ ఆస్తిపన్నుల వసూళ్లలో లక్ష్యం కంటే ఎక్కువగానే వసూలు చేయడంతో పర్ఫార్మెన్స్ గ్రాంట్స్‌కు ఎంపిక కావడం జరిగిందని సంబంధిత అధికారులకు అభినందించారు. ప్రభుత్వం నుంచి గద్వాల మున్సిపాలిటీకి రూ.8.5కోట్ల స్టాంపు డ్యూటీ నిధులు రావాల్సి ఉందని, ఇతర ఆదాయ మార్గాల్లో రూ.2.3 కోట్లకు పైగా దాయం వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనల కట్టుదిట్ట అమలు, పార్కుల నిర్వహణ, పట్టణ సుందరీకరణ, తదితర అభివృద్ధి పనులు చేయాల్సి ఉందన్నారు. ముఖ్యమైన జంక్షన్ల వద్ద భారీ ప్లెక్సిలను ఉంచడంతో ఇబ్బందికరంగా ఉందని, ప్లెక్సీలతో పాటు ప్లాస్టిక్ నివారణకు కౌన్సిల్లో తీర్మానం చేసి అమలు చేయాల్సిందిగా సూచించారు. మున్సిపాలిటీలో ప్రతి ఉద్యోగి ఇతర కార్మికులు బయోమెట్రిక్ విధానంలో హాజరు వేయాలని, 280 మంది కార్మికులు ఉండడంతో మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయ డం, తాగు నీటి వృధాను నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందు కెళ్లాలన్నారు. టౌన్ ప్లానింక్, పబ్లిక్, హెల్త్, ఇంజనీరింగ్ తదితర విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గద్వాల మున్సిపాలిటీ దుకాణాల ఆదాయం కూడా పెరిగేందుకు నిబంధనల ప్రకారం వేలంపాట నిర్వహించాలని, జనరల్ ఫండ్ సద్వినియెగం చేసుకునేలా ముందు కెళ్లాలన్నారు. మున్సిపాలిటీ అవుట్సోర్సింగ్ కార్మికులకు జీతాలు, విద్యుత్ బిల్లులు చెల్లింపు శానిటేషన్, తాగునీటి సరఫరాకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు పార్టీలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా సహకరించాలన్నారు. గత కౌన్సిల్ సమయంలో గద్వాల పట్టణ అభివృద్ధికి రూ.18కోట్ల నిధులను ఖర్చు పెట్టడం జరిగిందని, భవిష్యత్తులోనూ గద్వాల మున్సిపాలిటీకి ఎక్కువ నిధులు వచ్చేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు. కౌన్సిలర్లు నిరంతరం వార్డుల్లో తిరుగుతుంటారు కాబట్టి ప్రజలు సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా బాధ్యత తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మున్సిపాలిటీ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఇతర అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



## మహాలక్ష్మీ పథకం విజయవంతం

### ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.వెయ్యికోట్లు ఆదా : ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** ప్రజా పాలన ప్రగతి పథం అనే నినాదంతో ప్రారంభించిన మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి వెయ్యి కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ దేవరకొండ డిపో ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిధిగా హాజరయిన ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వారం రోజుల్లోనే మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈపథకం ద్వారా మహిళలు ఆర్థిక భారం లేకుండా స్వేచ్ఛగా ప్రయాణిస్తూ, తమ దైనందిన అవసరాలను సులభంగా నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇకపై కూడా ప్రజల సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వం అనేక పథకాలను అమలుచేస్తుందని, ప్రతి మహిళ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందిన మహిళలను ఆయన శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటి చైర్మన్ జమున మాధవరెడ్డి, ఆర్ఎం నల్గొండ బీంరెడ్డి, డిఎం విజయ కుమారి, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి, ఆర్టీసి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలి

### రాష్ట్ర క్వాలిటీ ఆడిట్ అధికారి ఫయాజ్



**ప్రజాపక్షం/నకిరేకల్ :** అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలను కాపాడే 108 అంబులెన్స్ సేవలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండి భరోసా కల్పించాలని రాష్ట్ర క్వాలిటీ ఆడిట్ అధికారి ఫయాజ్ అన్నారు. మంగళవారం శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న 108 అంబులెన్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాల పనితీరు, ఆక్సిజన్ సిలిండర్లు, ఔషధ నిల్వలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం లేకుండా స్పందించేలా అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు పరికరాలను తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ప్రజలకు 108 సేవలు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఈటీ రమేష్, హేమంత్, పైలట్ యాదగిరి, సమీర్ బాబా పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పని తీరు, స్టేషన్ పరిధిలోని పరిస్థితులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. అదేవిధంగా సమోదైన కేసుల గురించి విరాలు, స్టేషన్ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించరాదని ఎస్పీ హెచ్చరించారు. పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట దేవరకొండ డిఎస్పీ శ్రీనివాస్‌రావు నాంపల్లి సీఐ రాజు ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ రామ్మూర్తి, సిబ్బంది ఉన్నారు.

## దుర్భాషలాడిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల):** దామరచర్ల బీసీ మహిళా గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఆకలి వేస్తోంది మేడం అని చెప్పినందుకు వారిపై అమానుషంగా దుర్భాషలాడటం ఘోరమైన చర్య అని సిపిఐ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో విద్యార్థినులు ఆకలితో బాధపడుతూ ఆహారం కోరగా, వారికి కనికరం చూపాల్సిన ఉపాధ్యాయురాలు దుర్భాషలాడి, మోకాళ్లపై నిలబెట్టడం నియంతృత్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. గత 20 రోజులుగా విద్యార్థులకు అందాల్సిన గుడ్లు, చికెన్, పండ్లు వంటి పోషకాహారం సరైన విధంగా అందకపోవడంపై ప్రశ్నించినందుకు ఇలా ప్రవర్తించడం శోచనీయమని పేర్కొన్నారు. తక్షణమే సంబంధిత ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేసి, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే మెనూ ప్రకారం విద్యార్థులకు అందాల్సిన ఆహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## కష్టపడి చదవి ఎదగాలి



**ప్రజాపక్షం/హాలియా:** జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే కష్టపడి చదివి ఎదగాలని జిల్లా విద్యాధికారి బిక్షపతి అన్నారు. మంగళవారం హాలియాలోని బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఓ బిక్షపతి మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రతను పాటించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవాలన్నారు. ప్రస్తుత రోజుల్లో చదువుకు ఎంతో ప్రాముఖ్యత ఉందని దానిని గుర్తించి బాలికలు చదువుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. వసతి గృహాల నిర్వహణ పట్ల డిఇఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల విద్యాధికారి సీనయ్య ఉన్నారు.

## ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి



డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్

**ప్రజాపక్షం/మోత్కూర్ :** దేశంలో ఉపాధి అవకాశాల స్వరూపం మారుతున్న ఈ సమయంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలు అత్యవసరమని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగం క్రమంగా క్షీణిస్తుండగా, ప్రైవేట్ రంగం విస్తరిస్తున్న పరిస్థితుల్లో దళితులు, వెనుకబడిన వర్గాలకు తగిన అవకాశాలు దక్కకపోవడం సామాజిక న్యాయానికి విరుద్ధమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా 2వ జిల్లా మహా సభలు మంగళవారం నాడు మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో సిపిఐ కార్యాలయం (కెఆర్ భవనం)లో జరిగాయి. కాసపాక దయాకర్ అధ్యక్షతన జరిగిన మహాసభకు ముఖ్య అతిథి తెలంగాణదళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టంగా చెబుతున్నప్పటికీ, ప్రైవేట్ రంగంలో ఈ సూత్రాలు అమలు కావడం లేదని ఆయన విమర్శించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రైవేట్ రంగం దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. కానీ అక్కడ రిజర్వేషన్లు లేకపోవడం వల్ల దళిత యువత ఉపాధి అవకాశాల నుండి దూరమవుతున్నారు. ఇది కేవలం ఉపాధి సమస్య కాదు ఇది సమానత్వం, గౌరవం, హక్కుల సమస్య అని స్పష్టం చేశారు. ప్రైవేట్ కంపెనీల్లో నియామకాల్లో పారదర్శకత ఉండేలా చట్టపరమైన మార్పులు తీసుకురావాలని, ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందే కంపెనీలకు రిజర్వేషన్ విధానం తప్పనిసరి చేయాలని ఆయన సూచించారు. అలాగే ప్రైవేట్ రంగంలో కుల వివక్షను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, అమలును పర్యవేక్షించేందుకు స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండవ మహా సభలు ఏప్రిల్ 17,18 వరంగల్ జిల్లాలో జరగనుంది. ఈ మహాసభలకు 33 జిల్లా నుండి 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అని ఆయన చెప్పారు. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా యనాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బొలగని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి, నాయకులు ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శాంతికుమార్, ఇంజ హేమలత, కిష్టమ్మా ,జిట్టా రాములు, న్యాతకాని కిష్టమ్మా, భాగ్యమ్మ, కట్ల యాదగిరి, చెడే సుందర్, బాల నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.



## పండరినాద్‌కు ఘన సన్మానం

### క్రమశిక్షణతో విధులు నిర్వహించి సహచరులకు ఆదర్శం : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ ఆర్‌టిసి డిపో కంట్రోలర్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన జంపాల పండరినాద్ ఎల్లమ్మలకు సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆర్‌టిసిలో దీర్ఘకాలం నిబద్ధతతో సేవలందించిన పండరినాద్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితమంతా క్రమశిక్షణతో విధులు నిర్వహించి, సహచరులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆయన భవిష్యత్ జీవితం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షిస్తూ, రాబోయే రోజులలో ప్రజా ఉద్యమాల్లో కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎన్‌ఆర్‌సి రాజు, బి.వెంకటయ్య, ప్రముఖ న్యాయవాది గుర్రం వెంకట్ రెడ్డి, కస్తాల వెంకన్న, జిల్లా యాదయ్యతో పాటు పలువురు ఆర్‌టిసి సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## వివాదాస్పద భూమిపై ఆర్‌డిఓ విచారణ

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మర్రిగూడ సమీపంలోని సర్వే నంబర్ 5లో భూమి వివాదం నెలకొనడంతో మంగళవారం చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. ఇరువర్గాల సమక్షంలో భూమిని పరిశీలించిన అధికారులు, ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నందున ప్లాట్ బుక్ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కేవలం ఖాళీ వ్యవసాయ భూములకే ప్లాట్ బుక్‌కు అర్హత ఉంటుందని, డివిజన్ సర్వేయర్‌తో సర్వే అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ఆర్డీవో పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇళ్ల స్థలాల యజమానులు, స్థానికులు విచారణలో పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### జిల్లా ఎస్‌పి కె.నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని, వారిని జైలుకు పంపడంతోపాటు వాహనాలు కూడా సీజ్ చేస్తామని, ఏప్రిల్ 1వ తేదీ నుండి నిబంధనలు పటిష్టంగా అమలు చేస్తామని జిల్లా ఎస్‌పి కె.నరసింహ తెలిపారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద స్థానిక ప్రజలకు, ఆటో డ్రైవర్లకు, టాక్సీ డ్రైవర్లకు సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నియమాలు పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ప్రతి ప్రయాణం సురక్షితంగా గమ్యం చేరాలన్నారు. డ్రైవర్ బాధ్యతగా ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చాలని సూచించారు. వాహనాలు నడుపుతున్న సమయంలో రోడ్డుపై ఉన్న పరిస్థితులను అంచనా వేస్తూ, కాలినడకన వెళ్లు వారిని గమనిస్తూ ముందుకు సాగాలన్నారు. టాక్సీ, ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని, వాహనానికి సంబంధించి అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టి రవాణా చేయకూడదని తెలిపారు. డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే రోడ్డుపై ఉన్న పరిస్థితులను అంచనా వేయలేక ప్రమాదాల బారినపడతారని అన్నారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించేవారు హెల్మెట్ తప్పకుండా ధరించాలని కోరారు. కార్లు పెద్ద వాహనాల్లో ప్రయాణం చేసే సమయంలో సీట్‌బెల్ట్ పెట్టుకోవడం సురక్షితం, నిదానంగా వాహనాలను నడుపుతూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యం చేరాలని సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, పట్టణ ఎస్ఐలు ఏడుకొండలు,ఐలయ్య,పౌరులు, ఆటో, ట్యాక్సీడ్రైవర్లు పాల్గొన్నారు.

## నానో ఎరువుల ద్వారా సుస్థిర వ్యవసాయం వైపు ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్




**ప్రజాపక్షం/తిప్పర్తి :** నానో ఎరువుల ద్వారా సుస్థిర వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన తిప్పర్తి మండలం,దుప్పలపల్లి రైతు వేదికలో వ్యవసాయ అధికారులకుద్దేశించి నానో ఎరువుల వినియోగం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించడంపై నిర్వహించిన సాంకేతిక ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, డ్రోన్ సాంకేతికత ద్వారా నానో యూరియాను సమర్థవంతంగా ఉపయోగించి పంట దిగుబడులను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు సన్నరకం వరి పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. వానకాలం సీజన్‌లో వ్యవసాయ యంత్రాల వినియోగాన్ని పెంచేందుకు ముందుగానే ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులను రైతులకు వివరించి వేరుశనగ, పెసలు మినుములు వంటి పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. జిల్లాకు కేటాయించిన సుమారు 10 వేల సాయిల్ హెల్త్ కార్డులు త్వరితగతిన రైతులకు అందజేయాలని, భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరచే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా ఉద్యాన శాఖ డిడి సుభాషిణి, తిప్పర్తి మండల ఏఈఓ సన్నీ రాజ్, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

### జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నూతన పాలకవర్గం హుజూర్ నగర్ మున్సిపాలిటిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మున్సిపాలిటి అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ కోరారు. హుజూర్‌నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026–27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌పై మంగళవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి సత్ఫాలితాలు రాబట్టాలని కోరారు. మున్సిపాలిటి 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందిచడం జరిగిందని వివరించారు. హుజూర్ నగర్ మున్సిపాలిటిని దశల వారిగా అభివృద్ధి చేసుకునేందుకు పాలకవర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్నసమస్యలను ప్రణాళికబద్దంగా పరిష్కరించేందుకు యాక్షన్‌ప్లాన్ తయారు చేసుకుని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలంలో దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆర్డీవోకు సూచించారు. వార్డులలో ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళ భద్రత కల్పించడం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటిలో సమర్థవంతంగా నిర్వహించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీ శుభ్రపర్చడం, రోడ్లను శుభ్రం చేయడం వంటి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్సు పథకం బలమైన అడుగు



జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహిళల ఆర్థిక,సామాజిక భద్రతతో పాటు స్వావలంబనకు ఉచిత బస్సు పథకం బలమైన అడుగని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ ఆర్‌టిసి బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.10వేల కోట్ల ఆదా సాధించిన సందర్భంగా మహిళలను సన్మానించే కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలకు గణనీయమైన ఆర్థిక లాభం కలుగుతోందన్నారు. 2023 డిసెంబర్‌లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా, మహిళలు మరియు విద్యార్థులు కలిసి దాదాపు రూ.10 వేల కోట్ల మేర ఆదా చేసుకున్నారని తెలిపారు. జిల్లాస్థాయిలోనే సుమారు రూ.340 కోట్ల వరకు ఆదా కావడం విశేషమన్నారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు నెలకు సగటున రూ.5,000 వరకు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ జాన్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సీడీపీఓ హరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిపో మేనేజర్ రమణ హుస్సేన్ పాల్గొన్నారు.

**ఎస్‌సి, ఎస్‌టి సమస్యల పరిష్కారానికి సమర్థవంతంగా పనిచేయాలి**

షెడ్యూల్డ్ కులాలు, తెగల సమస్యల పరిష్కారానికి ఎస్‌సి, ఎస్‌టి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమర్థంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు, అంటరానితనం నివారణకు చట్టాలు ఉన్నాయని, వాటి అమలులో సభ్యులు చురుకుగా వ్యవహరించాలని అన్నారు. జిల్లాలో జరిగిన అకృత్యాల కేసులను సమీక్షించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలపై దాడుల కేసులను వెంటనే నమోదు చేసి 60 రోజుల్లో విచారణ పూర్తి చేస్తున్నామని చెప్పారు. వివక్షత, దేవాలయ ప్రవేశం నిరాకరణ వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## బెస్ట్ లీడర్ సుమతమ్మకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/నాంపల్లి :** అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఏఐటీయుసి)రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎడమ సుమతమ్మ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ బెస్ట్ లీడర్ అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం మండలంలోని సుంకిశాల గ్రామ సెక్టార్‌లో అంగన్వాడి కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు,హెల్పర్లు కలిసి సుమతమ్మకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని తిరుమలగిరిగ్రామానికి చెందిన ప్రసన్నలతను బెస్ట్ అంగన్‌వాడీ టీచర్‌గా సత్కరించారు. సుమతమ్మ మాట్లాడుతూ అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారానికి తాను చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అవార్డు ప్రదానం చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## సాగర్‌ను సందర్శించిన కేంద్ర అధికారుల బృందం




**ప్రజాపక్షం/నందికొండ :** అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన నాగార్జునసాగర్‌ను మంగళవారం కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం సందర్శించింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ అమర్జిత్ సింగ్ ఆధ్వర్యంలో సుమారు 70 మంది అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు ఈ పర్యటనలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో వారం రోజులుగా శిక్షణ పొందుతున్న ఈ బృందం 'భారత్ దర్శన్' కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్‌కు చేరుకుంది. వీరికి ప్రోటోకాల్ ఆర్ఐ దండ శ్రీనివాస్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం టూరిజం లాంచ్‌లో నాగార్జునకొండ మ్యూజియం, నాగార్జునసాగర్ డ్యామ్‌ను సందర్శించారు. తరువాత బుద్ధవనంలోని బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్తూపవనాలను దర్శించి, మహాస్తూపం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను ప్రతిబింబించే లఘు చిత్రాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శాసన ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర బౌద్ధ ధర్మంపై సమగ్రంగా వివరించారు. అనంతరం మహాస్తూపం ధ్యాన మందిరంలో అధికారులు ధ్యానం నిర్వహించారు. ఈ పర్యటనలో స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునకొండ, నాగార్జునసాగర్ డ్యామ్, బుద్ధవనం చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని వివరించారు.

## ఇండ్ల స్థలాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న2160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ ఇందిరమ్మ కాలనీని, అంతర్గత రోడ్లు, సభా స్థలిని, మొక్కలు నాటడం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి, మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను అదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేనివారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావులేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, హౌసింగ్ పిడి సిద్దార్ధ, మిషన్ భగీరథ కరుణాకర్‌రెడ్డి, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా శాఖలు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
బుధవారం
01-04-2026
www.prajapaksham.in

‘ టాలీవుడ్ నెంబర్ వన్ నిర్మాత దిల్ రాజు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి దర్శకత్వంలో వస్తున్న సినిమాలి హీరోయిన్ ఖరారైంది. ఏప్రిల్ లో ప్రారంభం కానున్న ఈ సినిమాలో నయన తారా హీరోయిన్‌గా నటించనుంది ’

రీల్

# ‘23’ సినిమాకు గద్దర్ అవార్డు అభినందనీయం




మల్లేశం, మెట్రో 8ఎఎం వంటి ఆలోచనాత్మక సినిమాలను రూపందించిన దర్శకుడు రాజ్ రాచకొండ రూపొందించిన తాజా చిత్రం 23(ఇరవై మూడు). నేరస్థులలో వచ్చే పరివర్తన నేరాలను తగ్గిస్తుందనే కథ అంశంతో రూపొందిన ‘23’ సినిమా గత ఏడాది విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో ఇటీవల గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డును దక్కించుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందానికి జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సౌమ్యమిశ్రా మాట్లాడుతూ ఈ సినిమా చూసాను అది చాలా ప్రభావవంతంగా ఉంది. ఈ ప్రయత్నం చేసిన టీంమ్‌ను అభినందిస్తున్నాను. నేరస్థుల పరివర్తన అనే అంశాలు కథలో బాగా పొందుపరిచారు. జైలు జీవితాలను ఇంత వాస్తవికతంగా తెరమీద ఇప్పటి వరకూ చూపలేదు. ది షాషాంక్ రిడెంప్షన్ వంటి గొప్ప చిత్రాల సరసన నిలబడే చిత్రం 23. ఈ సినిమా ఖచ్చితంగా ఖైదీలకు ప్రదర్శించేందుకు ఏర్పాటు చేస్తాం. కొందరిలో మార్పు వచ్చినా అది ఈ సినిమా సాధించిన గొప్ప విజయం. 23 చిత్రం తెలంగాణ గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు గెలుచుకున్నందుకు అభినందనలు అని చెప్పారు. దర్శకుడు రాజ్ మాట్లాడుతూ ఈ ప్రయాణంలో తోడు ఉన్న టీంకి కృతజ్ఞతలు. ఈ సినిమా ప్రయాణం చాలా ప్రత్యేకం. గద్దర్ అవార్డ్స్ జ్యూరీకి థాంక్స్. ఈ నిర్మించిన ప్రయోజనం నెరవేరాలంటే జైళ్లలో ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వంని కోరుకుంటున్నాను. మా భూమి సినిమా దర్శకుడు బి. నర్సింగ రావు మాట్లాడుతూ ‘23’ వంటి సినిమాలను ప్రభుత్వం ప్రోత్సహం ఇవ్వాలి. మాభూమి, దాసి వంటి వాస్తవికత దృక్పథం ఉన్న సినిమాలు తర్వాత ఆ పరంపర కొనసాగలేదు. ఇప్పుడు 23వంటి సినిమాలు వస్తునందుకు ఆనందంగా ఉంది. చిలకలూరిపేట బస్సు దహనం ఘటన ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. ఈ కేసులో ఉన్న నిందితుల కథనే సినిమా చూపిస్తుంది. ఆ నేరం ఉద్దేశపూర్వకంగా చేయబడింది కాదు. కానీ ఉద్దేశపూర్వకంగా హత్యలు చేసిన అనేక మంది విడుదలైనప్పటికీ, ఈ కేసులో ఉన్నవారికి ఇప్పటికీ ఉపశమనం లభించ లేదు అనే కథతో తీశారు. ఈ కార్యక్రమంలో డా.బీనా చింతలపురి, నటుడు తాగుబోతు రమేష్, రచయిత భరద్వాజ్ పాల్గొన్నారు.

# ‘పట్టుకో బాబా’ పాట ఆవిష్కరణ



సీనియర్ దర్శకులు మహేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన ‘పితాపురంలో & అలా మొదలైంది’ చిత్రం ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. డాక్టర్ రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ఇందులో ప్రధాన తారాగణం. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్ పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో శ్రీరామ్ తపస్వి రాసిన 'పట్టుకో బాబా' పాటను ప్రముఖ దర్శకుడు కొరటాల శివ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొరటాల శివ మాట్లాడుతూ చంద్ర మహేష్ అప్పట్లో తీసిన బ్లాక్ బస్టర్ 'ప్రేయసి రావే' కి నేను రైటింగ్ అసిస్టెంట్ గా పని చేశాను. ఆ తర్వాత ఆయన తీసిన మరికొన్ని చిత్రాలకు కూడా నేను పని చేశాను. అందుకే ఈ పాటను ఆవిష్కరిస్తున్నందుకు చాలా ఆనంద పడుతున్నాను. ఇవాల్టి యువతరం ప్రేమ విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, తల్లితండ్రులతో వాళ్ళకున్న కమ్యూనికేషన్ గ్యాప్‌ని చర్చిస్తూ రిలేషన్ షిప్స్, అండర్‌స్టాండింగ్స్ నేపథ్యంలో ఈ సినిమా తీయడం చాలా మంచి విషయం. ఎందుకంటే ఇలాంటి సినిమాలు ఇప్పుడు అవసరం. దర్శకుడు చంద్ర మహేష్ సెన్సిబిలిటీస్ గురించి నాకు తెలుసు.
దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడుతూ ‘ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ కి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. సినిమా ఫస్ట్ కాపీ తో సహా సిద్ధమయింది. ఏప్రిల్ లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం అని తెలిపారు. ఈ చిత్రానికి కథ: ఆకుల సురేష్ పటేల్, స్టోరీ దెవలప్మెంట్ డైలాగ్స్ : శ్రీరామ్ ఏదోటి, ఎడిటర్: సత్యనారాయణ, మ్యూజిక్ : క్రిష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అంజి సంద్రాల, నిర్మాతలు: దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, మురళీ (గోదారి కిట్టయ్య), స్క్రీన్ ప్లే డైరెక్షన్: మహేష్ చంద్ర .

# సల్మాన్‌ఖాన్ సరసన నయన తార

టాలీవుడ్ నెంబర్ వన్ నిర్మాత దిల్ రాజు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్, వంశీ పైడిపల్లి దర్శకత్వంలో వస్తున్న సినిమాలి హీరోయిన్ ఖరారైంది. ఏప్రిల్ లో ప్రారంభం కానున్న ఈ సినిమాలో నయన తారా హీరోయిన్‌గా నటించనుంది. ఇటీవల తెలుగులో హిట్ అయిన మన శంకర వర ప్రసాద్ గారు సినిమాలో నయన తారా నటించిన విషయం తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమా నిర్మిస్తున్నారు. బిగ్ స్కేల్ ఎంటర్‌టైనర్స్‌ను ఎమోషన్స్‌తో మేళవిస్తూ చిత్రాలను రూపొందించే దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. వంశీ పైడిపల్లి. ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్, విజయ్ వంటి అగ్ర హీరోలతో పనిచేసి, విభిన్న జానర్స్‌లో తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన ‘మహర్షి’ జాతీయ అవార్డు సాధించడం ఆయన విజన్‌కి నిదర్శనం.




శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై. 60కి పైగా చిత్రాలను నిర్మించిన దిల్ రాజు కంటెంట్, కమర్షియల్ విజయాలతో సక్సెస్ ఫుల్‌గా నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. ‘మహర్షి’, ‘శతమానం భవతి’ చిత్రాలకు జాతీయ అవార్డులు అందుకోవడం ఆయన క్లారిటికి నిదర్శనం. ఈ ప్రాజెక్ట్ ద్వారా సల్మాన్ ఖాన్ తొలిసారి వంశీ పైడిపల్లి – దిల్ రాజుతో కలిసి పని చేయబోతున్నారు. ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు సల్మాన్ ఖాన్ మ్యాసీవ్ స్క్రీన్ ప్రెజెన్స్, వంశీ పైడిపల్లి స్పెషల్ స్టోరీ టెల్లింగ్, దిల్ రాజు గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్ కలిసిన ఈ సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన థియేట్రికల్ అనుభూతిని అందించనుంది.

# ‘గుర్తుందా’ సాంగ్ లాంచ్



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా ‘కలర్ ఫొటో‘, ‘బేబి’ వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్.కె.ఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న ‘చెన్నై లవ్ స్టోరీ‘ సినిమాకు బిజినెస్ పరంగా మంచి క్రేజ్ ఏర్పడుతోంది. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది. మెలొడీ బ్రహ్మ మణిశర్మ ‘చెన్నై లవ్ స్టోరీ‘ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా నుంచి గుర్తుందా సాంగ్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ మేము చెప్పింది గొప్ప అనే అహాన్ని మరచి ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం పనిచేశారు. ఈ సాంగ్ కోసం నేను పల్లవి రాశాక మణిశర్మ సంగీతాన్ని అందించారు, చరణం మణిశర్మ కంపోజ్ చేశాక నేను లిరిక్స్ రాశాను. ఎలాంటి ఈగో లేకుండా మేమంతా వర్క్ చేశాం అని అన్నారు. దర్శక నిర్మాత సాయి రాజేశ్ మాట్లాడుతూ బేబి మూవీ విజయం తర్వాత మేము డబ్బుల వెనక పరుగు పెట్టలేదు. ఒక మంచి కథతో మళ్లీ మూవీ చేయాలని అనుకున్నాం. నా మనసుకు నచ్చిన ఒక కథను రాసుకున్నాను అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ మాట్లాడుతూ మా సాయి రాజేశ్‌తో నాకు పరిచయం లేదు. ఆయన ఈ మూవీ కోసం వచ్చినప్పుడు బేబి డైరెక్టర్ అని తెలిసింది. నాతో ఏం పని ఉంటుందని అనుకున్నా. ఆయన కలిసి చెన్నై లవ్‌స్టోరీ మూవీకి మ్యూజిక్ చేయాలని అడిగారు. మూవీ కోసం డిస్కషన్స్ చేస్తూ బ్రహ్మాండమైన ట్యూన్స్ కుదిరాయి. పాటలు విని మీరు చెప్పాలి. కిరణ్‌తో నేను చేస్తున్న రెండో చిత్రమిదిఅన్నారు. హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ గ్లింప్స్ రిలీజైనప్పటి నుంచి చెన్నై లవ్‌స్టోరీ మూవీ మీద చాలా అంచనాలు ఏర్పడుతున్నాయి. ఈ సినిమాలో కిరణ్ తో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. ఆయన ఈ చిత్రం తర్వాత మరింత గొప్ప ఇమేజ్ తెచ్చుకుంటారు. చెన్నై లవ్‌స్టోరీ మూవీలో ఇంత బరువైన, ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్ నేను చేయగలను అని నమ్మిన దర్శక నిర్మాతలకు థ్యాంక్యూ అని అన్నారు. నిర్మాత ఎస్.కె.ఎన్ మాట్లాడుతూ సినిమాను జూన్ 26 అనుకున్నాం కానీ ఆ తేదీన రామ్ చరణ్ పెద్ది సినిమా వస్తోంది. మా సినిమా రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటిస్తాం. అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ చెన్నై లవ్ స్టోరీ మూవీ డాల్బీలో చేస్తుండటం సంతోషంగా ఉంది. సినిమా కోసం మా టీమ్ అంతా చాలా ఎఫర్ట్స్ పెడుతున్నారు. మణిశర్మ ఏడు పాటలు కంపోజ్ చేశారు. ఏడు పాటల్ని మీరు థియేటర్స్ లో సెలబ్రేట్ చేసుకుంటారు అని అన్నారు.

# ఏప్రిల్ 17న ‘కాలగమనం’ విడుదల

పిఆర్ ఫిలిమ్స్ పతాకంపై రాజా బిరుదుల, లావణ్య రామారావు, చిన బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘కాల గమనం’. సుధాకర్ బుర్రి దర్శకత్వం వహిస్తూ, నిర్మిస్తోన్న ఈ లవ్ అండ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రం ఏప్రిల్ 17న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలయ్యేందుకు ముస్తాబైంది. ఇప్పటికే నిర్మాత ఎఎమ్ రత్నం విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ట్రెమండస్ రెస్పాన్స్‌ను సొంతం చేసుకుంది. ఏప్రిల్ 17న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత సుధాకర్ బుర్రి మాట్లాడుతూ “లెజెండరీ ప్రొడ్యూసర్ ఏఎమ్ రత్నం మా చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆ పోస్టర్ చాలా మంచి స్పందనను రాబట్టుకుంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించి అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఏప్రిల్ 17న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం. యూత్ మెచ్చే ఓ మంచి ప్రేమకథ ఇది. అదేవిధంగా పెద్దలను పిల్లలను ఆలోచింప చేసే సందేశాత్మక చిత్రమిది. అతి త్వరలోనే టీజర్ విడుదల చేయనున్నాము అని తెలిపారు. రాజా బిరుదుల, లావణ్యరామారావు, చిన్న బాబు కల్లా, డాక్టర్ జబర్దస్త్ రాజమౌళి, అన్నె శిరీష, సతీష్ సరిపల్లి, ఆర్కే నాయుడు, బలగం రమేష్, బలగం కర్తానందం, జబర్దస్త్ శాంతి కుమార్, శివ ప్రసాద్, తిరు నాచురల్ , చిన్నారావు దొడ్ల, సీతారాం తదితరులు నటించిన ఈ చిత్రానికిమ్యూజిక్ రాజేష్ రాజ్ తేలు, డి.ఒ.పి మురళి కంకణాల, ఎడిటర్ శ్రీకృష్ణ ప్రసాద్, నిర్వహణ పిల్లెం రామారావు.



# అసెంబ్లీలో కూనంనేని 4.22 గంటల ప్రసంగం



ప్రజాపక్షం/హైదరాబాద్: సిపిఐ శాసన సభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు శాసనసభలో తనకు మాట్లాడేందుకు లభించిన సమయంలో ప్రజా సమస్యలను లేవనెత్తి పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు మొత్తం పది రోజులలో 82.47 గంటల పాటు జరగగా 4.22 గంటల పాటు కూనంనేని సాంబశివరావు సభలో మాట్లాడారు. సభలో అత్యధికంగా శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 6.29 గంటల పాటు మాట్లాడారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిరవధికంగా వాయిదా వేస్తూ సభలో వివిధ పక్షాల నేతలు మాట్లాడిన సమయం వివరాలను ప్రకటించారు. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

| మాట్లాడిన వారి పేరు | సమయం (గంటలలో ) |
|---|---|
| ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి | 4.26 |
| ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క | 4.43 |
| శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు | 6.29 |
| బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకులు తన్నీరు హరీశ్‌రావు | 4.16 |
| బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.తారకరామారావు | 1.44 |
| బిఆర్‌ఎస్ ఎ ంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి | 47 |
| బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ వేముల ప్రశాంత్ రెడ్డి | 13 |
| బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి | 3.28 |
| ఎంఐఎం ఎంఎల్‌ఎ అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల | 1.57 |
| సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు | 4.22 |
| మొత్తం సభ కొనసాగిన సమయం | 82.47 |

# గడ్డి మందు నిషేధంపై అసెంబ్లీలో తీర్మానం భేష్

తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : పారక్వాట్ గడ్డి మందు నిషేదిస్తూ సోమవారం అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షనీయమని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి అన్నారు. అత్యంత విషపూరితమైన పారక్వాట్ వల్ల వందలాది మంది తెలంగాణ రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డి మందు, కలుపు మందు నిషేధించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రైతు సంఘాల నేతలు రైతు కమిషన్ దృష్టి కి తీసుకురావడం దీంతో రాష్ట్రంలో గడ్డి మం దు నిషేదించడంతో పాటు దేశంలో కూడా నిషేధించడానికి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని రైతు కమిషన్ కోరింది. ఈ నేపథ్యం లో రైతు కమిషన్ సూచన మేరకు అసెంబ్లీలో తీర్మానం పెట్టడం సంతోషమన్నారు. ఈ అంశంపై మంగళవారం కమిషన్ కార్యాలయం లో వ్యవసాయ అధికారులతో చర్చించారు. ఈ మందు అమెజాన్‌లో కూడా అందుబాటులో ఉండడంపై కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. అ మెజాన్‌కు లైసెన్స్ ఇవ్వడంపై, విష పూరితమైన గడ్డి మందును ఎట్లా సప్లై చేస్తుందని ప్రశ్నించా రు. అమెజాన్‌కు గడ్డి మందు విషయంపై నోటీసులు ఇవ్వాలని రైతు కమిషన్ అధికారులను ఆదేశించింది. ఇక భూసార పరీక్షా కిట్ల పనితీరుపై వ్యవసాయ అధికారులను కమిషన్ అడిగి తెలుసుకుంది. రైతుల్లో భూసార పరీక్షపై మరిం త అవగాహన కల్పించాలని నేలకు తగ్గట్టుగా రై తులు పంటలను సాగుచేసేలా చూడాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచించారు. పంటల మార్పిడి విధానంపై కూడా రైతుల్లో పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, కెవిఎన్ రెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయ శాఖ అధికారులు గీతారెడ్డి, సుచరిత, శ్రీధర్ తోపాటు కమిషన్ అధికారులు సంధ్యా రాణి, హరి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ కమ్యూనిస్టు కొండిగారి రాములు

ఎంతో మందికి స్ఫూర్తి సంస్మరణ సభలో వక్తలు



ప్రజాపక్షం/రంగారెడ్డి/ ఇబ్రహీంపట్నం: ఉత్తమ కమ్యూనిస్టుగా అనేకమందికి స్ఫూర్తిని నింపిన నాయకుడు ఇబ్రహీంపట్నం మాజీ ఎంఎల్ ఎ కొండిగారి రాములు అని సి పిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు.రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని మంచాల్ రోడ్ లో భారత్ గార్డెన్‌లో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఇటీవల మరణించిన కొండిగారి రాములు సంస్మరణ సభ నిర్వహించడం జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కావాలి నరసింహా అధ్యక్షతన జరిగిన ఈ సభలో కూనంనేనితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య,సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంత రావు,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య,సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు,రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఓరుగంటి యాదయ్య,ఫైమీద,రామకృష్ణ, రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ చిన్న వయసులోనే కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులైన కొండిగారి రాములు ఈ ప్రాంతంలో జరిగిన అనేక పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. పేదలకు భూములు పంపిణీ చేయటం, కూలీ రేట్లు పెంచడం,కుల వివక్షతకు వ్యతిరేకంగా జరిగిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇప్పించడంలో విశేష కృషి చేశారని తెలిపారు.అంతేకాకుండా తన తుది శ్వాస విడిచేంతవరకు కమ్యూనిస్టుగా నిరాడంబరమైన జీవితాన్ని గడిపారని కూనంనేని కొనియాడారు. కమ్యూనిస్టు విలువ బతికున్నప్పుడు తెలవదు, అతను మరణించిన తర్వాతే తెలుస్తుందన్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో చూసినట్లయితే సురవరం సుధాకర్ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు, గిరి ప్రసాద్,సీతారాం, పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, ధర్మ బిక్షం, బి.ఎన్.రెడ్డి, మల్లు స్వరాజ్యం, ఇలా అనేకమందిని ఏ పదవులు అనుభవించకపోయిన మంత్రులు, ముఖ్యమంత్రుల కంటే ఎక్కువగా ప్రజలు ఆదరణ చూపిస్తారని గుర్తు చేశారు. నేడు సోషల్ మీడియా, విద్వేష పూరితమైన ప్రసంగాల పేరుతో అణచి వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో విచిత్రమైన బిల్లును తీసుకువచ్చిందన్నారు. కాంగ్రెస్ తో మనకు స్నేహం ఉన్నప్పటికీ ఈ బిల్లును మనం వ్యతిరేకించడం జరిగిందన్నారు.దీన్ని రాష్ట్రంలో బిజెపి వ్యతిరేకిస్తున్నప్పటికీ, కేంద్రంలో బిజెపి తీసుకువచ్చిన అనేక చట్టాలతో ఇప్పటికీ ఉక్కిరిబిక్కిరి అవుతుంటే, అదే మాదిరిగా కాంగ్రెస్ చేస్తే.. స్నేహం కొన్ని అంశాలకే పరిమితమవుతుందని తెలిపారు.

**మావోయిస్టులు – మా రక్తమే**

దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని శపథం చేసిన అమిత్ షా కేంద్ర కమిటీని అంతం చేశామని చెప్పుకోవడం జరుగుతుందని, మావోయిస్టులుగా వున్నా వారిని తాత్కాలికంగా అంతం చేయవచ్చు కానీ కమ్యూనిస్టులను చేయగలుగుతావని సాంబశివరావు ప్రశ్నించారు. మావోయిస్టుల సైతం కమ్యూనిస్టు పార్టీ నుండి పోయిన వారేనని,వారు మా రక్తమేనని తెలిపారు. అంతకు ముందు కామ్రేడ్ కొండిగారి రాములు సేవలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు,సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య,సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి,సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పుస్తకాల నర్సింగరావు లు అయన పార్టీ కి, ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి వందన సమర్పణ చేయగా కార్యక్రమంలో సిపి ఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభులింగం, సామిడి శేఖర్ రెడ్డి, నిలమ్మ, పబ్బతి లక్ష్మణ్, బాతురాజు నరసింహ,శీను నాయక్,పి శివకుమార్, సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## కోలుకున్న సోనియా...

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉందని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దీంతో ఆమె అభిమానులు, పార్టీ నేతలు ఊపిరిపీల్చుకున్నారు.

## మూసీ పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

మూసీ పునరావాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్‌తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకుని ముందుకు వెళ్లాలని అధికారులకు ఆయన సూచించారు. ‘సిఎం రేవంత్ రెడ్డి యావత్ మంత్రివర్గ సంకల్పాన్ని అర్థం చేసుకుని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలి. మీ జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఎలాంటి సలహాలు, సూచనలు ఇతర ఏ అవసరాలు ఉన్నా మూసీ సబ్ కమిటీ సభ్యులు 24 గంటలూ అందుబాటులో ఉంటారు’ అని అధికారులకు డిప్యూటీ సిఎం చెప్పారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి ఈ.వి.నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మన చౌదరి, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## దంపతుల ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

ఉండటాన్ని గమనించింది. ఆమె పదేపదే తలుపు తట్టినా లోపల ఉన్న భర్త స్పందించలేదు. దీంతో ఆందోళన చెందిన ఆమె భద్రతా సిబ్బందిని, ఇరుగుపొరుగును అప్రమత్తం చేసింది. వారు బలవంతంగా తలుపు తెరిచి చూడగా... భాను మత దేహం కనిపించింది. కొన్ని నిమిషాల తర్వాత షాజియా అదే నివాస సముదాయంలోని 17వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో రెండు కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. తెలంగాణలో కుటుంబ సభ్యులు దాఖలు చేసిన ఫిర్యాదుల ఆధారంగా రెండు వేర్వేరు బలవంతపు మరణాలు కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ జంట ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## వ్యాట్ తగ్గించండి

(మొదటి పేజీ తరువాయి)

కథనాలు వెల్లడించాయి. ఏప్రిల్ 1న ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ధరలు సవరిస్తారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన ధరలు పెంచితే... విమాన టికెట్లపై భారం పడే అవకాశం ఉంది. అందువల్ల కేంద్ర మంత్రి ఈ అభ్యర్థనలు పంపినట్లు తెలుస్తోంది. ‘దిల్లీలో విమాన ఇంధనంపై విలువ ఆధారిత పన్ను(వ్యాట్) 25 శాతం ఉంది. మహారాష్ట్రలో 18 శాతం, తమిళనాడులో 29 శాతం వ్యాట్ అమలుచేస్తున్నారు. వీటిని తగ్గిస్తే విమాన టికెట్లపై భారం పడకుండా ఉంటుంది’ అని కేంద్ర మంత్రి తన లేఖలో పేర్కొన్నారు.

## తల్లి ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

సంతానం. కాగా, స్రవంతికి చెల్లెలి వరుసయ్యే మహేశ్వరిని ఏడాది క్రితం ప్రవీణ్ రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటినుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీనిపై పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు సైతం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రవీణ్ భార్యతో విడిపోయి అక్కడి సమీపంలో మరో ఇంట్లో నివాసం ఉంటున్నాడు. పగలు రాత్రి తేడా లేకుండా మద్యం సేవించి స్రవంతి వద్దకు వచ్చి ప్రవీణ్ నిత్యం వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో చివరిసారిగా మూడు రోజుల క్రితం ప్రవీణ్ సొంతూరైన మాణిక్యం తండాలో మళ్లీ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ప్రవీణ్, స్రవంతిలు కలిసి ఉండాలని పెద్దలు తీర్మానించి పంపించినట్లు తెలుస్తోంది. దంపతులిద్దరూ సోమవారం నగరానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం ప్రవీణ్ పనులకు వెళ్లి మధ్యాహ్నం భోజన సమయానికి తిరిగివచ్చారు. అప్పటికే స్రవంతి తలుపు గడియ పెట్టుకుని ఎంతకీ తీయలేదు. ఇరుగుపొరుగు సహాయంతో తలుపు బద్దలు కొట్టి చూడగా భార్యతో పాటు ఇద్దరు కుమారుల మృతదేహాలు ఇంటిపై కప్పునకు వేళాడుతూ కనిపించాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com